సోమవారం 19-3-2018

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16+20 వెల: ₹5.00
సంపుటి: 10
సంచిక: 357

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



విజేత భారత్

శ్రీలంక ఇండిపెండెన్స్ కప్ 'నిదహస్ ట్రోఫీ' టి20 టోర్నమెంట్ టైటిల్‌ను భారత్ సొంతం చేసుకుంది. ఆదివారం ఉత్కంఠగా సాగిన ఫైనల్లో భారత్ 4 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది.

–స్పోర్ట్స్‌లో

జమ్మూ కశ్మీర్లో పాక్ దుశ్చర్య

పూంచ్ సెక్టార్లో పాక్ కాల్పులు
ఒకే కుటుంబంలో ఐదుగురి మృతి

5 లో



ఆదివారం విళంబి నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రం వద్ద బ్రహ్మశ్రీ ప్రబల సుబ్రహ్మణ్య శాస్త్రి చేస్తున్న పంచాంగ పఠన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు దంపతులు, స్పీకర్ కోడెల, ఇతరులు

3 లో



గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కాకుమాను గ్రామ శివార్లలో ప్రజా సంకల్ప పాదయాత్ర బస వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల్లో పండితుడు వెంకట రామకృష్ణ శాస్త్రి పంచాంగ పఠనాన్ని వింటున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్. చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

3 లో

వైఎస్ జగన్ సీఎం కావడం తథ్యం

ఉగాది వేడుకల్లో పంచాంగకర్తల పంచాంగ పఠనం

అక్టోబర్ 25 నాటికి జగన్ జాతకంలో ఉన్న గోచార సమస్యలు సమాప్తం
వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 135 సీట్లు ఖాయం
2019 మేలో జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారు
వైఎస్సార్ అందించిన సువర్ణ పాలనను ప్రజలు మళ్లీ చూస్తారు

నేడు మళ్లీ అవిశ్వాసం

కేంద్రంపై రెండోసారి అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన వైఎస్సార్‌సీపీ

- కేంద్ర మంత్రి మండలి సభా విశ్వాసాన్ని కోల్పోయిందని స్పష్టీకరణ
- మరో నోటీసు ఇచ్చిన తెలుగుదేశం పార్టీ
- సోమవారం లోక్‌సభ స్పీకర్ ముందుకు రెండు నోటీసులు
- సభ ఆర్డర్‌లో ఉందని భావిస్తే చర్చకు అనుమతి
- స్పీకర్ ఏ నోటీసును పరిగణనలోకి తీసుకున్నా మద్దతిస్తామన్న వైఎస్సార్‌సీపీ



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన పోరాటంలో భాగంగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసు సోమవారం లోక్‌సభ స్పీకర్ ముందుకు రానుంది. పార్టీ తరపున ఎంపీ వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం లోక్‌సభ సెక్రెటరీ జనరల్ స్నేహలతా శ్రీవాత్సవకు మరోసారి అవిశ్వాసం నోటీసు అందజేసిన సంగతి తెలిసిందే. నిబంధనల ప్రకారం కేంద్ర మంత్రి మండలి సభా విశ్వాసాన్ని కోల్పోయిందని ఆయన నోటీసులో పేర్కొన్నారు. టీడీపీ ఎంపీ

మిగతా 2వ పేజీలో ▶

నేడే ప్రజా సంకల్ప మానవహారాలు

- కేంద్రంపై వైఎస్సార్‌సీపీ అవిశ్వాస తీర్మానానికి సంఘీభావం
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహణ
- గుంటూరు జిల్లా కొమ్మూరు వద్ద 'మానవహారం'లో పాల్గొననున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

2 లో



మాది ధర్మయుద్ధం

బీజేపీ, ఆరెస్సెస్‌లు అధికార దాహంతో ఉన్న కౌరవులు
ప్లీనరీలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



- అవినీతికి పర్యాయపదంగా మోదీ
- బీజేపీ అధ్యక్షుడిపై హత్యారోపణలు
- యూపీఏ హయాం చివర్లో తప్పులు చేశాం
- కాంగ్రెస్ పునరుత్తేజం ఖాయం..
- నేతలు, కార్యకర్తల మధ్య గోడలను తొలగిస్తాం

5 లో

పాపం ప్రభుత్వానిదే!

- గుంటూరు అతిసార ఘటనలో అడుగడుగునా నిర్లక్ష్యమే
- ఇప్పటి వరకు 17 మంది మృత్యువాత
- వారం రోజుల వరకూ కారణం కనిపెట్టలేని దుస్థితి

6 లో



మురుగు కాలువల్లో ఉన్న మంచినీటి పైపులైనులు

ప్రజాసంకల్ప యాత్ర 115వ రోజు



నేటి పాదయాత్ర షెడ్యూల్

ప్రారంభం: ఉదయం 7.30 గంటలకు కాకుమాను సమీపంలో..

ముఖ్యాంశాలు

- ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కాకుమాను, పెద్దివారిపాలెం క్రాస్, కొమ్మూరు, నాగులపాడు, పెదనందిపాడులో జనంతో మమేకం
- కొమ్మూరులో ప్రజాసంకల్ప మానవహారంలో పాల్గొంటారు.
- పెదనందిపాడులో బహిరంగ సభ

నేడు మళ్లీ అవిశ్వాసం



▶ మొదటి పేజీ తరువాయి

తోట నరసింహం కూడా అవిశ్వాస తీర్మానం నోటీసును స్నేహలతా శ్రీవాత్సవకు అందజేశారు.

ఏం జరుగుతుందో..?

వైఎస్సార్‌సీపీ ఈ నెల 15వ తేదీన తొలిసారి అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వగా... టీడీపీ కూడా ఆ మరుసటి రోజు ఇదే నోటీసును ఇచ్చింది. కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదనకు అవసరమైన సంఖ్యా బలం ఉన్నప్పటికీ, సభ ఆర్డర్‌లో లేదని చెబుతూ ఈ నోటీసులను పక్కనపెట్టినట్లు 16వ తేదీన లోక్‌సభ స్పీకర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో పట్టు వదలకుండా అదేరోజు సాయంత్రం వైవీ సుబ్బారెడ్డి మరో నోటీసు ఇచ్చారు. వైవీ, తోట నరసింహం ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులను సోమవారం మధ్యాహ్నం 12 గంటల తరువాత లోక్‌సభ స్పీకర్ మళ్లీ పరిగణనలోకి తీసుకోనున్నందున ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయోనని రాష్ట్ర ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

సభ ఆర్డర్‌లో ఉందని స్పీకర్ భావిస్తే వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులు లోక్‌సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. నోటీసుల ఆమోదానికి సభలో తగిన సంఖ్యాబలం ఉందని ఇప్పటికే నిరూపితమైంది. కాబట్టి స్పీకర్ అనుమతిస్తే చర్చ జరగనుంది. తర్వాత ప్రధానమంత్రి సమాధానమిస్తారు.

మా నోటీసుకు మద్దతు లభిస్తుంది: వైవీ సుబ్బారెడ్డి

తామిచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసుకు ఇతర పార్టీల నుంచి తగినంత సంఖ్యాబలంతో మద్దతు లభిస్తుందని వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చే విషయంలో తమ పార్టీయే ముందంజలో ఉందని, ఇతర పార్టీల మద్దతును కూడగట్టుకోవడంలో కూడా తాము ముందున్నామని పేర్కొన్నారు. తొలిసారి నోటీసు ఇచ్చినపుడే తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మద్దతు కోరుతూ రాజకీయ పార్టీలకు లేఖలు రాశారని గుర్తుచేశారు. తమకు మద్దతు ఇచ్చేందుకు చాలా పార్టీలు ముందుకొచ్చాయన్నారు. తాము తొలుత ఇచ్చిన నోటీసును శుక్రవారం లోక్‌సభలో తోసిపుచ్చినప్పటికీ తాము వెనుకడుగు వేయలేదని చెప్పారు.

మాట మార్చిన చంద్రబాబు

ప్రత్యేక హోదా కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అలుపెరుగని పోరాటం కొనసాగిస్తోంది. ఈ బడ్జెట్ సమావేశాల్లో తమ పార్టీ ఎంపీలు ప్రత్యేక హోదా కోసం గట్టిగా గళం విప్పుతారని, కేంద్రం సానుకూలంగా స్పందించకపోతే పదవులకు రాజీనామాలు చేస్తారని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. కేంద్రంపై ఒత్తిడి పెంచడంలో భాగంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ పోరాటంలో తమతో కలిసి రావాలని అధికార తెలుగుదేశం పార్టీకి పిలుపునిచ్చారు. తమ పార్టీ పెట్టబోయే అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఒకవేళ టీడీపీ అవిశ్వాసం పెట్టినా మద్దతు ఇచ్చేందుకు తాము సిద్ధమేనని ప్రకటించారు. అవిశ్వాసం వల్ల ఒరిగేదేమీ ఉండదని తొలుత ఎద్దేవా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు చివరకు ప్రత్యేక హోదా పోరాటం విషయంలో తాను వెనుకబడిపోతున్నానని గ్రహించి, వైఎస్సార్‌సీపీ ఇచ్చే అవిశ్వాసం నోటీసుకు చాలినంత సంఖ్యాబలం లభిస్తే తానూ మద్దతిస్తానని చెప్పారు. తర్వాత ఒక్కరోజులోనే వైఖరిని మార్చుకుని తామే స్వయంగా అవిశ్వాసం నోటీసు ఇస్తామన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ నోటీసును ఇవ్వగా, హడావుడిగా శుక్రవారం టీడీపీ నోటీసు ఇచ్చింది. సభ ఆర్డర్‌లో లేదంటూ స్పీకర్ ఈ రెండు నోటీసులను తోసిపుచ్చారు. తర్వాత వైఎస్సార్‌సీపీ మళ్లీ అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చింది. ప్రత్యేక హోదా విషయంలో తెలుగుదేశం పార్టీ వైఖరి స్థిరంగా లేదని, ఎప్పటికప్పుడు మాట మారుస్తోందని, అందుకే తాము అవిశ్వాస తీర్మానం నోటీసు మళ్లీ ఇచ్చినట్లు వైఎస్సార్‌సీపీ చెబుతోంది. వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఇచ్చిన రెండు నోటీసుల్లో స్పీకర్ దేన్ని పరిగణనలోకి తీసుకున్నా తాము దానికి మద్దతుగా సభలో లేచి నిలబడతామని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఇప్పటికే ప్రకటించారు. రాజకీయ ప్రయోజనాలు కాదని, రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని తేల్చిచెప్పారు.

నేడే ప్రజా సంకల్ప మానవహారాలు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహణ

సాక్షి, అమరావతి/అమరావతి బ్యూరో: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు లోక్‌సభలో ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం సోమవారం చర్చకు రానున్న సందర్భంగా రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజా సంకల్ప మానవహారం కార్యక్రమాలను సోమవారం నిర్వహించనున్నారు. పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ సీనియర్ నేతలతో చర్చించి నిర్దేశించిన ఈ కార్యక్రమంలో పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, మేధావులు భాగస్వాములుకానున్నారు. రాష్ట్ర ప్రజల ప్రత్యేక హోదా ఆకాంక్ష ఢిల్లీకి తెలిసి వచ్చేలా ప్రజా సంకల్ప మానవహారాన్ని విజయవంతం చేయాలని పార్టీ కేంద్ర కార్యాలయం పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేసింది. ఆయా జిల్లాల్లోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు శ్రద్ధ తీసుకుని కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహించాలని పార్టీ కోరింది. కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర మార్గంలో.. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొమ్మూరు వద్ద ప్రజా సంకల్ప మానవహారంలో ప్రతిపక్ష నేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని పార్టీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురామ్ ఆదివారం తెలిపారు.

పీఆర్సీ బకాయిలు ఇంకెప్పుడు: వైఎస్సార్‌టీఎఫ్

సాక్షి, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పదో పీఆర్సీ బకాయిల గురించి ఎన్నిసార్లు విన్నవించినా సీఎం చంద్రబాబు హామీలు ఇవ్వడమే తప్ప విడుదల చేయకపోవడం అన్యాయమని వైఎస్సార్‌టీఎఫ్ పేర్కొంది. ఈ మేరకు వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్ష, కోశాధికారులు వి.రెడ్డిశేఖరరెడ్డి, సుధీర్, కె.వెంకటరెడ్డిలు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2018 బడ్జెట్లో కూడా పీఆర్సీ బకాయిలపై పరిశీలిస్తున్నామని చెప్పడం చూస్తుంటే ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతోందన్నారు. పీఆర్సీ బకాయిల చెల్లింపులను జాప్యం చేస్తూ అదే సమయంలో కాంట్రాక్టర్లకు అంచనాలు పెంచి మరీ చెల్లింపులు చేస్తున్నారని దుయ్యబట్టారు. సర్వీసు రూల్స్ విషయంలో టీచర్లు ఆందోళనలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా జేఏసీ చైర్మన్ అశోక్‌బాబు ఉద్యోగులను మోసం చేయడం మాని ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్ల సాధనకు ప్రత్యక్ష ఆందోళనకు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విజయవాడలో నేడు ప్రత్యేక హోదాపై 'రౌండ్‌టేబుల్'

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలనే డిమాండ్‌తో సోమవారం విజయవాడలో అఖిలపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరగనుంది. హోదా సాధన పోరులో భాగంగా కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్న తరుణంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విజయవాడలోని ఐవీ ప్యాలెస్‌లో ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి టీడీపీ, బీజేపీ తప్ప మిగతా రాజకీయ పార్టీలు, పలు ప్రజా సంఘాల నేతలు హాజరుకానున్నారు. గత నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా సాధన కోసం విపక్షాలు ఆందోళన చేస్తున్నా ప్రధాని నరేంద్ర మోదీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విపక్ష పార్టీలు ఆరోపించాయి. ఈ సమావేశానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, శాసనమండలి ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తులసిరెడ్డి, లోక్‌సత్తా అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ, ఉత్తరాంధ్ర చర్చా వేదిక అధ్యక్షుడు కొణతాల రామకృష్ణ, ఆప్ రాష్ట్ర శాఖ కన్వీనర్ పోతిని వెంకట రామారావు, చలసాని శ్రీనివాస్ తదితరులు హాజరుకానున్నారు.

జగన్‌పై తప్పుడు కేసులను కొట్టేస్తారు

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టీకరణ
- సోనియా–చంద్రబాబు కుమ్మక్కై కేసులు పెట్టించారు
- ధర్మం ఎప్పటికైనా గెలవక తప్పదు
- ఒక్క కేసులోనూ కోర్టులో అడుగుపెట్టకుండా చంద్రబాబు మేనేజ్ చేసుకున్నారు
- కానిస్టేబుల్‌తో విచారణ జరిపించినా సీఎంకు 160 నెలలకు కూడా బెయిల్ రాదు



సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాస్తవానికి ఏ తప్పూ చేయలేదని, ఆయనపై సోనియాగాంధీ–చంద్రబాబు నాయుడు కుమ్మక్కై ఉద్దేశపూర్వకంగా పెట్టించిన కేసులన్నింటినీ కచ్చితంగా కొట్టివేస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆయన ఆదివారం హైదరాబాద్‌లో పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌పై కేసులు కొట్టేస్తారేమోనని చంద్రబాబు అనడం, దాన్ని ఓ పత్రిక పతాక శీర్షికన ప్రచురించడాన్ని భూమన ప్రస్తావించారు. తప్పుడు ఆరోపణలతో అన్యాయంగా, అక్రమంగా, మోసపూరితంగా అభియోగాలు మోపుతూ జగన్‌పై పెట్టిన కేసులను రాజ్యాంగం, న్యాయం, చట్టంపై గౌరవం ఉన్న న్యాయస్థానాలు కచ్చితంగా కొట్టివేస్తాయని తేల్చిచెప్పారు. అవి సోనియాగాంధీ, చంద్రబాబు కలిసి బనాయించిన కేసులేనని, అందులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేవు కాబట్టి కచ్చితంగా కొట్టివేయాల్సిన కేసులేనని చెప్పారు. ధర్మం ఎప్పటికైనా గెలవక తప్పదని అన్నారు. భూమన కరుణాకర్‌రెడ్డి ఇంకా ఏం చెప్పారంటే...

''చట్టంపై నమ్మకం లేని చంద్రబాబు, ఆయన మంత్రిమండలి, ఆయన ఎమ్మెల్యేలు, తైనాతీలకు ఈ కేసులపై అనుమానాలు ఉండొచ్చు గానీ మాకు మాత్రం చట్టం, న్యాయంపై అపారమైన నమ్మకం ఉంది. అందుకే ఈ కేసులపై విచారణ చేస్తున్న న్యాయస్థానాలు నిజాలను నిగ్గు తేలుస్తాయనే విశ్వాసం మాకు ఉంది. జగన్‌పై కేసులను కొట్టివేయకుంటే తప్ప ఆయనను ఎదుర్కోలేమని భయపడిపోతున్నావా చంద్రబాబూ? జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక రెండున్నర దశాబ్దాలుగా శత్రువుగా చూసిన కాంగ్రెస్‌తో కూడా చేతులు కలుపుతున్నారు. తనను జగన్ ధిక్కరించారని సోనియాగాంధీ రగిలిపోతూ ఉంటే ఆజ్యం పోసింది టీడీపీ కాదా? సోనియాతో కలిస్తే గానీ జగన్‌ను ఎదుర్కోలేమని భావించి ఆయనపైకి సీబీఐని ఉసిగొల్పిన మాట నిజం కాదా? సోనియాను జగన్ ధిక్కరించి ఉండకపోతే, చంద్రబాబు పాత్ర లేకుండా ఉంటే జగన్‌పై ఒక్క కేసయినా ఉండేదా? సోనియా అడుగులకు మడుగులు ఒత్తని కారణంగా తప్పుడు కేసులు బనాయించడం వాస్తవం కాదా? చంద్రబాబు ఇంకా ఎంతకాలం అబద్ధాల శవపేటికను మోస్తారు.

అడ్డదార్లు జగన్‌కు తెలియదు

రాజ్యాన్ని, రాజ్యాంగాన్ని, చట్టాన్ని... దేన్నయినా మేనేజ్ చేయగలనన్న ధీమాతో, నీచమైన సంస్కృతిలో పెరిగినవాడు చంద్రబాబు. మాకు ఈ వ్యవస్థలపై నమ్మకం ఉంది. జగన్‌పై కోపంతోనే చంద్రబాబు అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిశారు. తన ఎమ్మెల్యేలకు విప్ జారీ చేసి మరీ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని కాపాడారు. చంద్రబాబు చీకట్లో చిదంబరం కాళ్లు పట్టుకున్నది నిజం కాదా? అప్పటి న్యాయశాఖ మంత్రి భరద్వాజకు పాదపూజ చేసిన విషయం వాస్తవం కాదా? చంద్రబాబు ఓటుకు కోట్లు కేసులో ఇరుక్కొని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సాష్టాంగపడి పదేళ్ల ఉమ్మడి రాజధాని అయిన హైదరాబాద్ నుంచి అమరావతికి పారిపోయి రావడం నిజం కాదా? ఏ తప్పూ చేయకపోయినా జగన్‌పై కేసులు బనాయించి, 16 నెలలపాటు జైల్లో పెట్టించారు. చంద్రబాబుపై ఎన్ని అవినీతి ఆరోపణలు వచ్చినా ఒక్క కేసులో కూడా కోర్టులో అడుగుపెట్టకుండా మేనేజ్ చేసుకోగలిగారు. జగన్‌మోహన్‌రెడ్డి కేసుల కోసం లాలూచీ పడేవారే అయితే అప్పట్లోనే సోనియాగాంధీకి జై అనేవారు. ఆ పని చేసి ఉంటే ఎనిమిదేళ్ల క్రితమే ముఖ్యమంత్రి అయ్యేవారు. చంద్రబాబులాగా అడ్డదార్లు తొక్కి రాజకీయాలు చేయడం జగన్‌కు తెలియదు.

జనం రక్తాన్ని పీల్చేస్తున్నారు

నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో అవినీతి వేయి ఊడల మర్రిలాగా విస్తరించింది. అమరావతిలో రైతుల నుంచి వేలాది ఎకరాల భూములను లాక్కొని ఇప్పటిదాకా ఒక్క ఇటుక కూడా వేయలేదు. అమరేశ్వరుడి భూములను చంద్రబాబు తన తైనాతీలకు కట్టబెట్టారు. కిందిస్థాయిలో పచ్చచొక్కాల వారు రాబందుల్లా, జలగల్లా జనం రక్తాన్ని పీల్చేస్తున్నారు. రూ.మూడున్నర లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డ చంద్రబాబు ఆ డబ్బును వచ్చే ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు పెట్టబోతున్నారు.

విచారణకు సిద్ధమా బాబూ!

చంద్రబాబు పాలనలో తప్పులు, అవినీతి ఏమాత్రం జరుగనట్లు పచ్చ పత్రికలు, కొన్ని వార్తా చానళ్లు ప్రజలను ఇంకా భ్రమల్లోనే ఉంచేలా రాతలు రాస్తున్నాయి.. ప్రసారాలు చేస్తున్నాయి. కానీ, ప్రజలు అన్నీ గుర్తిస్తున్నారు. జగన్‌లోని పోరాట తత్వాన్ని, నిజాయతీని జనం గుర్తించారు. ఉదయం 9 గంటలకు ఎన్డీయేతో తెగతెంపులు చేసుకుని, 9.30 గంటలకు కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని టీడీపీ నిర్ణయం తీసుకోగానే అన్ని పార్టీలూ చంద్రబాబు వెనుక చేరాయని పచ్చ పత్రికలు ఆకాశానికి ఎత్తేశాయంటే అవి సీఎంను ఏ స్థాయిలో మోస్తున్నాయో అర్థమవుతోంది. వైఎస్ జగన్ మూడున్నరేళ్లుగా ఊరూరా తిరిగి ప్రత్యేక హోదా కావాలన్న భావనను ప్రజల్లో బలోపేతం చేశారు. జగన్ కేసులను కొట్టేస్తారేమో అని చంద్రబాబు మాట్లాడడం చూస్తోంటే ఆయనకు కోర్టులపై ఇసుమంతైనా విశ్వాసం లేదనే విషయం స్పష్టమవుతోంది. ప్రస్తుతం జగన్ కేసులన్నీ న్యాయస్థానాలకు చేరాయి. ఏ తప్పూ చేయని జగన్ కడిగిన ఆణిముత్యంలాగా బయటకు వస్తారు. కేసులను కొట్టేస్తారేమోనని చంద్రబాబు అంటున్నారంటే కోర్టులను కూడా మేనేజ్ చేయొచ్చని అర్థమా? ఇప్పటిదాకా చంద్రబాబుపై పదుల సంఖ్యలో ఆరోపణలు వచ్చినా కోర్టుకు వెళ్లకుండా ఉన్నారంటే ఆయన మేనేజ్ చేసుకున్నారనే అనుమానాలు కలుగుతున్నాయి. చంద్రబాబు, ఆయన అనుచరులు పాల్పడిన అవినీతిపై ఒక్క కానిస్టేబుల్‌తో విచారణ జరిపించినా వారికి 16 నెలలు కాదు, 160 నెలలకు కూడా బెయిల్ రాదు. వారందరి కోసం ప్రత్యేకంగా ఒక జైలునే నిర్మించాల్సి ఉంటుంది. వ్యవస్థలను మేనేజ్ చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. చంద్రబాబుకు దమ్ముంటే తనపై వచ్చిన ఆరోపణలన్నింటిపైనా విచారణకు సిద్ధపడాలి'' భూమన సవాల్ విసిరారు.

పీఠం కదులుతోందన్న భయంతోనే..

హోదాపై బాబు యూ టర్న్: కాంగ్రెస్ ధ్వజం



ఆదివారం ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద మౌన దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: గత నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా విషయంలో మాటలు మార్చిన సీఎం చంద్రబాబు చివరికి ప్రజల ఆగ్రహాన్ని గుర్తించి మళ్లీ ప్రత్యేక హోదా కోరుతున్నారని ఏపీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి ధ్వజమెత్తారు. ఏపీకి ప్రత్యేక హోదా కోరుతూ కాంగ్రెస్ నేతలు ఆదివారం ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రఘువీరా మీడియాతో మాట్లాడుతూ.. హోదా విషయంలో తానే చాంపియన్ అన్న రీతిలో ప్రచారం చేయించుకుంటున్న చంద్రబాబు డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. హోదా అమలు చేసేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని, పార్టీ ప్లీనరీలో కూడా తీర్మానం చేసిందని చెప్పారు. సీఎం పీఠం కదులుతోందన్న భయంలోనే చంద్రబాబు ప్రత్యేక హోదా కావాలని కోరుతున్నారని ఎంపీ కేవీపీ రామచంద్రారావు విమర్శించారు. కాగా, ఆదివారం ప్లీనరీ వేదికపై నుంచి ఏపీ తరపున కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరముందన్నారు. ఈ సమావేశాల్లో పీసీసీ చీఫ్ ఎన్.రఘువీరా, ఎంపీలు కేవీపీ రాంచంద్రరావు, టి.సుబ్బిరామిరెడ్డి, పార్టీ నేతలు సి.రామచంద్రయ్య, నాదెండ్ల మనోహర్, కనుమూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

■ అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి శశికళ భర్త నటరాజన్‌కు శనివారం రాత్రి గుండెపోటు వచ్చింది. దీంతో ఆయన్ని వెంటనే చెన్నై శివారులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కృత్రిమ శ్వాస అందిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. ఆందోళనలో పడ్డ కుటుంబీకులు శశికళకు సమాచారం అందించారు.

తల్లిని హతమార్చి.. తలను పట్టుకెళ్లి..

పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన తనయుడు

టీ.నగర్ (చెన్నై): ఆస్తి కోసం కన్న తల్లిని హతమార్చాడో ప్రబుద్ధుడు. తల్లి తలను తెగనరికి తలతో పాటు పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ అమానవీయ ఘటన తమిళనాడు పుదుక్కోట్టై జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. కరంబకుడి సమీపాన మరవంబట్టి గ్రామానికి చెందిన తంగరాజ్ ఏడేళ్ల క్రితం మృతిచెందాడు. అతనికి భార్య తిలగరాణి(48), ఐదుగురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు ఆనంద్(23) ఆస్తి పంచివ్వాలంటూ తల్లితో తరచూ తగాదాకు దిగేవాడు. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం 8.30 గంటలకు రాణికి, ఆనంద్‌కు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ గొడవలో ఆనంద్ కత్తితో తల్లి రాణి తల తెగనరికాడు. తల్లి తలను బైక్‌లో పట్టుకెళ్లి కరంబకుడి పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు.

ఇంకాజాత్



మన ఆశయాలకనుగుణంగా కాస్త మార్పు చేశాం అంతే సార్!




ప్రత్తిపాడు నియోజకవర్గం కాకుమాను గ్రామ శివార్లలో పాదయాత్ర బస వద్ద ఏర్పాటు చేసిన ఉగాది వేడుకలకు పంచెకట్టులో హాజరై సభికులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉగాది వేడుకల సభకు హాజరైన నేతలు, ప్రజలు

జగన్ ముఖ్యమంత్రి కావడం తథ్యం

- ఉగాది వేడుకల్లో పంచాంగకర్తల పంచాంగ పఠనం
- అక్టోబర్ 25 నాటికి జగన్ జాతకంలోని గోచార సమస్యలు సమాప్తం
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 135 సీట్లు ఖాయం

ప్రజాసంకల్ప యాత్ర నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆశీర్వాదం, ప్రజా సంకల్పంతో ముఖ్యమంత్రి కావడం తథ్యమని పంచాంగకర్తలు భవిష్యవాణి వినిపించారు. 2019 మే నెలలో జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని చెప్పారు. మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సువర్ణ పాలనను ప్రజలు మళ్లీ చూడబోతున్నారని పేర్కొన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం గుంటూరు జిల్లా కాకుమానులో పంచాంగ శ్రవణ కార్యక్రమంలో వైఎస్ జగన్‌కు పురోహితులు ఆశీర్వాదం అందించారు. ప్రజాసంకల్ప యాత్ర శిబిరం వద్ద జరిగిన ఉగాది వేడుకల్లో ప్రముఖ పంచాంగకర్త శ్రీరామకృష్ణ శర్మ, నల్లపెద్ది ప్రసాదశివరామ శర్మ తమ బృందంతో పాల్గొని పంచాంగ శ్రవణం చేశారు.

మహారుద్ర సహిత సహస్ర చండీయాగం నిర్వహిస్తాం

విళంబి అంటే పొడవైనదనే అర్థం వస్తుందని, అధిక మాసాలు ఎక్కువ ఉన్నందున దీన్ని పొడవైన సంవత్సరంగా భావించవచ్చని శ్రీరామకృష్ణ శర్మ తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 25 వరకూ జగన్‌మోహన్‌రెడ్డి జాతకంలో ఉన్న గోచార సమస్యలు పూర్తి కానున్నాయని తెలిపారు. అవి పూర్తి కాగానే జగన్ కీర్తి మరింత పెరుగుతుందని, 2019 ఎన్నికలకు ముందే ఆయనకు బుధ మహాదశ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇదంతా తాము ముఖస్తుతి కోసం చెప్పడం లేదన్నారు. 2019లో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 135 అసెంబ్లీ సీట్లు వస్తాయని, జగన్ ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు. 40 మంది పంచాంగకర్తలం కూర్చుని భవిష్యత్తులో జరగబోయేదాన్ని అంచనా వేశామని, ఈ అంచనాలు ఏకాభిప్రాయమని అన్నారు. తాను చెప్పింది జరగకపోతే ఇక జీవితంలో మరెక్కడా పంచాంగ శ్రవణం చేయబోనని అన్నారు. జగన్‌కు, రాష్ట్రానికి మంచి జరగాలనే ఉద్దేశంతో ఆరిమండ వరప్రసాదరెడ్డి సహకారంతో మహారుద్ర సహిత సహస్ర చండీయాగం తలపెట్టామని, రెండేళ్లపాటు యాగం నిర్వహిస్తామని, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక జగన్ పూర్ణాహుతి కోసం వస్తారని పురోహితులు శుభ వచనాలు పలికారు. గత నాలుగేళ్లుగా జగన్ ఏ కార్యక్రమం చేపట్టినా అది ప్రజలకు మంచి జరగాలనే ఉద్దేశంతోనేనని చెప్పారు.

అందరికీ మంచి జరగాలి: వైఎస్ జగన్

"ఉగాది పర్వదినం సందర్భంగా ఇక్కడికి వచ్చిన అక్కా చెల్లెమ్మలకు, సోదరులకు, అవ్వాతాతలకు, మిత్రులకు, రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని శుభాకాంక్షలు తెలియజేస్తున్నా" అని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

నత్తనడకన సాగునీటి ప్రాజెక్టుల పనులు

ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురుస్తాయని, పంటల దిగుబడి కూడా అంతంతమాత్రంగానే ఉంటుందని పంచాంగకర్తలు పంచాంగ శ్రవణంలో తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదని, పనులు నత్తనడకన సాగుతాయని చెప్పారు. పంచాంగ శ్రవణం సందర్భంగా వేద పండితులు వైఎస్ జగన్‌కు ఆశీర్వచనం ఇచ్చారు. వేద పండితులను ఆయన దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, బాలశౌరి, రావి వెంకటరమణ, మేకతోటి సుచరిత, మర్రి రాజశేఖర్, లావు శ్రీకృష్ణదేవరాయలు, అప్పిరెడ్డితోపాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగుజాతిపై యుద్ధం చేస్తారా?

- బీజేపీపై ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపాటు
- తమిళనాడు తరహా రాజకీయాలను ఏపీలో సాగనివ్వను
- ఉగాది వేడుకల్లో సీఎం రాజకీయ ప్రసంగం



సిరివెన్నెలకు హంస అవార్డు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరితే బీజేపీ తమపై ఎదురుదాడి చేస్తామంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విమర్శించారు. తాను ఏ తప్పూ చేయలేదన్నారు. న్యాయం చేయమని అడిగితే యుద్ధం చేస్తారా? అని ప్రశ్నించారు. ఎవరిపై యుద్ధం చేస్తారు, తెలుగుజాతిపై చేస్తారా? అని అన్నారు. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో చంద్రబాబు మాట్లాడారు. తెలుగుజాతికి ఎన్టీఆర్ ఆత్మగౌరవాన్ని ఇచ్చారని, తాను ఆత్మవిశ్వాసాన్ని ఇస్తానని చెప్పారు. జపాన్ తరహాలో అభివృద్ధి చేసుకుంటూనే పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తాను బలహీనపడితే రాష్ట్రం బలహీనపడుతుందని పేర్కొన్నారు. తమిళనాడులో చేసినట్లు ఇక్కడా చేయాలని చేస్తున్నారని, ఇక్కడ తమిళనాడు తరహా రాజకీయాలు జరగనివ్వబోనని స్పష్టం చేశారు. రాష్ట్రానికి కేంద్రం ప్యాకేజీతోపాటు ప్రత్యేక హోదా ఇచ్చేదాకా తమ పోరాటం ఆగదన్నారు. నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించలేదని ఆరోపించారు. కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నానని చంద్రబాబు చెప్పారు. ఈ సంవత్సరం సాధారణ పంచాంగంతోపాటు పోలవరం పంచాగం, ఉద్యానవన పంచాంగం కూడా విడుదల చేశామన్నారు.

ఒడిదుడుకులు ఉంటాయి: ప్రభల సుబ్రహ్మణ్య శర్మ

ఉగాది వేడుకల్లో రాజమండ్రికి చెందిన డాక్టర్ ప్రభల సుబ్రహ్మణ్యశర్మ పంచాంగం శ్రవణం చేశారు. ఈ సంవత్సరం ఒడిదుడుకులు ఉన్నప్పటికీ తట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం స్థిరంగా స్వతంత్రంగా నిలబడుతుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు పాలకుల వ్యక్తిత్వాలను బట్టి ఉంటాయన్నారు. ఈ ఏడాది శుభ ఫలితాలు వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. పంట సాగుకు అనుకూలంగా మంచి వర్షాలు కురుస్తాయన్నారు. ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ రూపొందించిన వ్యవసాయ పంచాంగాన్ని రావూరి వెంకటసాయి వరప్రసాద్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 47 కళారత్న, 99 ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి, జయప్రకాశ్ తదితరులకు హంస అవార్డులను అందించారు. టీటీడీ, వ్యవసాయ, ఉద్యానవన, పోలవరం పంచాంగాలను సీఎం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సీఎం సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్‌తో కలిసి వచ్చారు. స్పీకర్ కోడెల శివప్రసాదరావు పలువురు మంత్రులు పాల్గొన్నారు.

ఈ ఏడాది కేంద్రానికి సకల శుభాలే

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉగాది పంచాగశ్రవణం

సాక్షి, అమరావతి: విళంబి నామసంవత్సరం కేంద్ర ప్రభుత్వానికి సకల శుభాలనిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఉగాది పంచాగ పఠనంలో పండితులు చెప్పారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో నేతలు ఉగాది వేడుకలు నిర్వహించారు. పంచాగకర్త తోలేటి వీరభద్రశర్మ పంచాంగాన్ని చదివి వినిపించారు. ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పబలంతో కేంద్రం ఈ ఏడాది మరింత బలపడుతుందని వీరభద్రశర్మ చెప్పారు. ఉగాది వేడుకల్లో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పార్టీ నేతలు రవీంద్ర రాజు, శ్యాంకిషోర్, ఉప్పలపాటి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

మంగళగిరిలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం: గుంటూరు జిల్లాలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం శాశ్వత భవన నిర్మాణం చేపట్టనుంది. ప్రస్తుతం నిర్మాణంలోని ఎయిమ్స్ భవనాలకు వెళ్లే మార్గంలో పార్టీ అభిమాని ఒకరు 4,000 చదరపు గజాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారని.. అధిష్టానం కూడా భవన నిర్మాణానికి అనుమతించిందని పార్టీ వర్గాలు తెలిపాయి.

అన్ని సమస్యలకు పరిష్కారం చూపలేను

ఉగాది వేడుకల్లో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్



ఉద్దండ్రాయునిపాలెం గ్రామంలో ఉగాది పంచాంగ పఠనం వింటున్న పవన్‌కల్యాణ్

సాక్షి, అమరావతి బ్యూరో: అన్ని సమస్యలకు తన వద్ద పరిష్కారం ఉండదని, తనకు సమస్యలు తెలిపితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జనసేన పార్టీ అధ్యక్షుడు పవనకల్యాణ్ తెలిపారు. కుల, మత, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరగాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. రాజధానికి శంకుస్థాపన జరిగిన ఉద్దండరాయునిపాలెంలో ఆదివారం నిర్వహించిన ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పవన్ మాట్లాడుతూ, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ రాజధాని నిర్మాణం చేపట్టడం సరికాదన్నారు. సింగపూర్ తరహా రాజధానిని నిర్మించాలనుకున్నప్పుడు సింగపూర్‌లో ఉన్నట్లుగా అవినీతి రహిత పాలన అందించాలని పవన్ సూచించారు. ఇదిలా ఉంటే.. ఈ ఏడాది రైతులకు పంటలు బాగా పండుతాయని, పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభిస్తుందని పంచాంగ కర్తలు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనా తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు.

పాలకుల వల్ల ప్రజలకు ఇబ్బందులు

ఉగాది వేడుకల్లో శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి



భక్తులకు ఉగాది పచ్చడి అందిస్తున్న స్వామీజీ

పెందుర్తి: రానున్న రోజుల్లో పాలకుల తీరు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని విశాఖపట్నం శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిస్వామీజీ అన్నారు. కొద్దిరోజుల్లో పాలకులకు చెందిన కొన్ని అనూహ్య నిజాలు బట్టబయలవుతాయని వ్యాఖ్యానించారు. ఉగాది వేడుకలు విశాఖ జిల్లా పెందుర్తి మండలం చినముషిడివాడలోని శ్రీశారదాపీఠంలో ఆదివారం నిర్వహించారు. పీఠంలోని స్వర్ణ మండపంలో స్వామీజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆస్థాన సిద్ధాంతి రామలింగస్వామి పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేస్తూ.. ఈ సంవత్సరం అన్ని రాశుల వారికి బాగుంటుంది కానీ, దేశానికి, రాష్ట్రానికి గ్రహస్థితి అనిశ్చితిలో ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు అనిశ్చిత పరిస్థితి కలుగుతుందని చెప్పారు. రానున్న ఏడాది పాటు అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు ఇబ్బందులకు గురవుతారని జ్యోతిష్యులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు.

ఏపీసెట్ నోటిఫికేషన్ విడుదల

26 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష ఏపీసెట్‌కు నోటిఫికేషన్ ఆదివారం విడుదల చేసినట్లు ఏపీసెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 26 నుంచి మే 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రూ.వెయ్యి అపరాధ రుసుంతో మే 10 వరకు, రూ.2 వేల అపరాధ రుసుంతో మే 21 వరకు, రూ.5 వేల అపరాధ రుసుంతో జూన్ 6 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. రూ.5 వేల అపరాధ రుసుంతో దరఖాస్తు చేసిన వారికి విశాఖలోనే పరీక్ష నిర్వహిస్తామన్నారు. జూలై 1న పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం www.apset.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

వెంకన్న ఆలయంలో వైభవంగా ఉగాది ఆస్థానం

పుష్పాలంకరణలో ఆలయం గుబాళింపు

సాక్షి, తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం శ్రీవిళంబినామ సంవత్సర ఉగాది ఆస్థానం వైభవంగా జరిగింది. వేకువజాము సుప్రభాతం, తోమాల, అర్చన సేవలు వైదికంగా పూర్తి చేశారు. 7 నుంచి 9 గంటల వరకు బంగారు వాకిలిలో ఆస్థానం నిర్వహించారు. సర్వభూపాల వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి, మరోపీఠంపై విష్వక్సేనుల వారిని వేంచేపు చేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పెద్ద జీయర్, చినజీయర్, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ నూతన పట్టువస్త్రాలు ప్రదర్శనగా తీసుకొచ్చి, స్వామివారికి సమర్పించారు. శాస్త్రోక్తంగా ఆస్థాన కై ంకర్యాలు నిర్వహించారు. స్వామివారి పాదాల చెంత ఉంచిన పంచాంగాన్ని ఆస్థాన సిద్ధాంతి పఠించారు. తిథి, వార, నక్షత్రాలతో పాటు నూతన సంవత్సర ఫలితాలు, లాభ నష్టాలు, నవ గ్రహాలు, సస్యవృద్ధి, పశువృద్ధి, 27 నక్షత్ర జాతకుల కందాయ ఫలాలు, రాజపూజ్యత, అవమానాలు స్వామివారికి వినిపించారు.

ఆలయ మహద్వారం నుంచి గర్భాలయం వరకు 70వేల కట్ పుష్పాలు, 8 టన్నుల సంప్రదాయ పుష్పాలతో చేపట్టిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ధ్వజస్తంభం, బలిపీఠానికి స్వదేశీ సంప్రదాయ, విదేశీ కట్ పుష్పాలు, మామిడి తోరణాలు, కొబ్బరి ఆకు, వివిధ రకాల పండ్లతో అలంకరించారు. పుష్ప కలశం, పండ్ల పందిరిలో ఏర్పాటు చేసిన భూ వరాహస్వామి ప్రతిమ, ఆలయం వెలుపల పుష్ప గజేంద్రుడు, రథం, పండ్ల ఆకృతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయం సుగంధ సువాసనలు వెదజల్లింది. ఆలయం వెలుపల పలువురు భక్తులు ఉగాది పచ్చడి వితరణ చేశారు.

నేడు టెట్ ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫలితాలను సోమవారం మధ్యాహ్నం మంత్రి గంటా శ్రీనివాసరావు విడుదల చేయనున్నారు. ఈ మేరకు విజయవాడలో ఏర్పాట్లు చేసినట్లు టెట్ కన్వీనర్ ఎ.సుబ్బారెడ్డి తెలిపారు. టెట్‌కు రాష్ట్రవ్యాప్తంగా 4,10,828 మంది హాజరయ్యారు.

SAINIK SCHOOL KALIKIRI
ALL INDIA SAINIK SCHOOLS ENTRANCE EXAMINATION: 2018-19
FINAL RESULTS

The following is the combined list of selected candidate's category wise in the order of merit (row wise) for admission into Classes VI and IX for the year 2018-19 into Sainik School Kalikiri. **Merit List is prepared without taking into consideration "Medical Fitness" of the candidates. Unfit candidates are being informed individually. They may appeal against the medical unfitness as per rules. The admission is subject to medical fitness and submission of all certificates by the candidates. Candidates not in receipt of call up letters for admission by 31 Mar 2018 should contact school on Telephone No. 0877-2500270.** The school will not be held responsible for **any postal delay/printing errors** in the newspapers. **The results held with the School will be final and binding in case of any discrepancies/errors in printing.** The admissions will commence from **02 Apr 2018.** The schedule for commencement of admission formalities will be uploaded in the website subsequently.

CLASS VI

(A) MAIN LIST (GENERAL CATEGORY) – AP & TELANGANA DOMICILE (33)

65101010022	65103010408	65103010088	65103010274	65103010275	65101010094	65103010013
65105010500	65103010206	65106010362	65104010307	65101010123	65103010505	65103010077
65103010397	65101010035	65102010053	65103010358	65102010106	65103010437	65104010019
65104010263	65105010195	65104010329	65103040197	65105010079	65101040175	65101010148
65102010086	65106010199	65102010103	65103040307	65103010081		

(B) WAITING LIST (LIST A- AP & TELANGANA DOMICILE) (21)

65103010489	65103010251	65105010161	65105010439	65103010241	65103010096	65105010438
65103010036	65106010211	65106010070	65101010101	65104010215	65105010376	65103010485
65105010521	65107010144	65107010230	65107010065	65103010507	65101010164	65104010033

(C) MAIN LIST (OTHER STATE GENERAL CATEGORY) NOT BELONGING TO AP & TELANGANA (07)

BIHAR	65102030010	TAMIL NADU	65105020090	UTTAR PRADESH	65106010017
KARNATAKA	65106010273	MAHARASTRA	65106020106	UTTAR PRADESH	65103020048
ODISHA	65103020364				

(D) WAITING LIST (OTHER STATE GENERAL CATEGORY) – NOT BELONGING TO AP & TELANGANA (03)

BIHAR	65106010008	UTTAR PRADESH	65106010005	UTTAR PRADESH	65103010001

(E) MAIN LIST (DEFENCE CATEGORY) – AP & TELANGANA DOMICILE (09)

65104020284	65104020149	65106020097	65104020184	65105020314	65103020051	65104020018
65103020288	65107020035					

(F) WAITING LIST (DEFENCE CATEGORY) - AP & TELANGANA DOMICILE (10)

65103020348	65103020063	65103020072	65103020085	65101020017	65107020160	65107020094
65106020338	65103020214	65104020168				

(G) MAIN LIST (DEFENCE CATEGORY) – LEFT OVER CANDIDATES OF AP & TELANGANA DOMICILE AND ALL CANDIDATES NOT BELONGING TO AP & TELANGANA (5)

65105020025	65105020047	65103020292	65105020004	65102020034

(H) WAITING LIST (DEFENCE CATEGORY) – FOR (G) (8)

65103020348	65103020063	65103020072	65103020085	65105020040	65101020017	65105020135
65107020160						

(I) MAIN LIST (SC CATEGORY) (11)

65105030017	65102030023	65103030571	65103030555	65104030099	65104030327	65107030203
65103030016	65103030065	65103030357	65106030099			

(J) WAITING LIST (SC CATEGORY) (11)

65102030028	65107030245	65103030413	65104030320	65104030228	65106030368	65106030089
65107030104	65104030323	65105030039	65103030061			

(K) MAIN LIST (ST CATEGORY) (5)

65103040300	65103040104	65103040124	65101040091	65107040229

(L) WAITING LIST (ST CATEGORY) (5)

65103040354	65103040294	65103040371	65103040045	65107040234

CLASS IX

(M) MAIN LIST (GENERAL CATEGORY) – AP & TELANGANA DOMICILE (03)

95103010023	95104010040	95105010094

(N) WAITING LIST (GENERAL CATEGORY) - AP & TELANGANA DOMICILE (07)

95105030114	95105010009	95105010095	95103010060	95106010036	95106010032	95104010037

(O) MAIN LIST (DEFENCE CATEGORY) – AP & TELANGANA DOMICILE (1)

95107020013

(P) WAITING LIST (DEFENCE CATEGORY) - AP & TELANGANA DOMICILE (2)

95102020010	95104020031

Sd/- Principal, Sainik School Kalikiri

రమణీయం.. శ్రీశైలేశుని రథోత్సవం

శ్రీశైలం: ఉగాది పర్వదినాన శ్రీశైల మహాక్షేత్రంలో.. రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీగిరినాథుడైన మల్లికార్జునుడు దేవేరి భ్రామరి సమేతంగా రథంపై అధిష్టించి ఆదివారం శ్రీశైలం ప్రధాన రథవీధిలో విహరించారు. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, డమరుక నాదాలతో రథవీధులు మారుమోగాయి. ఉదయం 9.00 గంటలకు ఆలయ ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ పంచాంగ శ్రవణం చేశారు. కాగా, సుమారు 2 లక్షల మందికి పైగా భక్తులు ఈ రథోత్సవంలో పాల్గొన్నారు. శ్రీశైలంలో ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైన ఉగాది మహోత్సవాలు సోమవారం ఉదయం జరిగే పూర్ణాహుతితో ముగుస్తాయి.

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డికి అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోటంరెడ్డి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన తిరిగి ఇంటికి చేరుకున్న కాసేపటికే అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు ఆయన్ని హుటాహుటిన సింహపురి ఆస్పత్రికి తరలించారు. అక్కడివైద్యులు పరీక్షలు నిర్వహించి ఊపిరితిత్తులు, రక్తనాళాల్లో ఇన్‌ఫెక్షన్ కారణంగా వైరల్ ఫీవర్‌కు గురైనట్లు నిర్ధారించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఆరోగ్యం నిలకడగానే ఉందని, విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని అయితే ఆయన ప్రస్తుతం తమ పర్యవేక్షణలోనే ఉండాలని వైద్యులు సూచించారు.

ఆ నిబంధనలు రద్దు చేయాలి: ఏపీటీఎఫ్

సాక్షి, అమరావతి: మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను బానిసలుగా చూసేలా ఉన్న నిబంధనలు రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.హృదయరాజు, కె.వెంకటేశ్వరరావులు డిమాండ్ చేశారు. పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు పాఠశాల పని సమయాల్లోనే కాక పది విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని పేర్కొన్నారు.

ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకు ఆర్డినెన్స్ తేవాలి

రాష్ట్రంలో టీచర్లకు ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేసేందుకు ప్రస్తుత అసెంబ్లీలో ఆర్డినెన్స్ తీసుకు రావాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ఉత్తర్వులు తెచ్చినప్పటికి వాటిపై న్యాయస్థానాలలో కేసులు ఉన్నందున ఏకీకృత సర్వీసులు అమలు నిలిచిపోయిందన్నారు.

సాక్షి
సాహిత్యం
విజయవాడ I సోమవారం I మార్చి I 19 I 2018
అభిప్రాయాలకు: sakshisahityam@gmail.com

గ్రేట్ రైటర్

గుంతర్ గ్రాస్



ప్రస్తుతం పోలండ్‌లో ఉన్న ఒకప్పటి అర్ధ–స్వయం ప్రతిపత్తిగల నగరం 'ఫ్రీ సిటీ ఆఫ్ డాంజిగ్'లో జన్మించాడు గుంతర్ గ్రాస్(1927–2015). మాతృభాష జర్మనీ. తను జన్మించిన డాంజిగ్ బాల్యపు అనుభవాలు ఆయన రచనల్లో ఎక్కువగా ప్రతిఫలిస్తాయి. 1959లో వచ్చిన మొదటి నవల 'ద టిన్ డ్రమ్' ఆయనకు ఎంతో పేరు తెచ్చింది. మేజిక్ రియలిజం శైలిలో ఐరోపా ఖండంలో వచ్చిన విలువైన రచనగా మన్నన అందుకుంది. ఇదే పేరుతో 1979లో సినిమా కూడా వచ్చింది. అది ఉత్తమ విదేశీ భాషా చిత్రంగా ఆస్కార్ అవార్డు గెలుచుకుంది. గ్రాస్ తర్వాత రాసిన 'క్యాట్ అండ్ మౌజ్', 'డాగ్ ఇయర్స్' నవలలను కలిపి డాంజిగ్ ట్రయాలజీ అంటారు. మొదటిదైన 'పీలింగ్ ది ఆనియన్'తో కలిపి మూడుభాగాల ఆత్మకథ వెలువరించాడు. 'ద ఫ్లౌండ(ర్)', 'మై సెంచరీ అండ్ క్రాబ్‌వాక్' ఆయన ఇతర రచనలు. కవిగా, నాటకకర్తగా, శిల్పిగానూ ప్రజ్ఞ కనబరిచిన గ్రాస్‌ను 1999లో నోబెల్ సాహిత్య పురస్కారం వరించింది. కౌమార దశలో తప్పనిసరైన మిలిటరీ సర్వీసులో భాగంగా నాజీ సైనికుడిగా పనిచేశాడు. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో యుద్ధఖైదీగా పట్టుబడి, తర్వాత విడుదల య్యాడు. వామపక్ష రాజకీయ దృక్పథం ఉన్నవాడిగా పేరున్న గ్రాస్ తన చివరిదశలో వెల్లడించిన ఈ అంశం సాహిత్య లోకంలో ప్రకంపనలు సృష్టించింది. ఇప్పటికైనా తన బరువును దించేసుకున్నానని ఆయన పేర్కొన్నాడు.

సాహిత్య మరమరాలు

టీలో కొంచెం ఉప్పు ఎక్కువైంది!



స్థానాపతి సత్యనారాయణ, కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వంశ పరంపరలో పూజారి. ఆ దేవాలయాన్ని అంటుకునివున్న చిన్న ఇల్లు పూజారి వసతి గృహం. అందులోనే ఆయన ఉండేవారు. బలిష్టమైన మనిషి. పహిల్వాన్ కావాలని కాంక్ష ఉండేదట. ఆయన దగ్గరికి అబ్బూరి వరదరాజేశ్వరరావు తెలుగు, సంస్కృతం అభ్యసించేందుకు వెళ్లేవారట. అయితే, చదువు చెబుతూ తన దగ్గర చదువుకోవటమే ఒక సరదా అనే అనుభూతిని కలిగించాలని సత్యనారాయణ తాపత్రయపడేవారు. ఆ ఉత్సాహంలో వరదను ఒకసారి కోట ప్రాంతంలో బీచ్‌రోడ్ మీద వున్న ఒక రెస్టారెంటుకు కాఫీ తాగుదామని తీసుకెళ్లారు. ఆ రోజుల్లో దానిని ఇంగ్లీష్ వాళ్లు నిర్వహించేవారు. అలాంటి చోట్లకు పోవడం సత్యనారాయణకు మొదటిసారి. బల్లమీద టేబుల్ సాల్టూ, సాసూ వున్నాయి. వెయిటర్ వాళ్లు కూచున్న టేబుల్ దగ్గరికి వచ్చి యేంకావాలన్నాడు. ఇంట్లో ఎటూ రోజూ కాఫీయే కదా, ఇక్కడ కూడా అదేనా అని, రెండు కప్పులు టీ పట్రమ్మని చెప్పారు సత్యనారాయణ. రెండు కప్పుల టీ తెచ్చాడు వెయిటరు. పంచదార విడిగా ఇచ్చాడు. అది కలుపుకొని తాగాడు వరద. సత్యనారాయణ బాధగా తాగారు. బిల్లు చెల్లించి, రోడ్డు మీదకు వచ్చాక, ''ఏమిటోయ్, ఇంగ్లీషువాళ్ల టీ ఉప్పగా ఉంటుందేమోయి'' అన్నారట సత్యనారాయణ. పంచదార అనుకుని, తన కప్పు పక్కనేవున్న టేబుల్ సాల్ట్ అయిదారు చంచాలు ఆయన టీలో కలుపుకున్నారు పాపం!

ప్రతిధ్వనించే పుస్తకం

కె.లలిత, వసంత కన్నబిరాన్, రమా మేల్కోటే, ఉమామహేశ్వరి, సూసీ తారూ, వీణా శత్రుఘ్న, ఎం.రత్నమాల సంపాదకత్వంలో, స్త్రీ శక్తి సంఘటన ప్రచురణగా 1986లో వచ్చిన అద్భుతమైన పుస్తకం 'మనకు తెలియని మన చరిత్ర (తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో స్త్రీలు)'. ఇది



'చరిత్రలు సృష్టించినా పేరులేని స్త్రీలకూ, పోరాటాలకూ' అంకితం చేయబడ్డది.



ఒక్క మానుకోట దొర జన్నారెడ్డి ప్రతాపరెడ్డికే ఒక లక్షా యాభైవేల ఎకరాల భూమి ఉన్న రోజులవి. నిజాం ప్రభుత్వంలోని ఖాసిం రజ్వీ, లాయఖ్ అలీ వంటి ముస్లిం మతాభిమానుల నాయకత్వంలో రజాకార్లూ, నిజాం పోలీసులూ, 'ఖాల్సా' భూములను నిజాం అనుగ్రహంతో స్వాధీనం చేసుకుని, దశాబ్దాల పర్యంతం తమ అధీనంలో ఉంచుకుని తెలంగాణా పేద ప్రజలను వెట్టి చాకిరితో, లేవీ ధాన్యం వసూళ్లతో అతి భయంకరంగా హింసిస్తూ సాగించిన దోపిడినీ, అణచివేతనూ ప్రతిఘటించడానికి 1940లలో స్థాపించబడ్డ కమ్యూనిస్ట్ పార్టీ పదమూడు 'ఆంధ్ర మహాసభ'ల నిర్వహణతో జనాన్ని చైతన్యపరిచింది. ఈ 'సంగాల్లో' నిరక్షరాస్యులైన అనేకమంది స్త్రీలు నిర్వహించిన వీరోచిత పాత్ర గురించి చాలా మందికి తెలియదు. అటువంటి విస్మరించబడ్డ నారీమణుల చరిత్రలను... జీవిత అంతిమదశకు చేరిన ఒక్కొక్కరి దగ్గరికి వెదుక్కుంటూ వెళ్ళి వాళ్ల స్వంత భాషలో వాళ్ళ అనుభవాలను విని, టేపుల్లో రికార్డ్ చేసి, అక్షరాల్లోకి అనువదించి ఒక అశ్రు ఘోషగా వెలువరించిన గ్రంథమిది. వరంగల్ కమలమ్మ, చాకలి ఐలమ్మ, ప్రమీల తాయి, సుగుణమ్మ, బ్రిజ్ రాణి, మల్లు స్వరాజ్యం, ప్రియంవద, కొండపల్లి కోటేశ్వరమ్మ, సూర్యావతి, జమాలున్నీసా బేగం, లలితమ్మ, అచ్చమాంబ, మోటూరి ఉదయం వంటి వీరవనితల గురించి చదువుతున్నపుడు ఒళ్ళు గగుర్పొడుస్తుంది. దిక్కూ మొక్కూ లేని జనం విముక్తి కోసం వారు పడ్డ శ్రమ, తపన, చేసిన త్యాగాలు చూస్తే మనం వాళ్ళ వారసులమైనందుకు గర్వంతో పొంగిపోతాం.

- రామా చంద్రమౌళి


మిమ్మల్ని బాగా కదిలించిన పుస్తకం గురించి మాతో పంచుకోండి.
మెయిల్: sakshisahityam@gmail.com

నాన్న, బార్ట్ సింప్సన్ బొమ్మ కొనడు. అమ్మ నిజానికి కొందామనే అంది. కానీ అలా కొనిస్తే చెడిపోతానట. ఎందుకు కొనాలసలు? వాడేదో ఏడుపు మొదలు పెట్టగానే నువ్వు తకీమని ఒప్పేసుకుంటావని అమ్మను కోప్పడ్డాడు కూడా.

పందిరి

ఆకాశానికీ మనకూ మధ్య ఉండేది పందిరి. ఆకాశమంత ఆశవున్నా పందిరిని ప్రేమిస్తూనే ఉంటాం. నిజానికి ప్రేమ ఆకాశమంత ఉంటే ఆశల పందిరి అడ్డమే కాదు!

కథాసారం



వాడికి డబ్బు విలువ తెలియట్లేదన్నాడు. చిన్నతనంలో కాక పొదుపు గురించి మరెప్పుడు నేర్చుకుంటాడన్నాడు. అడగ్గానే బార్ట్ సింప్సన్ బొమ్మ అతిసులభంగా పొందిన పిల్లలు పెద్దయ్యాక మొద్దులుగా తయారవుతారని ఆయన ఉద్దేశం. ఇలాంటివాళ్లే ఏటీఎంల నుంచి డబ్బులు ఎత్తుకెళ్లే బాపతుగా తయారవుతారట. అందువల్ల బార్ట్ సింప్సన్ బొమ్మ బదులుగా నాకు ఒక వికారమైన చైనా పంది బొమ్మ తెచ్చాడు. దాని వెనుక భాగంలో ఒక రంధ్రం ఉంది. ఇలా అయితే నేను మొద్దును కానన్నమాట!

ప్రతిరోజూ నేను కప్పు కోకో తాగాలి, అదంటే నాకు అసహ్యమైనప్పటికీ. తొక్కతో కోకో తాగితే ఒక షెకెల్(ఇజ్రాయిల్ నాణెం) ఇస్తారు. తొక్కలేనిదైతే అర షెకెల్. దాన్ని అట్లానే తీసి పారబోస్తే ఏమీ ఇవ్వరు! ఆ ఇచ్చిన నాణేల్ని పంది వెనకాలి రంధ్రంలో వేయాలి. ఆ బొమ్మను ఊపితే గలగలమని శబ్దం వస్తుంది. పంది ఎప్పుడైతే నిండుతుందో దాన్ని ఊపినప్పుడు గలగలమని శబ్దం రాదు. అప్పుడు స్కేట్‌బోర్డ్ మీద ఉన్న సింప్సన్ బొమ్మ కొంటాడు నాన్న. ఆ విధంగా నేను పొదుపు పాఠాలు నేర్చుకుంటున్నాను.

నిజానికి పంది బొమ్మ చూడముచ్చటగా ఉంది. దాని ముక్కును తాకితే చల్లగా ఉంటుంది. దాని వెనుక నాణేన్ని వేసినప్పుడల్లా అది నవ్వుతుంది. అర్ధనాణేన్ని వేసినా కూడా అలాగే నవ్వుతుంది. ఇంకో మంచి విషయమేమిటంటే, అసలు ఏ నాణేన్ని అందులో వేయకపోయినా కూడా అది అలాగే నవ్వుతుంది. నేను దానికి పెసాచ్సన్ అని పేరు పెట్టాను. ఈ పెసాచ్సన్ ఎవరంటే ఒకప్పుడు మేమున్న ఇంట్లో ఉండేవాడు. ఆయన పేరున్న లేబుల్‌ను మెయిల్ బాక్స్ మీది నుంచి ఎంత పీకేయడానికి నాన్న ప్రయత్నించినా సాధ్యం కాలేదు. పెసాచ్సన్ మిగతా బొమ్మల మాదిరిగా ఉండదు. ప్రశాంతంగా ఉంటుంది. దాన్లో లైట్లూ, స్ప్రింగులూ, లీకయ్యే బ్యాటరీలూ లేవు. అయితే, అది టేబుల్ మీద నుండి కిందకు దూకకుండా మాత్రం జాగ్రత్తగా చూసుకోవాలి. అది నేలవైపు వంగి కిందకు చూసినప్పుడు, 'జాగ్రత్త పెసాచ్సన్! నువ్వు పింగాణీ తయారీవి' అని చెబుతాను. అప్పుడు అది నా వైపు చూసి నవ్వుతుంది. నేను నా చేతిలోకి తీసుకునేంత వరకూ ఓపిగ్గా వేచి ఉంటుంది. పెసాచ్సన్ నన్ను చూసి నవ్వితే నేను వెర్రెత్తిపోతాను. కేవలం ఆ నవ్వు కోసమే నేను ప్రతి ఉదయం నాకిష్టం లేకపోయినా తొక్కతో ఉన్న కోకో తాగుతాను. దాని వెనకాల వున్న రంధ్రంలో నాణేన్ని వేసి దాని నవ్వు ఇంతకూడా ఎందుకు మారదో చూస్తాను. తర్వాత, 'ఐ లవ్యూ పెసాచ్సన్' అని చెబుతాను. 'నిజంగా చెబుతున్నాను, అమ్మానాన్న కన్నా కూడా ఎక్కువగా నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు ఏటీఎంలను పగలగొట్టినా సరే , ఎల్లప్పుడూ నిన్ను ఇలాగే ప్రేమిస్తాను. కానీ ఒకటి, టేబుల్ మీది నుంచి దూకాలని మాత్రం కనీసం ఆలోచన కూడా నీవు చేయొద్దు'.

నిన్న నాన్న వచ్చాడు. టేబుల్ మీదున్న పెసాచ్సన్‌ను పైకెత్తి కిందికీ మీదికీ గట్టిగా ఊపడం మొదలుపెట్టాడు.

'నాన్నా, జాగ్రత్త. నువ్వు పెసాచ్సన్‌కు కడుపునొప్పి తెప్పించేట్టున్నావు' అన్నాను. కానీ నాన్న వినలేదు. ఇంకా అలాగే ఊపుతూ, 'ఇందులోంచి శబ్దం రావడం లేదు. దీనర్థం నీకు తెలుసుకదా యువీ? నీకు రేపే స్కేట్‌బోర్డ్ మీదుండే సింప్సన్ బొమ్మ కొనిస్తాను' చెప్పాడు నాన్న.

'అద్భుతం నాన్నా. సింప్సన్ బొమ్మా? అద్భుతం. కానీ పెసాచ్సన్‌ను మాత్రం ఊపడం ఆపు. ప్లీజ్ దానికి నొప్పెడుతుంది' అన్నాను. నాన్న పెసాచ్సన్‌ను తిరిగి టేబుల్ మీద పెట్టాడు. అమ్మ దగ్గరికి వెళ్లాడు. ఒక నిమిషం తర్వాత అమ్మను చేత్తో పట్టుకొని లాగినట్టుగా తోడ్కొని వచ్చాడు. ఇంకో చేతిలో సుత్తి వుంది. 'చూశావా, నేనూహించినట్లుగానే జరిగింది' చెప్పాడు నాన్న. 'వస్తువుల విలువ ఏమిటో ఇప్పుడు వాడికి తెలుసు. కదా యువీ?'. 'కచ్చితంగా తెలిసింది నాన్నా. అదిసరేగానీ సుత్తి ఎందుకు తెచ్చినట్టు?' అని నేను అడిగాను. 'నీ కోసమే' అంటూ సుత్తిని నా చేతిలో పెట్టాడు. 'జాగ్రత్త సుమా!' అన్నాడు. 'నేను జాగ్రత్తగానే ఉంటాను' అన్నాను. నేను నిజంగానే జాగ్రత్తగా ఉన్నాను. కొన్ని నిమిషాలు వేచి చూశాక, నాన్న విసిగిపోయాడు. 'కానివ్వురా, ఆ పందిని పగలగొట్టు' అన్నాడు. 'య్యేమిటీ?' నేను అరిచాను, 'పెసాచ్సన్‌ను పగలగొట్టాలా?' 'అవునవును, పెసాచ్సనే' చెప్పాడు నాన్న, 'కానీ, పగలగొట్టెయ్. నువ్వు చాలా కష్టపడ్డావు. బార్ట్ సింప్సన్ బొమ్మ కొనివ్వడానికి అర్హత సంపాదించావు'.

తన అంతిమ క్షణాలు వచ్చాయని తెలిసిపోయిన చైనా పంది లాగా పెసాచ్సన్ నావైపు చూసి దీనంగా నవ్వింది. సింప్సన్ బొమ్మ లేకపోతే పోయే! నేను నా ఫ్రెండు తల మీద సుత్తితో కొట్టడమా? 'నాకు సింప్సన్ బొమ్మ వద్దు. ఈ పెసాచ్సన్ చాలు' అని సుత్తిని నాన్నకు వెనక్కి ఇచ్చేశాను. 'నీకు అర్థం కాలేదన్నమాట' అన్నాడు నాన్న. 'ఏం ఫర్లేదు. నన్ను చూసి నేర్చుకో. నీ కోసం నేనే పగలగొడతాను'. నాన్న అప్పటికే సుత్తిని పైకెత్తాడు. అమ్మ కళ్లు మూసుకుంది.

పెసాచ్సన్ అలసిపోయినట్టుగా నవ్వుతున్నాడు. ఇప్పుడు నేనే ఏదో ఒకటి చేయాలి. నేను ఏమీ చేయలేదంటే పెసాచ్సన్ చచ్చిపోయినట్టే! 'నా...న్నా...' అని గట్టిగా నాన్న కాళ్లను పట్టుకున్నాను. 'ఏం, యువీ?' అడిగాడు నాన్న. చేతిలోని సుత్తి ఇంకా గాల్లోనే లేచివుంది.

'నాన్నా! నాకింకో షెకెల్ కావాలి, ప్లీజ్. రేపు కోకో తాగిన తర్వాత అందులో వేయడానికి. రేపు దాన్ని నేనే పగలగొడతాను, తప్పకుండా' అన్నాను.

'ఇంకో షెకెలా?' నాన్న నవ్వుతూ సుత్తిని టేబుల్ మీద పెట్టాడు, 'చూశావా? వాడిలో ఎంత అవగాహన పెరిగేట్టు చేశానో'.

'రేపు'. అప్పటికే నా గొంతు పూడుకుపోయింది.

అందరూ గదిలోంచి బయటికి వెళ్లిన తరువాత పెసాచ్సన్‌ను గట్టిగా హత్తుకున్నాను. ఒక్కసారిగా బయటికి ఏడ్చాను. పెసాచ్సన్ ఏమీ మాట్లాడలేదు. నా చేతుల్లో నిశ్శబ్దంగా వణికింది. 'బాధ పడకు' తన చెవిలో గుసగుసగా చెప్పాను, 'నేను నిన్ను కాపాడుతాను'.

రాత్రి నాన్న ముందుగదిలో టీవీ చూడటం ముగించి, నిద్రకు ఉపక్రమించే వరకూ వేచివున్నాను. నెమ్మదిగా మంచం మీదినుంచి లేచి, పెసాచ్సన్‌ను పట్టుకుని బయటికి వచ్చాను. చాలాసేపు మేమిద్దరమూ చీకట్లో నడిచాం. చివరకు ముళ్లపొదలున్న ఒక పొలాన్ని చేరుకున్నాం. 'పందులకు ముళ్లపొదలున్న పొలాలంటే చాలా ఇష్టం' అని పెసాచ్సన్‌ను నేల మీద పెడుతూ చెప్పాను, 'నీకు ఇక్కడ నచ్చుతుంది'. జవాబు కోసం ఎదురుచూశానుగానీ పెసాచ్సన్ ఏమీ అనలేదు. దానికి గుడ్‌బై చెప్పడానికి ముక్కు మీద తాకినప్పుడు మాత్రం విషాదంగా చూసింది. మరి నన్ను మళ్లీ ఎప్పటికీ చూడలేనని తనకు తెలుసుకదా!

ఎట్గార్ కెరెట్ హీబ్రూ కథ 'బ్రేకింగ్ ద పిగ్' సారం ఇది. కెరెట్ 1967లో ఇజ్రాయిల్‌లో జన్మించారు. కథలూ, గ్రాఫిక్ నవలలూ, సినిమాలూ, టీవీకి స్క్రిప్టులూ రాస్తారు.




ఎట్గార్ కెరెట్

కొత్త బంగారం

ఎవరు చెబుతున్నది నిజం?

జిలియన్ ఫ్లిన్ రాసిన 'గాన్ గర్ల్' నవల– నిక్, యేమీ ఐదవ వివాహ వార్షికోత్సవం నాడు, యేమీ కనబడకపోవడంతో మొదలవుతుంది.

నిక్ డన్, యేమీ వివాహంలో ఉన్న ప్రేమ దూరమవుతూ ఉంటుంది. ఇద్దరూ న్యూయోర్కులో ఉద్యోగాలు పోగొట్టుకుని, క్యాన్సర్‌తో బాధపడుతున్న నిక్ తల్లి వద్దకి మిజోరీ చేరుకుంటారు. యేమీ అక్కడ ఇమడలేకపోతుంది. దంపతుల మధ్య పోట్లాటలు మొదలవుతాయి. నిక్ జర్నలిజం బోధించే యూనివర్సిటీలో, ఒక అమ్మాయితో సంబంధం పెట్టుకుంటాడు. యేమీకి అది తెలిసి నిక్కికి బుద్ధి చెప్పాలనుకుంటుంది. తన హత్యకి అతడిని బాధ్యుడిగా చేసే యుక్తి పన్ని, తన జాడేదీ వదలకుండా మాయం అవుతుంది.



ఆమె దాక్కున్న మోటెల్ గదిలో దొంగతనం జరిగినప్పుడు, పాత బాయ్‌ఫ్రెండ్ అయిన దేసీ కాలింగ్స్‌ను సహాయం అడుగుతుంది. సరస్సు పక్కనున్న తన ఇంట్లో ఆమెని దాచడానికి వొప్పుకుంటాడతను.

ఇంతలో, తన పేరు మీదున్న క్రెడిట్ కార్డుతో ఆమె కొన్న వస్తువులని గమనించీ, తను గర్భవతిని అని అబద్ధం రాసుకుని ఆమె వదిలి వెళ్ళిన డైరీని బట్టీ భార్య ఉద్దేశ్యం అర్థం అయినప్పటికీ, నిక్ తను నిర్దోషినని పోలీసులని నమ్మించలేకపోతాడు. తన లాయర్ సలహాతో, తన గురించిన పబ్లిక్ అభిప్రాయాన్ని మార్చడానికి వొక టీవీ షోలో పాల్గొని– యేమీని క్షమాపణ అడిగినట్టు నటిస్తూ, ఆమెని వెనక్కి రమ్మని అడుగుతాడు.

పబ్లిక్‌కు అతని మీద నమ్మకం ఏర్పడుతుంది కానీ దురదృష్టవశాత్తూ, తనవి కావని నిక్ చెప్పిన పార్న్ వీడియోలూ, యేమీ డైరీ పోలీసులకి దొరుకుతాయి. అతన్ని అరెస్ట్ చేసి బెయిలు మీద వదులుతారు. ఆ ఇంటర్వ్యూ చూసిన యేమీ భర్త తన్ని ప్రేమిస్తున్నాడని నమ్మి, తన మీద అత్యాచారం చేయడానికి ప్రయత్నించిన దేసీని హత్య చేసి, భర్త వద్దకి తిరిగి వస్తుంది. తనని దేసీ బలాత్కారంగా తీసుకెళ్ళాడని కథ అల్లుతుంది. ఆమె అబద్ధం చెప్తోందని నిక్కికి తెలిసినప్పటికీ సాక్ష్యం లేకపోవడం వల్ల, మీడియా గోల తగ్గేటంతవరకూ కలిసే ఉందామనుకుని యేమీ నేరాలు, మోసాల గురించిన కథ రాయడం ప్రారంభిస్తాడు.



జిలియన్ ఫ్లిన్

అది యేమీకి తెలిసి, తామిద్దరూ గతంలో పిల్లలు పుట్టడం కోసం ప్రయత్నిస్తున్నప్పుడు, ఘనీభవించి పెట్టిన నిక్ వీర్యాన్ని ఇన్సెమినేట్ చేయించుకుని గర్భవతి అయి, నిక్ రాస్తున్న పుస్తకాన్ని కనుక అచ్చు వేస్తే, పుట్టబోయే బిడ్డని తీసుకుని వెళ్ళిపోతానని అనడంతో, గత్యంతరం లేని నిక్ ఆ మాట పాటిస్తాడు.

పుస్తకం– నిక్, యేమీ దృష్టికోణాలని మార్చిమార్చి చూపిస్తూ రాయబడింది. తమ ప్రస్తుత సంబంధాన్ని వర్ణిస్తూ ఉన్న నిక్, తమ గత సంబంధాన్ని తన డైరీ రాతలతో వివరించే యేమీ కోణాలు భిన్నమైనవి. నిక్ బద్ధకస్తుడూ, అస్థిరచిత్తం ఉన్నవాడిగా యేమీ వర్ణిస్తే, ఆమె అనవరమైన కష్టాలని తెచ్చిపెట్టే మొండి స్వభావం ఉన్న వ్యక్తని నిక్ చెప్తాడు. అయితే, ఇద్దరూ తమ పక్షపు కథనాల్లో, నిజాలు వెల్లడించడం లేదని మాత్రం పాఠకులకి అర్థం అవుతుంది.

దీని ఆడియో పుస్తకం కూడా ఉంది. 2012లో అచ్చయిన ఈ నవల ఫ్లిన్ రాసిన మూడవది. 'న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లర్'గా ఎనిమిది వారాలున్న దీని ఆధారంగా ఇదే పేరుతో డేవిడ్ ఫించర్ దర్శకత్వంలో సినిమా కూడా వచ్చింది.

◆ కృష్ణ వేణి

ఈవారం పుస్తకాలు



మా అమ్మమ్మ సుబ్బలక్ష్మి
మూలం: మైథిలి శివరామన్; తెలుగు: వి.వి.జ్యోతి; పేజీలు: 192; వెల: 100; ప్రతులకు: నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, ఎమ్.హెచ్.భవన్, ప్లాట్ నం. 21/1, అజామాబాద్, ఆర్టీసీ కల్యాణ మండపం దగ్గర, హైదరాబాద్–20. ఫోన్: 040–27665420



ప్రాతినిధ్య కథ - 2016
సంపాదకులు: ముసునూరి ప్రమీల, డాక్టర్ సామాన్య; పేజీలు: 192; వెల: 60; ప్రతులకు: సాహితీ మిత్రులు, 28–10–16, మసీదు వీధి, అరండల్‌పేట, విజయవాడ–2. ఫోన్: 0866–2433359



గాథా సప్తశతి - సౌందర్య గాథ
(సిద్ధాంత గ్రంథం)
రచన: డాక్టర్ అనుపాటి సుబ్బరాయుడు; పేజీలు: 490; వెల: 400; ప్రతులకు: రచయిత, 2/142–1, పిండి మిషన్ వీధి, మారుతీ నగర్, కడప–516001. ఫోన్: 9849870328



షానామా- మహాభారతం
(తులనాత్మక పరిశీలన)
రచన: డాక్టర్ యు.ఎ.నరసింహమూర్తి; పేజీలు: 144; వెల: 100; ప్రతులకు: సహజ కల్చరల్ సొసైటీ, 24–8–1, సమీర రెసిడెన్సీ, విజయనగరం. ఫోన్: 9440343479

కవి ప్రపంచం



పదం పలికింది - పాట నిలిచింది

కలత నిదురలో కలలాగా జారిపోకే జవరాలా



దాదాపుగా అన్నిసార్లూ పాటను పైకి లేపేది దాని ట్యూనే. వినసొంపైన ట్యూనంటూ పడ్డాక, దాని మీటరుకు అనుగుణంగా కట్టే పదాల మాల ఎలాంటిదైనా అది ఇట్టే పరిమళిస్తుంది. ఆ ఇట్టే పరిమళించే మాలలో కూడా కవిత్వాన్ని పొదగ్గలిగితే ఆ పాట గుణం రెట్టింపవుతుంది. 'ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం' కోసం కందికొండ రాసిన –
'మళ్లి కూయవే గువ్వా మోగిన అందెల మువ్వా
తుళ్లి పాడవే పువ్వా గుండెలో సవ్వడి నువ్వా' పాట మధ్యలో–
'కలత నిదురలో కలలాగా జారిపోకే జవరాలా' అని వస్తుంది. ప్రేయసి పట్ల ప్రియుడికి గల కోల్పోయే భయాన్ని చాలా చక్కగా ఈ పాదం వ్యక్తీకరిస్తుంది.
'సిరి సిరి మువ్వల చిరుసడి వింటే స్మృతిపథమున నీ గానమె
పొంగిపొరె యేటిలో తొంగి తొంగి చూస్తే తోచెను ప్రియ నీ రూపమే'
'సాగిపోయే దారిలో వేసే ప్రతి అడుగులో తగిలెను నీ మృదు పాదమె' లాంటి వాక్యాలు కూడా మంచి భావనలు. దీనికి చక్కటి సంగీతం కూర్చింది చక్రి. గాయనీ గాయకులు కౌసల్య, హరిహరన్. తనూ రాయ్, రవితేజ నాయికానాయకులు. 2001లో వచ్చిన ఈ చిత్రానికి దర్శకుడు పూరీ జగన్నాథ్.

రారండోయ్

- కె.వి.ఆర్. 'శీర్షికలు' ఆవిష్కరణ సభ మార్చి 23న సాయంత్రం 5:30కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలు, విజయవాడలో జరగనుంది. 'దళితుల ఆకాంక్షలు– బూర్జువా దళితవాదం' అంశంపై కేవీఆర్ స్మారకోపన్యాసం పాణి చేస్తారు. నిర్వహణ: కె.వి.ఆర్. శారదాంబ స్మారక కమిటీ.
- మొజాయిక్ సాహిత్య సంస్థ పదిహేనో వార్షికోత్సవం సందర్భంగా ప్రారంభిస్తున్న తొలి సాహిత్య పురస్కారాన్ని సయ్యద్ సలీంకు మార్చి 24న విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో ప్రదానం చేయనున్నారు.
- కవిసంగమం సీరిస్–37లో భాగంగా– మూడు తరాల కవులు అల్లం నారాయణ, దయాకర్ వడ్లకొండ, పల్లిపట్టు, రమాదేవి బాలబోయిన, కృష్ణ గుగులోత్ తమ కవిత్వాన్ని మార్చి 25న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో వినిపిస్తారు.
- ద్వానా శాస్త్రి సప్తతి సందర్భంగా 2016,17,18ల్లో ముద్రితమైన సాహిత్య విమర్శ గ్రంథాలకు 10 వేలు, 5 వేల స్ఫూర్తి పురస్కారాలు ఇవ్వనున్నారు. చిరునామా: డి.శశికాంత్, 1-1-428, అర్చీజ్ నెస్ట్, గాంధీనగర్, హైదరాబాద్–80.
- పల్లా నరసింహులు స్మారక కవితా పురస్కారానికి 2016–17ల్లో వచ్చిన కవితా సంపుటాలను ఏప్రిల్ 6లోగా ఆహ్వానిస్తున్నారు. నిర్వహణ: యువసాహితి, ప్రొద్దుటూరు. వివరాలకు: 9985193868

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం.
ఉత్తరాయణం, వసంత ఋతువు. చైత్రమాసం. తిథి శు.విదియ సా.5.57 వరకు, తదుపరి తదియ. నక్షత్రం రేవతి రా.8.20 వరకు, తదుపరి అశ్వని. వర్జ్యం ఉ.8.14 నుంచి 9.51 వరకు. దుర్ముహూర్తం ప.12.31 నుంచి 1.20 వరకు, తదుపరి ప.2.55 నుంచి 3.43 వరకు. అమృత ఘడియలు సా.5.55 నుంచి 7.31 వరకు.

సూర్యోదయం : 6.10
సూర్యాస్తమయం : 6.06
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు	
ఫజర్ : 5.09	అసర్ : 4.45
జొహర్ : 12.24	మగ్రీబ్ : 6.27
	ఇషా : 7.39

వాళ్లా పాండవులు?

రాహుల్ ప్రసంగంపై మండిపడ్డ నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: గతంలో రాముడి అస్తిత్వాన్నే ప్రశ్నించిన పార్టీ నేడు తమను తాము పాండవులుగా చెప్పుకుంటారా అని బీజేపీ నేత, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశ్నించారు. ప్లీనరీలో రాహుల్ విమర్శలను తిప్పికొడుతూ.. సిక్కుల ఊచకోతకు, లక్షలకోట్ల కుంభకోణాలకు పాల్పడ్డ కాంగ్రెస్ నేతలు.. పాండవులమని చెప్పుకోవటం విడ్డూరన్నారు. నరేంద్ర మోదీకి.. నీరవ్, లలిత్ మోదీలతో సంబంధమున్నట్లు చూపించే ప్రయత్నం పూర్తిగా అర్థరహితమని మంత్రి తెలిపారు. 'నేషనల్ హెరాల్డ్ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన రాహుల్ గాంధీ.. మహాత్ముని ఇంటిపేరుతో ఉన్నారు. దీన్నెలా చూడాలి?' అని ప్రశ్నించారు. 'ఓ కేసులో తనకు వ్యతిరేకంగా తీర్పునిచ్చినపుడు ఇందిరా గాంధీ న్యాయవ్యవస్థపై ఎలా వ్యవహరించారో నేను గుర్తుచేయాలా? 1988లో రాజీవ్ గాంధీ ప్రెస్ హక్కులను కాలరాసే బిల్లును తీసుకొచ్చినంత పనిచేశారు. ఎమర్జెన్సీలో ఇందిర మీడియాతో ఎలా వ్యవహరించారు? ఆమె మనుమడు ఇప్పుడు మీడియా స్వేచ్ఛ గురించి మాట్లాడటం విడ్డూరం' అని ఆమె పేర్కొన్నారు.

ఇటుకలుగా రద్దయిన నోట్లు


న్యూఢిల్లీ: రద్దయిన పాత రూ.500, రూ.1,000 నోట్లను ముక్కలు చేసి ఇటుకలు (బ్రిక్స్)గా మారుస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. సమాచార హక్కు చట్టం ద్వారా పీటీఐ కరెస్పాండెంట్ అడిగిన సమాచారాన్ని ఈ మేరకు వెల్లడించింది. 'రద్దయిన పాత రూ.500, రూ.1,000 నోట్లను లెక్కించి, అధునాతన కరెన్సీ వెరిఫికేషన్, ప్రాసెసింగ్ సిస్టమ్ (సీవీపీఎస్) ద్వారా ప్రాసెస్ చేస్తున్నాం. పలు ఆర్బీఐ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ష్రెడ్డింగ్, బ్రికెట్టింగ్ యంత్రాల ద్వారా ముక్కలు చేసి బ్రిక్స్‌గా మారుస్తున్నాం' అని వివరించింది. బ్రిక్స్ తయారు చేసిన వెంటనే టెండర్లు పిలిచి విక్రయిస్తున్నామని తెలిపింది.

భారతీయుల జెనోమిక్స్ విశ్లేషణ

యూఎస్–యూకే కంపెనీల ప్రాజెక్టు

లండన్: మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు యూఎస్, యూకేలకు చెందిన రెండు కంపెనీలు జతకట్టాయి. ఇందుకోసం అవి భారతీయుల జెనోమిక్స్ (మాలిక్యులర్ బయాలజీలో ఓ భాగం) సమాచారాన్ని వాడుకోనున్నాయి. అరుదైన రోగాలను అధునాతన పద్ధతుల ద్వారా గుర్తించి మెరుగైన చికిత్స అందించే ఉద్దేశంతో కేంబ్రిడ్జిలోని గ్లోబల్ జెనె కార్ప్ (జీజీసీ), న్యూయార్క్‌లోని రీజనరాన్ జెనెటిక్స్ సెంటర్ (ఆర్జీసీ)లు సంయుక్తంగా భారత్‌లో ఓ ప్రాజెక్టును చేపట్టనున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా భారతీయుల జెనోమిక్స్ సమాచారాన్ని విశ్లేషించి, వ్యాధులను గుర్తించేందుకు, చికిత్స అందించేందుకు మెరుగైన మార్గాలను కంపెనీలు సూచించనున్నాయి. ప్రపంచంలోనే తొలిసారిగా భారీ సంఖ్యలో జెనోమిక్స్ సమాచారాన్ని ఈ కంపెనీలు పరిశీలించనున్నాయి. ఈ ప్రాజెక్టుతో భారత్‌లో ఆరోగ్య రంగంలో సమూల మార్పులు వస్తాయనీ, ఇటీవల ప్రధాని ప్రకటించిన ఆయుష్మాన్ భారత్ పథకం వంటి లక్ష్యాలను సాధించడంలో జెనోమిక్స్ సమాచారం సాయపడుతుందని ఇన్వెస్ట్ ఇండియా అనే కంపెనీ సీఈవో చెప్పారు. ముంబై, అహ్మదాబాద్‌లలో జీజీసీకి మౌలిక వసతులను సమకూర్చే పనిని ఇన్వెస్ట్ ఇండియా చూసుకుంటోంది.

'మమత ఆధ్వర్యంలో మూడో కూటమి'



ఇండోర్: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఆధ్వర్యంలో మూడో కూటమి రావాలని కేంద్ర మాజీ మంత్రి, ప్రముఖ న్యాయవాది రామ్ జత్మలానీ ఆదివారం పిలుపునిచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 'మోదీ బహిష్కరణ'కు ఇది అవసరమని ఆయన సూచించారు. జర్మనీ సహా ఇతర దేశాల్లోని నల్ల ధనాన్ని తిరిగి తీసుకురావడంలో బీజేపీ, కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ''రెండూ పార్టీలు ప్రజలను మోసగించాయి. ఇలాంటి సమయంలో నిష్పక్షపాతంగా పనిచేసే మూడో కూటమి అవసరం ఉంది. మమత మూడో కూటమి నాయకత్వం వహించాలని కోరుతున్నా''అని అన్నారు.

ఎర్రకోటలో 'మహాయజ్ఞం' ప్రారంభం

న్యూఢిల్లీ: ఎర్రకోట మైదానం ఆదివారం యాగశాలగా మారింది. వారం రోజులపాటు సాగే 'రాష్ట్రీయ రక్షా మహాయజ్ఞం'ను బీజేపీ ఎంపీ మహేశ్ గిరి నిర్వహిస్తున్నారు. ఇందుకోసం దేశ సరిహద్దుల్లోని డోక్లాం, వాగా, పూంచ్, సియాచిన్‌లతో పాటు, నాలుగు పుణ్య క్షేత్రాల నుంచి సేకరించిన మట్టితో 108 హోమ గుండాలను నిర్మించారు. యజ్ఞం నిర్వహించే 1,100 మంది రుత్విక్కుల కోసం ఎర్రకోటలో తాత్కాలికంగా 'వేదిక్ విలేజ్' నిర్మించారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని రాజకీయ కోణంలో చూడరాదనీ, దేశాభివృద్ధి, రక్షణ, భద్రతలను ఆకాంక్షించి నిర్వహిస్తున్న పూర్తి మతపరమైన కార్యక్రమమని ఎంపీ గిరి తెలిపారు.

నాలుగోసారి అధ్యక్షుడిగా పుతిన్!



మాస్కో: రష్యా అధ్యక్ష పదవిని వ్లాదిమిర్ పుతిన్ నాలుగోసారి చేపట్టడం లాంఛనమేనని తెలుస్తోంది. రష్యాలో అధ్యక్ష ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ దేశంలో ఏకంగా 11 టైమ్ జోన్‌లు ఉండటంతో పోలింగ్ ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమయంలో మొదలైంది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి 1.30 గంటలకు మొదలైన పోలింగ్ ఆదివారం అర్ధరాత్రి 11.30 గంటలకు ముగిసింది. 2000 నుంచి 2008 వరకు రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన ఆ తర్వాత నాలుగేళ్లు ప్రధానిగా ఉన్నారు. 2012లో మూడోసారి అధ్యక్షుడయ్యారు. తాజాగా రష్యాలో అధ్యక్ష ఎన్నికలు జరుగుతుండగా పుతిన్‌పై తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ ఆయనకు ప్రత్యామ్నాయంగా మరో బలమైన నేత లేరు. పుతిన్ ప్రధాన ప్రత్యర్థి అలెక్సీ నావల్నీని ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించారు.

యూపీ '9వ అభ్యర్థి' ఆశలపై నీళ్లు!

లక్నో: యూపీ రాజ్యసభ ఎన్నికల్లో అధికార బీజేపీకి చెందిన తొమ్మిదో అభ్యర్థి విజయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో బీజేపీ మిత్రపక్షమైన సుహెల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్బీఎస్పీ) అధ్యక్షుడు ఓం ప్రకాశ్ రాజ్‌భర్ ఆదివారం చేసిన వ్యాఖ్యలు ఇందుకు బలం చేకూర్చుతున్నాయి. 23వ తేదీన జరగనున్న రాజ్యసభ ఎన్నికలకుగాను కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ సహా తొమ్మిది మందిని బీజేపీ బరిలోకి దించింది. బీజేపీ సంఖ్యాబలం ప్రకారం 8మంది గెలుపు ఖాయం కాగా 9వ అభ్యర్థి విజయానికి ఎస్బీఎస్పీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేల ఓట్లే కీలకం కానున్నాయి. 'మేం అధికార కూటమి పార్టీగా కొనసాగుతున్నాం. అయినప్పటికీ రాజ్యసభ ఎన్నికల విషయం బీజేపీ మాతో చర్చించలేదు. వారి వద్దకు మేమే వెళ్లి మీకు ఓట్లేస్తాం అని చెప్పాలా? బీజేపీకి ఓటేసే విషయం చర్చించి నిర్ణయిస్తాం' అని ఓం ప్రకాశ్ రాజ్‌భర్ విలేకరులతో అన్నారు.



సంప్రదాయ చీరలు, తలపాగాలు ధరించి ముంబై వీధుల్లో మోటార్ సైకిళ్లు నడుపుతున్న మహిళలు. మరాఠీల హిందూ కొత్త సంవత్సరం 'గుడి పాడ్వా' సందర్భంగా ఆదివారం నిర్వహించిన ర్యాలీలో వారు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.

మాది ధర్మ పోరాటం



ప్లీనరీలో ప్రసంగిస్తున్న రాహుల్

బీజేపీ, ఆరెస్సెస్‌లు అధికార దాహంతో ఉన్న కౌరవులు

- అవినీతికి పర్యాయపదంగా మోదీ
- బీజేపీ అధ్యక్షుడిపై హత్యారోపణలు
- యూపీఏ హయాం చివర్లో తప్పులు చేశాం
- కాంగ్రెస్ పునరుత్తేజం ఖాయం.. నేతలు, కార్యకర్తల మధ్య గోడలను తొలగిస్తాం
- ప్లీనరీలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రసంగం

న్యూఢిల్లీ

మరో ఏడాదిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేసే దిశగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తొలి అడుగు వేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే, ప్రత్యర్థి పార్టీ బీజేపీ, ఆ పార్టీ సైద్ధాంతిక గురువు ఆరెస్సెస్, ప్రధాన ప్రత్యర్థులు ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ చీఫ్ అమిత్ షా.. లక్ష్యంగా తీవ్రస్థాయిలో ఆరోపణాస్త్రాలు సంధించారు. ఢిల్లీలో జరిగిన ప్లీనరీ ముగింపు సమావేశంలో ఆదివారం పదునైన విమర్శలతో నిప్పులు చెరిగారు. మహాభారతాన్ని గుర్తు చేస్తూ.. బీజేపీ, ఆరెస్సెస్‌లు అధికార దాహంతో ఉన్న కౌరవులుగా, కాంగ్రెస్ పార్టీ వారు సత్యం కోసం ధర్మపోరాటం చేస్తున్న పాండవులుగా అభివర్ణించారు. బీజేపీ ఆరెస్సెస్ గొంతుక అయితే.. తమది ప్రజావాణి అని చురకలంటించారు. ఎన్డీయే ప్రభుత్వ పలు నిర్ణయాలనూ రాహుల్ తప్పుబట్టారు. దాదాపు గంటపాటు ఆయన ప్రసంగించారు. అనంతరం సీడబ్ల్యూసీ సభ్యులను ఎన్నుకునే సంపూర్ణ అధికారాన్ని రాహుల్‌కు కట్టబెడుతూ.. తీర్మానాన్ని ఆమోదించారు. రాహుల్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

మోదీ.. నిలువెల్లా అవినీతి!

'ప్రధాని వాస్తవ సమస్యలనుంచి ప్రజలను పక్కదారి పట్టిస్తూ.. సన్నిహితులైన పెట్టుబడిదారులకు లాభం చేసేలా వ్యవహరిస్తున్నారు. ఈ మోదీ పేరుతోనే ఇద్దరు (నీరవ్, లలిత్) తీవ్రమైన అవినీతి కేసుల్లో దోషులుగా ఉన్నారు. ప్రధాని మోదీ వ్యక్తిగతంగా రాఫెల్ ఒప్పందంలో మార్పులు చేశారు. కాంగ్రెస్ 126 రాఫెల్ యుద్ధ విమానాలకోసం చర్చలు జరిపితే.. బీజేపీ అదే మొత్తంతో కేవలం 36 యుద్ధ విమానాలను మాత్రమే కొనుగోలు చేస్తోంది. మేం ఒక్కో విమానానికి రూ. 570 కోట్లు పెడితే.. మోదీ అదే విమానానికి రూ.1670 కోట్లు పెడుతున్నారు. మోదీ అవినీతిపై పోరాడటం లేదు. అవినీతికి పాల్పడుతున్నారు'

కురుక్షేత్రను తలపించేలా..: 'శతాబ్దాల క్రితం కురుక్షేత్రంలో మహాభారత యుద్ధం జరిగింది. కౌరవులు బలవంతులు, అహంకారులు. పాండవులు ధర్మం కోసం పోరాడారు. కౌరవుల్లాగే ఆరెస్సెస్, బీజేపీలది అధికార దాహం. పాండవుల్లాగా కాంగ్రెస్ పార్టీది సత్యం కోసం చేస్తున్న ధర్మపోరాటం'

'సుప్రీం' తిరుగుబాటుపై..: 'బీజేపీ భయాందోళనలు సృష్టిస్తోంది. మీడియా కూడా భయపడిపోతోంది. తొలిసారిగా నలుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బహిరంగంగా మాట్లాడాల్సిన పరిస్థితి తలెత్తింది. ఆరెస్సెస్, కాంగ్రెస్ మధ్య చాలా తేడా ఉంది'

ఆ మోదీ, ఈ మోదీ కలిసి..: 'నిజాయితీగా ఉన్న వ్యాపారుల నోళ్లను మూయించి.. వారు కష్టపడి సంపాదించిన ధనాన్ని అధికారులతో లూటీ చేయిస్తున్నారు. వీరు బ్యాంకుల నుంచి రూ.33వేల కోట్లు దోపిడీ చేస్తే.. బీజేపీ ప్రభుత్వం రక్షణ కల్పిస్తుంది. భారత్‌లోని బడా వ్యాపారవేత్తలు, ప్రధాన మంత్రి పదవికి మధ్య లోపాయకారి ఒప్పందానికి మోదీ అనే పేరు ఓ గుర్తుగా మారిపోయింది. ఈ మోదీ.. మరో మోదీకి 30వేల కోట్ల ప్రజాధనాన్ని ఇస్తారు. ప్రతిగా ఆ మోదీ.. ఈ మోదీకి ఎన్నికల మార్కెటింగ్‌కు అవసరమైంది ఇస్తాడు'

రైతులు, మైనార్టీలు, గౌరీ లంకేశ్‌పై..: 'గౌరీలంకేశ్, కల్బుర్గీలు ప్రశ్నించినందుకే చనిపోవాల్సి వచ్చింది. ఒకవైపు రైతులు సరైన గిట్టుబాటులేక ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. పదండి యోగా చేద్దామని మోదీ పిలుపునివ్వటం సిగ్గుచేటు కాదా? పాకిస్తాన్ వెళ్లేందుకు ఇష్టపడక ఇక్కడే ఉండిపోయిన వారిని వెళ్లిపోండని బెదిరిస్తున్నారు. తమిళులను వారి భాషను మార్చుకోవాలని బెదిరిస్తున్నారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆహారం తమకు నచ్చదంటున్నారు. మహిళలు ఎలాంటి దుస్తులేసుకోవాలో వీళ్లే నిర్ణయిస్తున్నారు'



ప్లీనరీలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ చిరునవ్వులు

యువత గురించి: 'భారత్‌లోని ప్రతి యువతకూ మేం ఓ ఆయుధం. కాంగ్రెస్ పార్టీ మీది. మీ మేధస్సు, ధైర్య సాహసాలు, శక్తి సామర్థ్యాలకు మేం ద్వారాలు తెరుస్తాం. దేశానికి మీ (యువత) అవసరం చాలా ఉంది. ఉద్యోగాలు దొరకని పరిస్థితి. అచ్ఛేదిన్, మీ అకౌంట్లలోకి రూ.15లక్షలు ఇవన్నీ బూటకమే'

యూపీఏ పాలనపై..: ' యూపీఏ–2 చివరి రోజుల్లో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేదు. మేం కూడా మనుషులమే. పొరపాట్లు చేస్తాం. బీజేపీతో పోలిస్తే మేం విభిన్నం. దేశాన్ని ముందుకు నడిపించే సత్తా మాకే ఉంది. మోదీ తను దేవుని ప్రతిరూపం అని భావిస్తున్నారు'

కాంగ్రెస్ పునరుత్తేజంపై..: 'మనం కాంగ్రెస్‌లో మార్పు తీసుకురావాలి. నాయకులు, కార్యకర్తల మధ్యనున్న అడ్డుగోడలను తొలగిస్తాను. ఇందుకోసం సీనియర్ల సలహాలతో ముందుకెళ్దాం. మన మధ్యనున్న విభేదాలు, గ్రూపు తగాదాలను పక్కనపెడదాం. 2019లో కాంగ్రెస్ ఆలోచనవిధానానిదే విజయం. అవసరమైతే రైతు రుణమాఫీ చేస్తాం'

నోట్ల రద్దు అతిపెద్ద వైఫల్యం

మోదీ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ నాశనమైందనీ, అసమర్థ ఆర్థిక నిర్వాహకుల చేతి నుంచి దేశాన్ని కాపాడినప్పుడే వృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ నేత చిదంబరం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దేందుకు స్థిరమైన ఆర్థిక వృద్ధిని సాధించడమే మార్గమని ఇందులో పేర్కొన్నారు.

ఆర్థికం.. సర్వనాశనం: మన్మోహన్

న్యూఢిల్లీ: బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిందని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్లీనరీలో తీవ్రంగా విమర్శించారు. యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం రెట్టింపు అంటూ.. భ్రమలు కల్పించి మోసం చేసిందన్నారు. 'ఇచ్చిన హామీల్లో ఒక్కదానిని కూడా మోదీ సర్కారు నెరవేర్చలేకపోయింది. రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి కనీసం రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయింది. నోట్లరద్దు, జీఎస్టీ వంటి తప్పుడు నిర్ణయాలతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. ఉత్పత్తి మందగించింది. ఎందరో ఉద్యోగాలు కోల్పోయారు. ఆరేళ్లలో రైతు రాబడి రెండింతలు కావాలంటే ఏడాదికి వృద్ధి రేటు కనీసం 12 శాతం ఉండాలి. ఇది ప్రస్తుతం అసాధ్యం' అన్నారు. జమ్మూకశ్మీర్ సమస్యకు మోదీ ప్రభుత్వం అతితక్కువ ప్రాధాన్యం ఇస్తోందనీ, దాంతో ఈ అంశం ఎన్నడూ లేనంత జటిలంగా తయారైందని మండిపడ్డారు. సరిహద్దులు సురక్షితంగా లేవనీ, సీమాంతర, అంతర్గత ఉగ్రవాదం, కల్లోల పరిస్థితులపై ప్రతిపౌరుడూ ఆందోళన చెందుతున్నాడని అన్నారు.

జమ్మూ కశ్మీర్లో పాక్ దుశ్చర్య

పూంచ్ సెక్టార్లో పాక్ కాల్పులు ● ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి మృతి

జమ్మూ: పొరుగు దేశంపాకిస్తాన్ మళ్లీ దుశ్చర్యకు తెగబడింది. భారత్‌ను రెచ్చగొట్టేలా ఆ దేశం కవ్వింపు చర్యలకు పాల్పడింది. ఇరుదేశాల మధ్య ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించింది. జమ్మూ కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి పూంచ్ లోని బాలాకోటే సెక్టార్ సరిహద్దు గ్రామాలను లక్ష్యంగా చేసుకుని పాక్ సైన్యం ఆదివారం మోర్టారు బాంబులతో విరుచుకు పడింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మరణించగా ఇద్దరు బాలికలు తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో ముగ్గురు మైనర్ సోదరులు. మరో ఐదుగురు ఆర్మీ సిబ్బంది కూడా గాయపడగా వారిని సైనిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలికలను మాత్రం హెలికాప్టర్ ద్వారా జమ్మూలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు భారత భద్రతా బలగాలకు చెందిన ఉన్నతాధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. ఈ ఘటన పట్ల జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఫ్తీ తన సంతాప సందేశాన్ని ట్వీటర్‌లో పోస్ట్ చేశారు. ఆదివారం ఉదయం 7.45 నుంచి 11.30 గంటల వరకు పాకిస్తాన్ విచక్షణారహితంగా దాడులకు తెగబడినట్లు ఆర్మీ పీఆర్వో లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ తెలిపారు. పాక్ కవ్వింపు చర్యల ఫలితంగా ఐదుగురు సాధారణ పౌరులు చనిపోయారనీ, ఆ దేశం ఎప్పుడూ అమాయక ప్రజలనే లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోందని ఆయన చెప్పారు. పౌరుల ప్రాణాలకు ఎటువంటి ముప్పు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు జమ్మూ ఐజీ ఎస్‌డీఎస్ జమ్వాల్ చెప్పారు.



గాయపడిన బాలికను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

చిన్నారులపై నేరాల్లో యూపీ టాప్

- వృద్ధులపై నేరాల్లో 4, 5 స్థానాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ
- నివేదిక విడుదల చేసిన ఎన్సీఆర్బీ



కోల్‌కతా: దేశవ్యాప్తంగా 2015 నుంచి 2016 వరకు చిన్నారులపై నేరాలు 11 శాతం పెరిగాయని నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో(ఎన్సీఆర్బీ) నివేదిక విడుదల చేసింది. 2015లో దేశవ్యాప్తంగా 94,172 నేరాలు నమోదుకాగా 2016 నాటికి ఈ సంఖ్య 1,06,958కు చేరుకుందని పేర్కొంది. ఈ నివేదికను విశ్లేషించిన క్రై అనే ఎన్జీవో సంస్థ డైరెక్టర్ కోమల్ గనోత్రా మీడియాతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా చిన్నారులపై జరిగిన నేరాల్లో 50 శాతం ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోనే నమోదయ్యాయని వెల్లడించారు. ఈ నేరాల్లో 15 శాతంతో యూపీ మొదటిస్థానంలో ఉండగా, మహారాష్ట్ర(14 శాతం), మధ్యప్రదేశ్(13 శాతం) తర్వాతి స్థానాల్లో నిలిచాయని తెలిపారు. నేరాల్లో మాయమాటలు చెప్పి తీసుకెళ్లడం, కిడ్నాపింగ్‌లు(48.9 శాతం) తొలిస్థానంలో ఉండగా.. పిల్లలపై అత్యాచారాలు(18 శాతం) తర్వాతిస్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. మరోవైపు 2014–16 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా 60 ఏళ్లకు పైబడ్డ వృద్ధుల(సీనియర్ సిటిజన్స్)పై జరిగిన నేరాల్లో 40 శాతం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనే చోటుచేసుకున్నాయని తెలిపారు. వృద్ధులను దోచుకోవడం, దాడిచేయడం, మోసం చేయడం వంటి నేరాల్లో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీలు తర్వాతి స్థానాల్లో నిలిచాయని వెల్లడించారు. చిన్నారుల కిడ్నాపుల్లో యూపీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 1,11,569 మంది పిల్లలు(41,175 మంది బాలురు, 70,394 మంది బాలికలు) తప్పిపోయారన్నారు. పోలీసులు, అధికారుల చొరవతో 2016 చివరినాటికి 55,944 మంది చిన్నారుల్ని కాపాడగలిగామన్నారు.

మూడేళ్ల తర్వాత ఏడ్చాడు!

తల్లి నర్గీస్ చనిపోయినప్పుడు కన్నీళ్లు పెట్టని సంజయ్‌దత్



న్యూఢిల్లీ: ప్రముఖ బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ తన తల్లి నర్గీస్ కేన్సర్‌తో చనిపోయినప్పుడు అస్సలు కన్నీరు పెట్టుకోలేదట. మూడేళ్ల అనంతరం ఆమె చివరి కోరికను ఆడియో టేప్‌లో విన్న దత్ నాలుగు రోజుల పాటు ఏడుస్తూనే ఉన్నారట. డ్రగ్స్‌కు బానిస కావడం, ఓ ఇంట్లో రాత్రి కాల్పులు జరిపి అరెస్ట్ కావడం, ముంబై అల్లర్ల సందర్భంగా ఆయుధాలు సేకరించడం సహా సంజయ్ జీవితంలో జరిగిన అనేక నిజ సంఘటనలతో 'సంజయ్‌దత్ – ది క్రేజీ అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ బాలీవుడ్స్ బ్యాడ్ బాయ్' పుస్తకాన్ని యాసీర్ ఉస్మాన్ ఆసక్తికరంగా రాశారు. సంజయ్ చిత్రం రాకీ విడుదలకు ముందు 1981, మే3న నర్గీస్ కేన్సర్‌తో చనిపోయారు. డ్రగ్స్‌కు తీవ్రంగా బానిసైన సంజయ్‌ను ఆయన తండ్రి సునీల్ దత్ చికిత్స కోసం అమెరికాలోని ఓ పునరావాస కేంద్రంలో చేర్పించారు. నర్గీస్ చివరిరోజుల్లో సంజయ్ కోసం మాట్లాడిన ఆడియో టేపుల్ని సునీల్ కుమారుడికి పంపారు. 'సంజూ.. అన్నింటి కంటే ముందు నువ్వు వినయంగా ఉండాలి. నీ సత్ప్రవర్తనను మార్చుకోకు. ఎవ్వరి మెప్పు కోసం ప్రయత్నించవద్దు. ఎల్లప్పుడూ వినయంగా ఉండటంతో పాటు పెద్దలను గౌరవించు. ఇవే నిన్ను ఉన్నతస్థానానికి తీసుకెళ్తాయి. నువ్వు చేపట్టే పనుల్లో ఇవే నీకు శక్తినిస్తాయి' అని నర్గీస్ అందులో చెప్పారు.

విజయవాడ ఎయిర్‌పోర్టుకు సీఐఎస్ఎఫ్ రక్షణ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా పౌర విమానాశ్రయాలకు భద్రత కల్పించే కేంద్ర పారిశ్రామిక భద్రతా సంస్థ(సీఐఎస్ఎఫ్) త్వరలోనే షిర్డీ(మహారాష్ట్ర), జామ్‌నగర్(గుజరాత్), విజయవాడ(ఆంధ్రప్రదేశ్),జబల్‌పూర్(మధ్యప్రదేశ్) ఎయిర్‌పోర్టులకు రక్షణ కల్పించనుంది. ఈ నాలుగు విమానాశ్రయాలకు సీఐఎస్ఎఫ్ భద్రత కల్పించాలని గతంలోనే కేంద్రం నిర్ణయించినప్పటికీ కొన్ని కారణాల వల్ల సిబ్బందిని ఇప్పటివరకూ కేటాయించలేదని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సీఐఎస్ఎఫ్ 59 పౌర విమానాశ్రయాలకు రక్షణ కల్పిస్తోంది. సీఐఎస్ఎఫ్‌లో ప్రత్యేక విభాగమైన ఏవియేషన్ సెక్యూరిటీ గ్రూప్ హైజాకింగ్‌తో పాటు ఎయిర్‌పోర్టులపై ఎలాంటి ఉగ్రదాడులు జరగకుండా చర్యలు తీసుకుంటుంది.


విదేశీ విరాళాలపై సవరణకు ఓకే



న్యూఢిల్లీ: రాజకీయ పార్టీల విదేశీ విరాళాలపై తనిఖీ అవసరం లేదన్న సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోద ముద్ర వేసింది. 21 సవరణలతో కూడిన 2018 ఆర్థిక బిల్లును విపక్షాల నిరసనల మధ్య లోక్‌సభ బుధవారం చర్చ లేకుండానే ఆమోదించింది. వాటిలో విదేశీ సంస్థల నుంచి పార్టీలు విరాళాలు స్వీకరించడాన్ని నిషేధిస్తూ చేసిన విదేశీ విరాళాల నియంత్రణ చట్ట (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ కూడా ఒకటి. 1976 నుంచి పార్టీలు విదేశాల నుంచి పొందిన నిధులపై ఎలాంటి సమీక్ష, తనిఖీ ఉండకూడదనేది ఈ సవరణ ఉద్దేశం. పార్టీలు విదేశీ విరాళాలు స్వీకరించడాన్ని సులభతరం చేస్తూ బీజేపీ ప్రభుత్వం 2016 ఆర్థిక బిల్లు ద్వారా ఎఫ్‌సీఆర్ఏ చట్టానికి సవరణ చేసింది. ప్రస్తుతం దానికి కొనసాగింపుగా 1976 నుంచి పొందిన విరాళాలకు తనిఖీ అవసరం లేదంటూ మరో సవరణ చేసింది. '2016 ఆర్థిక చట్టంలోని సెక్షన్ 236 తొలి పేరాలో ఉన్న 26 సెప్టెంబర్ 2010కు బదులుగా 5 ఆగస్టు 1976ని మార్చాం'అని లోక్‌సభ వెబ్‌సైట్ పేర్కొంది. ఈ సవరణ ఎఫ్‌సీఆర్ఏ ఉల్లంఘన కేసులో దోషులంటూ 2014 ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు నుంచి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తప్పించుకోవడానికి ఉపయోగపడుతుంది. అందుకే ఈ బిల్లు ఆమోదం పొందిన వెంటనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఢిల్లీ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో వేసిన అప్పీళ్లను ఉపసంహరించుకున్నాయి.

సగం ట్విటర్ ఫాలోవర్స్ ఫేక్

- ముందు వరుసలో రాహుల్, అమిత్ షా ఖాతాలు
- మోదీ ఫాలోవర్స్‌లో సగానికి సగం నకిలీనే



సోషల్ మీడియా యుగంలో ట్విటర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో ఎంత ఎక్కువ మంది ఫాలోవర్స్ ఉంటే అంతగొప్పగా ప్రముఖులు భావిస్తుంటారు. ఇక రాజకీయ నాయకుల సంగతి చెప్పాల్సిన అవసరం లేదు. పార్టీ ప్రచారం, వ్యక్తిగతంగా పేరు ప్రఖ్యాతుల కోసం సోషల్ మీడియా మీదే ఆధారపడుతున్నారు. దాదాపు అన్ని ప్రధాన పార్టీలు సోషల్ మీడియా విభాగాల్ని ఏర్పాటు చేసుకున్నాయి. అయితే మన రాజకీయ నేతల సోషల్ మీడియా ఖాతాల్లోని ఫాలోవర్స్ చాలావరకూ నకిలీ అని తేలుతున్నాయి. ముఖ్యంగా ట్విటర్‌లో సగం ఫాలోవర్స్ ఫేక్ అని ట్విటర్ ఆడిట్, ట్విప్లమసీ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఈ నకిలీ ఫాలోవర్స్ జాబితాలో రాహుల్ గాంధీ టాప్‌లో నిలిస్తే ఆ తర్వాత స్థానంలో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఉన్నారు. రాహుల్‌కి ట్విటర్‌లో 62 లక్షల మంది ఫాలోవర్స్ ఉంటే వారిలో 68 శాతం మంది ఫేక్ అని సర్వే తేల్చింది. ప్రధాని మోదీకి 4 కోట్ల 10 లక్షల మంది ఫాలోవర్స్ ఉంటే వారిలో ఏకంగా 2.5 కోట్ల మంది ఫేక్ అని తెలిపింది. అంతర్జాతీయంగా పోప్ ఫ్రాన్సిస్‌కి 48 శాతం, హిల్లరీ క్లింటన్‌కి 31 శాతం, డొనాల్డ్ ట్రంప్‌కి 26 శాతం నకిలీ అనుచరులు ఉన్నారు. రాజకీయ ప్రముఖుల్ని ఫాలో అవుతున్న వారిలో 5 వేల మందిని శాంపిల్‌గా తీసుకొని ఈ నివేదిక రూపొందించారు.

ఫేక్ ఖాతాల వెనుక గుట్టు ఇది..

ఇందుకోసం ట్విట్టర్‌లో బాట్స్ అనే సాఫ్ట్‌వేర్‌ని వాడుతున్నారు. ట్వీట్, రీ ట్వీట్ , ఫాలోయింగ్ , అన్‌ఫాలోయింగ్, అకౌంట్ మేనేజింగ్‌ను ఆటోమెటిక్‌గా చేసే సాధనమే బాట్స్.. ఈ సాఫ్ట్‌వేర్‌ని దుర్వినియోగం చేయడం వల్లే ఫేక్ ఫాలోవర్స్ పుట్టుకొస్తున్నారు. కొన్నాళ్ల క్రితం ప్రధాని మోదీకి కేవలం నెలరోజుల్లోనే 70 లక్షల మంది ఫాలోవర్స్ పెరగడంతో ఆయన పాపులారిటీ పెరిగిందని, ట్రంప్‌ని ఆయన మించిపోతారని అనుకున్నారు. అయితే నెల వ్యవధిలో అన్ని లక్షల మంది ఫాలోవర్స్ పెరగడం ఎలా సాధ్యమన్న ప్రశ్నలు వినిపించాయి. రాహుల్‌గాంధీకి రెండు నెలల్లోనే 10 లక్షల మంది ఫాలోవర్స్ పెరిగిపోయారు. ఆయన ట్వీట్లకి నిముషాల్లోనే వేల సంఖ్యలో రీట్వీట్లు వస్తున్నాయి. దీనికంతటికీ ఆటోమేటెడ్ బాట్స్ వినియోగించడమే కారణమని తేలింది. ట్విటర్‌లో నకిలీ ఖాతాలు పెరగడంతో దాని యాజమాన్యం కూడా చర్యలు మొదలు పెట్టింది. ఫిబ్రవరిలో అమెరికాలో చాలా మంది సెలబ్రిటీల ఫేక్ ఫాలోవర్స్ ఖాతాల్ని రాత్రికి రాత్రే రద్దు చేసింది.

ఎవరికి ఎంత మంది ఫేక్ ఫాలోవర్స్

రాజకీయ నేత	ఫాలోవర్స్	ఫేక్ (శాతంలో)
రాహుల్ గాంధీ	62 లక్షలు	68శాతం
అమిత్ షా	1.02 కోట్లు	67శాతం
రాజ్‌నాథ్ సింగ్	1.03 కోట్లు	63 శాతం
శశిథరూర్	66 లక్షలు	62శాతం
నరేంద్రమోదీ	4.1 కోట్లు	61శాతం
సుష్మా స్వరాజ్	1.15కోట్లు	60శాతం
అరుణ్ జైట్లీ	1.21 కోట్లు	56 శాతం
అరవింద్ కేజ్రీవాల్	1.35 కోట్లు	51 శాతం
రజనీకాంత్	45 లక్షలు	26 శాతం

–సాక్షి నాలెడ్జ్ సెంటర్

17
మృత్యువాత పడ్డవారు

18 వందలు
రెండు వారాల్లో ఆస్పత్రిపాలు

ప్రజలకు సురక్షిత నీరు అందించడం సర్కారు కనీస బాధ్యత. ఆ బాధ్యతపట్ల అలసత్వం ప్రదర్శిస్తే జరిగే నష్టాన్ని మాటల్లో వర్ణించలేం. కానీ, ఆ నిర్లక్ష్యమే ఇప్పుడు గుంటూరు నగర వాసులకు శాపంగా మారింది.. కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. కారణం, ఎప్పుడో ఏర్పాటుచేసిన మంచినీటి పైపులైన్లు శిథిలావస్థకు చేరాయి. ఎప్పటికప్పుడు వీటి స్థితిగతులను పరిశీలించుకుంటూ లీకేజీలున్న చోట కలుషిత జలాలు పైపులైన్లలో కలుస్తున్నాయా అన్నది చూసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. ఫలితం.. 1800మంది ఆస్పత్రిపాలు కాగా, 17మంది మృత్యువాతపడ్డారు.

పాపం ప్రభుత్వానిదే!

గుంటూరు అతిసార ఘటనలో అడుగడుగునా నిర్లక్ష్యమే..


మురుగు కాలువల్లో ఉన్న మంచినీటి పైపులైనులు

- కలుషిత నీరే కాటేసింది
- ప్రభుత్వ వైఫల్యంవల్లే పెరిగిన మరణాలు
- వారం రోజుల వరకూ కారణం కనిపెట్టలేని దుస్థితి
- నగరం మొత్తం మురుగు నీటిలోనే మంచినీటి పైపులైనులు
- మున్సిపల్ నీటిలో ఈ-కోలి బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారణ
- పరామర్శకూ రాని సీఎం, మంత్రులు, ఎంపీలు
- తప్పులు కప్పిపుచ్చుకునేందుకు అధికారుల బలి
- మృతుల సంఖ్య తగ్గించి చూపేందుకు సర్కారు యత్నం

సాక్షి, గుంటూరు

గుంటూరు నగరంలో గతంలో ఎన్నడూలేని రీతిలో తాగునీరు విషతుల్యమవడంతో అమాయకులు బలయ్యారు. ప్రభుత్వ అలసత్వం నిరుపేద కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. కలుషిత నీరు తాగి 17 మంది మృత్యువాత పడగా, 1800 మంది అతిసారతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం కలిగించింది. ఇదేదో మారుమూల గ్రామాల్లో జరిగిన సంఘటన కాదు. సింగపూర్, జపాన్ వంటి దేశాలను తలదన్నేలాగా రాజధాని నిర్మాణం చేపడుతున్నట్లుగా ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్న అమరావతి రాజధానికి జిల్లా కేంద్రంగా ఉన్న గుంటూరు నగరంలో జరిగిన దుర్ఘటన ఇది. ముందు కొన్ని ప్రాంతాల్లో వెలుగు చూసిన ఈ సమస్య ఆ తర్వాత నగరమంతా వ్యాపించింది. అసలు నీరు కలుషితం ఎలాగైందో తెలుసుకోవడానికే ప్రభుత్వానికి వారం రోజులు సమయం పట్టిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మొదటి వారంలో నలుగురు చనిపోగా, ఆ తరువాత వారంలో ఏకంగా 13 మంది మృత్యువాత పడ్డారు. ఆదిలోనే ప్రభుత్వం స్పందించకపోవడంవల్లే మరణాలు పెరుగుతూ వచ్చాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు.. నగరపాలక సంస్థ సరఫరా చేస్తున్న నీటిలో ఈ-కోలి బ్యాక్టీరియా ఉన్నట్లు రీజినల్ ల్యాబ్ అధికారులు నిర్ధారించడంతో ఉన్నతాధికారులు, ప్రభుత్వం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. సమస్య నుంచి తప్పించుకోడానికి ప్రభుత్వం ఇంజినీరింగ్ విభాగంలో ఉన్నతాధికారులను వదిలేసి కిందిస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకుంది. అనంతరం వైఎస్సార్‌సీపీతోపాటు అన్ని రాజకీయ పార్టీలు ఆందోళనను ఉధృతం చేయడంతో హడావుడిగా 15వ తేదీ రాత్రి మృతుల ఇళ్లకు వెళ్ళి కుటుంబసభ్యులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించారు.

బాధితులను పరామర్శించని సీఎం, మంత్రులు, ఎంపీ

అతిసారతో గుంటూరు అట్టుడుకుతుంటే నగరానికి కూతవేటు దూరంలో ఉంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుగానీ, జిల్లా మంత్రులుగానీ, గుంటూరు ఎంపీగానీ బాధితులను పరామర్శించలేదు. కనీసం అధికారులతో సమీక్ష కూడా నిర్వహించలేదు. ప్రతిపక్షాలు ఆందోళనను ఉధృతం చేయడం, ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం హడావుడిగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఆగ్రహం వ్యక్తంచేశారు. టెలికాన్ఫరెన్స్ ముగిసిన కొద్దిసేపటికే గుంటూరు నగర కమిషనర్ చల్లా అనురాధ స్థానంలో ఐఏఎస్ అధికారిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చేశారు.

మురుగునీటిలోనే మంచినీటి పైపులైన్లు

గుంటూరు ఈస్ట్ పరిధిలోని ఆనందపేట, సంగడిగుంట, పాత గుంటూరు వంటి ప్రాంతాల్లో మురుగునీటిలోనే మంచినీటి పైపులైనులు ఉండడం.. అవి కాలం చెల్లడంతో లీకేజీలు ఏర్పడి మురుగునీరు కలుస్తోందంటూ ఇంజినీరింగ్ అధికారులకు ఎన్నిసార్లు మొత్తుకున్నా పట్టించుకోలేదంటూ బాధితులు వాపోతున్నారు. అనేక దశాబ్దాల క్రితం వేసిన పైపులైనులు కావడంతో లీకేజీలు ఏర్పడ్డాయని ప్రకటించిన మంత్రులు వాటిని ఇప్పటి వరకు మార్చేందుకు ఎందుకు చర్యలు చేపట్టలేదో తెలియని పరిస్థితి. కొన్ని ప్రాంతాల్లో లెట్రిన్ పైపులైనులు సైతం మురుగు కాలువల్లోకి వదులుతుండటం, అదే కాలువల్లో మంచినీటి పైపులైనులు ఉండటం చూసి ఉన్నతాధికారులు అవాక్కయ్యారు. ఆనందపేట, సంగడిగుంట, వినోభనగర్, పొన్నూరు రోడ్డు, బరాఇమాంపంజా వంటి ప్రాంతాలకు నీటి సరఫరా చేసే వాటర్ ట్యాంకుల పైకప్పు కూలిపోవడంతో కుక్కలు పైకెక్కి ఈదుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు నీటి నమూనాలను సేకరించి ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

పనులు ప్రారంభంలో జాప్యం

2013లో సుమారు 20 కిలోమీటర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కొత్త పైపులైను నిర్మాణం చేపట్టేందుకు ప్రపంచ బ్యాంకు నిధులు మంజూరయ్యాయి. కానీ, నిధులు తగ్గించారనే సాకుతో ఆ పనులు సరిగ్గా జరగలేదు. అలాగే, 2017లో మళ్లీ కొత్త పైపులైను నిర్మాణాలు చేపట్టేందుకు వర్క్ ఆర్డర్ ఇచ్చారు. ముందు అనుకున్న కాంట్రాక్టరు ముందుకు రాకపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరి 26న మళ్లీ టెండర్లు పిలిచి వేరొకరికి పనులు అప్పగించారు. పనులు మొదలెట్టేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.


డయేరియా బారిన పడి జీజీహెచ్‌లో చికిత్సపొందుతున్న బాధితులు

ప్రాణాలకు ప్రమాదం



డయేరియా వల్ల డీహైడ్రేషన్‌కు గురై కిడ్నీలు పాడవుతాయి. బీపీ, షుగర్ ఉన్నవాళ్లు, పెద్ద వయస్సువారు, హైరిస్క్ గ్రూపునకు చెందిన వారు కిడ్నీ జబ్బుల బారినపడి, అవయవాలు దెబ్బతిని ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. పరిస్థితి విషమించకముందే ఇలాంటి వారు చికిత్స చేయించుకుంటే ప్రాణాపాయం తప్పుతుంది.

– డాక్టర్ చింతా రామకృష్ణ, నెఫ్రాలజిస్ట్

అధికారుల నిర్లక్ష్యమే కారణం



ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయాం. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, కలుషిత తాగునీరు కారణంగా ఇంటి పెద్ద దిక్కును కోల్పోయాం. సరైన వైద్య సేవలు అందకపోవడం వల్లే మాకీ దుస్థితి. ప్రభుత్వ నష్ట పరిహారం ఇంకా మాకు అందలేదు. రెండు రోజుల నుంచి సంబంధిత అధికారుల కోసం ఎదురుచూస్తున్నాం.

– అడపాల రమ్య(మృతుడు అడపాల వెంకట్రావు కోడలు)

వైద్యం అందకే తండ్రిని కోల్పోయా..



నా తండ్రి మరణానికి వైద్యుల నిర్లక్ష్యమే కారణం. సకాలంలో వైద్య సాయం అందలేదు. అత్యవసర సేవలు అందని కారణంగానే ఆయనను కోల్పోయాం. ప్రభుత్వం అందిస్తున్న పరిహారం వల్ల ప్రయోజనం చేకూరదు. ఇప్పటి వరకూ వైద్యం కోసం 50 వేల రూపాయలు ఖర్చుచేశాం. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరణాలు సంభవిస్తే ప్రభుత్వం నష్ట పరిహారం అందించి చేతులు దులుపుకొంటోంది.

– సింహాచలం (మృతుడు నూకరాజు కుమారుడు)

బాధితులకు వైద్య సేవలు దారుణం



తాగునీరు కారణంగా అనారోగ్యానికి గురై ఆస్పత్రులకు వస్తే వైద్యులు బాధ్యతగా వ్యవహరించలేదు. అత్యవసర వైద్యసేవలు అందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వారు సకాలంలో స్పందించని కారణంగానే నా మేనత్తను కోల్పోయా. డయేరియా బాధితులకు వైద్య సేవలు దారుణంగా ఉన్నాయి.

– మనోహర్, (మృతురాలు గంగా భవాని మేనల్లుడు)


పై భాగంలో పగిలిపోయిన మంచినీటి ట్యాంకు

అధికారుల తప్పుడు లెక్కలు

ఇదిలా ఉంటే.. అతిసార కారణంగా రెండు వారాల్లో 17మంది చనిపోగా.. 1800 మంది వరకు ఆస్పత్రి పాలయ్యారు. కానీ, జీజీహెచ్ అధికారులు ఎనిమిది మంది మాత్రమే డయేరియాతో చనిపోయారని, మిగిలినవి అనుమానిత మరణాలుగా వెల్లడించడం విమర్శలకు తావిచ్చింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో కేసులు పూర్తిస్థాయిలో రికార్డులకు ఎక్కలేదని సమాచారం.

అసలు జరిగిందేమిటంటే..

ఆనందపేట, సంగడిగుంట, బారాఇమాంపంజా, వినోభానగర్, జియావుద్దీన్ నగర్, తదితర ప్రాంతాల్లోని పాత యూజీడీ శిథిలావస్థకు చేరింది. ఇళ్లల్లో నుంచి యూజీడీ పైపులైనుకు ఉన్న కనెక్షన్లు పూర్తిగా మూసుకుపోయాయి. దీంతో సెప్టిక్ ట్యాంకుల ద్వారా వచ్చే మురుగంతా మ్యాన్‌హోల్స్ నుంచి పొంగి పొర్లుతుండటం గుర్తించిన ఇంజినీరింగ్ అధికారులు వాటిని పగులగొట్టి సైడు కాలువల్లోకి మళ్లించారు. అంతేకాకుండా, సుద్దపల్లిడొంక వద్ద ఉన్న యూజీడీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ మోటార్లు పని చేయకపోవడంతో మురుగునీటిని శుద్ధిచేసే అవకాశం లేకుండాపోయింది. దీంతో యూజీడీ మ్యాన్‌హోల్స్ పక్క నుంచే శిథిలావస్థకు చేరిన మంచి నీటి పైపులైన్లలోకి మురుగునీరు చేరుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఏడాది క్రితమే ఇది గుర్తించినప్పటికీ సమస్య పరిష్కరించకపోవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో మూడు రోజుల తరువాత పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ పనులు ప్రారంభించారు. శిథిలావస్థలో ఉన్న సుమారు 24కి.మీ పొడవున్న డిస్ట్రిబ్యూషన్ లైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయటం ప్రారంభించారు. ఇది ముందే చేసిఉంటే ఇంత అనర్థం జరిగి ఉండేది కాదని ప్రజలు మండిపడుతున్నారు.

• తెలంగాణ

నేడు కోల్‌కతాకు కేసీఆర్

- ఉదయం 11:45కు ప్రత్యేక విమానంలో పయనం
- మధ్యాహ్నం 3:30కు బెంగాల్ సీఎం మమతతో భేటీ
- ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై 2 గంటలపాటు సమాలోచనలు

సాక్షి, హైదరాబాద్: దేశంలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా కొత్త కూటమి ఏర్పాటును ప్రతిపాదిస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు... ఫెడరల్ ఫ్రంట్ దిశగా కార్యాచరణలో భాగంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీతో సోమవారం భేటీకానున్నారు. ఉదయం 10 గంటలకు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానున్న సీఎం.. 11.30 గంటలకు అక్కణ్నుంచి బయల్దేరి ఉదయం 11.45కు బేగంపేట నుంచి ప్రత్యేక విమానంలో కోల్‌కతా బయలుదేరనున్నారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీ వినోద్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు కె. కేశవరావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, పలువురు పార్టీ ముఖ్య నేతలతో కలిపి మొత్తం 12 మంది వెళ్లనున్నారు. మధ్యాహ్నం 1.45 గంటలకు కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకొని అక్కణ్నుంచి తాజ్ బెంగాల్ హోటల్‌కు చేరుకుంటారు. సీఎం అక్కడే మధ్యాహ్న భోజనం చేసి ఆపై పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులను కలుసుకునే అవకాశాలున్నాయి. మధ్యాహ్నం 3.15 నిమిషాలకు అక్కడి పశ్చిమ బెంగాల్ సచివాలయం చేరుకొని 3.30 గంటలకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో భేటీ అవుతారు. మమతతో దాదాపు రెండు గంటలపాటు సమావేశమై కొత్త కూటమి ఏర్పాటు సన్నాహాలపై చర్చిస్తారు. సాయంత్రం 5:30కు అక్కణ్నుంచి తాజ్ బెంగాల్ హోటల్‌కు వెళ్లి.. ఆ తర్వాత కాళీ ఘాట్‌లోని కాళికామాత ఆలయాన్ని దర్శించుకుంటారు. రాత్రి 7.30కు అక్కణ్నుంచి ప్రత్యేక విమానంలో తిరుగు పయనమవుతారు. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం పోరాడతానని ఇటీవల ప్రకటించిన సీఎం కేసీఆర్... తనకు మమత మద్దతు తెలిపినట్లు వెల్లడించారు. ఈ అంశంపై ప్రాంతీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చే కార్యాచరణను ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఆయన మమతా బెనర్జీతో తొలిసారిగా భేటీ అవుతుండటం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

నత్తనడకన యూజీడీ పనులు

- గుంటూరులో డయేరియా వ్యాప్తికి ఇదీ కారణమే
- పట్టించుకోని ఇంజనీరింగ్ శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థల్లో యూజీడీ (అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ) కనెక్షన్ల పనులు ముందుకు సాగడం లేదు. పైపులైన్ల పనులు పూర్తయినా, నిధులు అందుబాటులో ఉన్నా ఇవి నత్తనడకన సాగుతున్నాయి. మున్సిపల్ ఇంజనీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు మంచినీటి కనెక్షన్లకు ఇచ్చే ప్రాధాన్యతను యూజీడీ కనెక్షన్లకు ఇవ్వకపోవడమే దీనికి కారణం. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి నగరపాలక సంస్థల్లో అధికారులు ఈ పనుల పట్ల శ్రద్ధ వహించడం లేదు. గుంటూరులో కలుషిత నీటిని తాగి వందలాది మంది డయేరియా బారిన పడి 17 మంది మృతి చెందడం తెలిసిందే. అక్కడ యూజీడీ పనులు సరిగా జరగకపోవడమే దీనికి కారణమని అధికారులు నిర్ధారించారు.

రాష్ట్రంలో 20 లక్షల యూజీడీ కనెక్షన్లు

రాష్ట్రంలో 16 నగరపాలక సంస్థలు, మున్సిపాల్టీల్లో దాదాపు 20 లక్షల యూజీడీ కనెక్షన్లు ఉన్నాయి. మున్సిపాల్టీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి రాకపోవడంతో 8 లక్షల్లోపే యూజీడీ కనెక్షన్లు ఉన్నాయి. అమృత్ పథకం నిధులతో విజయవాడలో స్టార్మ్ వాటర్ వర్క్స్, గుంటూరు, నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. అయితే నిర్మాణ సంస్థలు ఆ పనులను వేగంగా చేయడం లేదు. విజయవాడలో 90 వేల వరకు యూజీడీ కనెక్షన్లు ఉంటే 2021 నాటికి 12 లక్షల యూజీడీ కనెక్షన్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో అధికారులు ఉన్నారు. స్టార్మ్ వాటర్ వర్క్స్ జరగని డివిజన్లలో 8 వేల యూజీడీ కనెక్షన్లు ఇవ్వడానికి అధికారులు టెండర్లు ఆహ్వానించినా రెండు వేల కనెక్షన్లు కూడా ఇవ్వలేకపోయారు. గుంటూరు ఘటన తర్వాత విజయవాడలో రోజుకు కనీసం 200 యూజీడీ కనెక్షన్లు ఇచ్చేందుకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. విశాఖపట్నంలో 4.50 లక్షల నివాస గృహాలు ఉంటే లక్ష గృహాలకే యూజీడీ కనెక్షన్లు ఇచ్చారు. అక్కడ మరో 30 వేల యూజీడీ కనెక్షన్లు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం రూ.30 కోట్లను విడుదల చేసింది. గుంటూరు, నెల్లూరులో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో యూజీడీ కనెక్షన్ల ఏర్పాటులోనూ ఆలస్యం జరుగుతోంది.


మురుగు కాలువల్లో ఉన్న మంచినీటి పైపులైనులు

ప్రజాప్రతినిధుల సహకారం లేదు

ప్రజాప్రతినిధులు యూజీడీ కనెక్షన్ల ఏర్పాటుపై శ్రద్ధ తీసుకోవడం లేదు. తమ ఇంటికి సమీపంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయినా, పైపులు ఏర్పాటు చేసినా వాటికి కనెక్షన్లు ఇచ్చుకునేందుకు ప్రజలు కూడా ముందుకు రావడం లేదు. కనెక్షన్ కోసం మున్సిపాల్టీకి రూ.1000 చెల్లించాల్సి ఉన్నా చెల్లించడం లేదు. దీంతోపాటు ఈ పనుల వల్ల లభించే పర్సంటేజీలు కూడా నామమాత్రంగా ఉండటంతో ఆ పనుల పట్ల మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ అలక్ష్యం వహిస్తోంది.

• తెలంగాణ

మందు కొట్టి.. బైక్‌ను ఢీకొట్టి..

- యువతి ర్యాష్ డ్రైవింగ్..
- బోరబండవాసి మృతి

హైదరాబాద్: స్నేహితులతో కలసి కారులోనే పార్టీ చేసుకుని, మద్యం సేవించారు. అదే మత్తులోనే ఓ యువతి మితిమీరిన వేగంతో కారు నడిపింది. దీంతో కారు అదుపు తప్పి యాక్టివాను ఢీకొట్టింది. శనివారం అర్ధరాత్రి రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో యాక్టివాపై ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడు బోర బండకు చెందిన రామాయణం చిరంజీవి(20)గా, క్షతగాత్రుడు రామనాతి సాయికుమార్(20)గా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి కారకురాలైన న్యూఢిల్లీకి చెందిన జెన్నీ జాకబ్(26)ను అదుపులోకి తీసుకుని, బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయగా 51 శాతం బీఏసీ రీడింగ్ నమోదైందని పోలీసులు చెప్పారు. ఆదివారం రాయదుర్గం ఎస్ఐ నదీమొద్దీన్ వివరాలను మీడియాకు వెల్లడించారు. న్యూఢిల్లీకి చెందిన జెన్నీ జాకబ్, లీజా.. మాదాపూర్‌లోని ఓ ఐటీ కంపెనీలో పనిచేస్తూ కోకాపేట్‌లోని బ్లాసమ్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. శనివారం స్నేహితుడు రవనీత్ సింగ్‌ను కలిసి.. రాత్రి జూమ్‌కార్‌లో క్రెటా కారును అద్దెకు తీసుకొని కారులోనే పార్టీ చేసుకున్నారు. రాత్రి 11.30 గంటలకు లీజాతో కలసి కారు నడుపుకుంటూ మాదాపూర్ నుంచి నిర్మాణంలో ఉన్న టీహబ్ మీదుగా రాయదుర్గం వైపు వెళుతున్నారు. మద్యం మత్తులో ఉన్న జెన్నీ జాకబ్ కారును మితిమీరిన వేగంతో నడుపుతూ బయో డైవర్సిటీ వద్ద హోండా యాక్టివాను ఢీకొట్టింది. ఆ బైక్‌పై ఉన్న చిరంజీవి, సాయికుమార్ కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోని కేర్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ చిరంజీవి మృతి చెందాడు. మాదాపూర్‌లోని జుమాటోలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న చిరంజీవి విధులు ముగించుకొని స్నేహితుడు సాయికుమార్‌తో కలసి గచ్చిబౌలి నుంచి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న సాయికుమార్ పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఉన్న ఒక్క కుమారుడు చిరంజీవి మృతి చెందడంతో అతని కుటుంబం విషాదంలో మునిగిపోయింది.



పల్టీలు కొట్టిన కారు....

మద్యం మత్తులో ఉన్న జెన్నీ జాకబ్ మితిమీరిన వేగంతో కారు నడిపి బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌ను ఢీ కొట్టిన అనంతరం కారు మూడు పల్టీలు కొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జు అయ్యింది. క్రేటా కారులో బెలూన్ ఓపెన్ కావడంతో జెన్నీ, లీజాకు గాయాలు కాలేదు. కారులో బీరు సీసాలు, చికెన్ లెగ్ పీస్‌లు పోలీసులకు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నదీమొద్దీన్ తెలిపారు.

రెవెన్యూశాఖలో ఇక బయోమెట్రిక్

చకచకా ఉద్యోగుల రిజిస్ట్రేషన్లు
73 శాతం మంది రిజిస్ట్రేషన్లు పూర్తి



సాక్షి, అమరావతి: రెవెన్యూ శాఖలో ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి కానుంది. ఇప్పటికే రెవెన్యూలో బయోమెట్రిక్ హాజరు అమలవుతున్నట్లు రికార్డుల్లో పేర్కొంటున్నా కొందరు ఇంకా రిజిస్ట్రేషన్లు చేసుకోలేదు. క్షేత్రస్థాయి ఉద్యోగుల్లో కొందరు అఫీషియల్ టూర్ పత్రాలిచ్చి ప్రస్తుతానికి విధులకు హాజరైనట్లు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో ఇలా కుదరదని అధికారులు పేర్కొనడటంతో అందరూ బయోమెట్రిక్ యంత్రాల్లో రిజిస్ట్రేషన్లు నమోదు చేయించుకుంటున్నారు.

వీఆర్‌ఏలు కూడా బయోమెట్రిక్ పరిధిలోకి..

రెవెన్యూ శాఖలో మొత్తం 42,839 మంది ఉద్యోగులుండగా ఇప్పటి వరకూ 31,381 మంది బయోమెట్రిక్ యంత్రాల్లో పేర్లు నమోదు చేయించుకున్నారు. 73 శాతం మంది ఉద్యోగులు బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్లు చేయించుకోగా మిగిలిన 27 శాతం మంది చేయించుకోవాల్సి ఉంది. బయోమెట్రిక్ హాజరు నమోదులో పశ్చిమ గోదావరి జిల్లా 99.77 శాతంతో ప్రథమ స్థానంలో ఉంది. కృష్ణా జిల్లా 98.04 శాతంతో, అనంతపురం జిల్లా 96.51 శాతంతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయి. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లు చేయించుకోని 27 శాతం మందిని త్వరగా బయోమెట్రిక్ యంత్రాల్లో వేలిముద్రలు లేదా ఐరిస్ నమోదు చేయించుకోవాలని అధికారులు ఆదేశాలు జారీచేశారు. రెవెన్యూ ఉద్యోగుల్లో అత్యధికంగా 25,018 మంది గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) ఉన్నారు. వాస్తవంగా వీరికి ప్రభుత్వం వేతనాలివ్వడంలేదు. నామమాత్రపు గౌరవ వేతనాలు మాత్రమే చెల్లిస్తోంది. అయినప్పటికీ వీరిని కూడా ప్రభుత్వం బయోమెట్రిక్ హాజరు పరిధిలోకి తెస్తోంది. గ్రామ రెవెన్యూ అధికారులు 9002 మంది ఉన్నారు. వీరు గ్రామాల్లో పనిచేయాలి. అయినప్పటికీ వీరికి కూడా తహసీల్దారు కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరును ప్రభుత్వం తప్పనిసరి చేస్తోంది. దీంతో ఇబ్బందులొస్తున్నాయని అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నారాయణను మంత్రి పదవి నుంచి తొలగించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు కార్పొరేషన్ నిర్లక్ష్యం వల్ల డయేరియా ప్రబలి 25 మంది మృతి చెందారని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఇందుకు కారణమైన పురపాలక శాఖ మంత్రి నారాయణను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల పేదలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ నెల 22వ తేదీన గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ (జీఎంసీ) కార్యాలయం ముట్టడించాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.కృష్ణయ్య, నాయకులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

చెట్టు నీడ

మీరు చూడని జీవితం

రైలు వేగంగా వెళ్తోంది. అంతకంటే వేగంగా తోవ పక్కనున్న చెట్లూ, దూరంగా గడ్డి మేస్తున్న మేకలూ, అక్కడక్కడా నిండివున్న చెరువులూ వెనక్కి వెళ్లిపోతున్నాయి. కిటికీలోంచి వాటిని ఉద్విగ్నంగా చూస్తున్న ఒక యువకుడు, ‘నాన్నా, ఆకుపచ్చని చెట్లు వెనక్కి పరుగెడుతున్నాయి’ అన్నాడు. వాళ్ల నాన్న సంతోషంతో చిరునవ్వు నవ్వాడు.

‘నాన్నా, చూశావా? పైన మేఘాలు మనతో పాటు వస్తున్నాయి’ మళ్లీ ఆనందంతో అరిచినట్టుగా అన్నాడు యువకుడు. వాళ్ల నాన్న ఆకాశం వైపు ఓసారి ముఖాన్ని పెట్టి, మళ్లీ కొడుకు సంతోషపు ముఖాన్ని తృప్తిగా చూశాడు.

అదే రైలులో వారి బోగీలో పక్కసీట్లో ప్రయాణిస్తున్న ఒక జంటకు ఈ

> **అదే రైలులో వారి బోగీలో పక్కసీట్లో ప్రయాణిస్తున్న ఒక జంటకు ఈ యువకుడి తీరు విడ్డూరంగా కనబడింది. చెట్లనూ, మేఘాలనూ చూసి ఆనందించే పిల్లాడి వయసైతే నిశ్చయంగా కాదు.**

యువకుడి తీరు విడ్డూరంగా కనబడింది. చెట్లనూ, మేఘాలనూ చూసి ఆనందించే పిల్లాడి వయసైతే నిశ్చయంగా కాదు.


‘నాన్నా, అటు చూడు...’ అని ఒక వైపు దూరంగా చేయిని చూపిస్తూ, తన సంతోషాన్ని ఆపుకోలేక మళ్లీ నాన్నను పిలిచాడు యువకుడు.

ఇక ఈ చేష్టతో ఆ జంటకు చిర్రెత్తిపోయింది. అందులో భర్త యువకుడి నాన్నను ఉద్దేశించి, ‘సర్, నేను ఇలా అంటున్నానని ఏమీ అనుకోవద్దు. మీ అబ్బాయి అలా పిల్లాడిలా ప్రవర్తించడమూ, మీరు దానికి వంతపాడటమూ చూడ్డానికి కొంత ఇబ్బందిగా ఉంది. అతణ్ని మంచి డాక్టర్‌కు చూపించకపోయారా?’ అన్నాడు.

అలా అన్నందుకు ఆ తండ్రి వారిని ఇంతైనా తప్పు పట్టకుండా చెప్పాడు: ‘హాస్పిటల్ నుంచే వస్తున్నాం సర్. వాడికి పుట్టుకనుంచే చూపు తక్కువ. ఇవ్వాళే కొత్త కళ్లు వచ్చాయి’.

గుడ్ ఫుడ్

గర్భిణులు తింటే మంచిది



అత్యంత తియ్యటి పండ్లలో సపోటా ఒకటి. చాలా భారతీయ ప్రాంతాల్లో దీన్ని చికూ అని అంటుంటారు. దీనిలో ఎన్నో రకాల పోషకాలు, విటమిన్లు, మినరల్స్ కూడా కలిగి ఉండి తన తియ్యదనంతో ఎంతటి రుచిని ఇస్తుందో... తన పోషకాలతోనూ అంతే మంచి ఆరోగ్యాన్ని ఇస్తుంది. సపోటాతో సమకూరే కొన్ని ఆరోగ్య ప్రయోజనాలివి.

- గర్భిణులకు, బాలింతలకు, పాలిచ్చే తల్లులకు సపోటా ఎంతో మేలు చేస్తుంది. ఇక నెలతప్పిన వారిలో ఉండే వేవిళ్లు, వికారం, వాంతులను సపోటా సమర్థంగా అరికడుతుంది.
- సపోటాలో విటమిన్–ఏ పుష్కలంగా ఉండటం వల్ల కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.
- సపోటా.. జీర్ణవ్యవస్థలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి, ఈసోఫేజైటిస్, ఎంటిరైటిస్, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ వంటి వ్యాధులను అరికడుతుంది.
- ఇందులో పీచు పుష్కలంగా ఉండటం వల్ల విరేచనం తేలిగ్గా అయ్యేలా చూస్తుంది. మలబద్ధకం లేకుండా చేస్తుంది.
- సపోటాలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ ఫ్రీ–రాడికల్స్‌ను హరించి, వయసు పెరుగుదల వేగాన్ని మందగింపజేసి, చాలాకాలంపాటు యౌవనంగా ఉండేలా చేస్తాయి. మేని మీద ముడతలు రాకుండా కూడా చేస్తాయి ఈ యాంటీఆక్సిడెంట్స్.
- పాలసపోటా చర్మంలో పెరిగే చాలా రకాల ఫంగల్ పెరుగుదలను అరికడుతుంది.
- సపోటాలో క్యాల్షియమ్, ఫాస్పరస్, ఐరన్ పాళ్లు చాలా ఎక్కువ. దాంతో అది ఎముకలు పటిష్టంగా ఉంచడంలోనూ, వాటి ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక భూమిక వహిస్తుంది.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
సోమవారం 19-3-2018



ఇంకొక గాజు తెరను మహిళలు భళ్లున బద్దలు కొట్టారు! ‘లైన్‌మన్’ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి కోర్టు నుండి ఆదేశాలు తెచ్చుకున్నారు. విద్యుత్‌శాఖలోని 2,553 జూనియర్ లైన్‌మన్ ఉద్యోగాల కోసం తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 16న నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే కేవలం పురుష అభ్యర్థుల దరఖాస్తులను మాత్రమే స్వీకరించే విధంగా ఆ సాఫ్ట్‌వేర్ తయారై ఉండటంతో మహిళలు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. దీనిపై మహిళా అభ్యర్థులు కోర్టుకు వెళ్లి, దరఖాస్తుకు అనుమతి తెచ్చుకున్నారు (దరఖాస్తుకు ఇవాళ్టితో గడువు ముగుస్తోంది). ఈ నేపథ్యంలో... ముప్పై ఏళ్ల క్రితమే ‘మెన్’ పోస్టుల సామ్రాజ్యంలోకి తన అప్లికేషన్‌ని బాణంలా సంధించిన ఓ కెమెరా ఉమన్ ఇన్‌స్పైరింగ్ స్టోరీ ఇది.

డేడీ కెమెరాకు లేడీ లెన్స్

‘మెన్’ అనే పేరున్న పోస్టుకి అప్లై చేసుకుంది! దూరదర్శన్‌లో చేరి, కెమెరా ఉమన్‌గా క్లిక్ అయింది. మనిషికి జెండర్ గానీ, పనికి జెండర్ ఏంటీ అంటూ... మూడు దశాబ్దాలుగా వీక్షకులకు విశ్వదర్శనం చేయిస్తోంది జయశ్రీ పూరి.

ముప్పై రెండేళ్లనాటి మాట! అప్పుడామె వయసు 23. దరఖాస్తు చేసిన ఉద్యోగం పేరు కెమెరామన్. అప్పటి వరకు మన దేశంలోని ఆ పోస్టులో ‘ఉ’ అనే అక్షరం లేదు. ఆ రంగం మగవాళ్లదే. అందుకే ఆ ఉద్యోగం పేరు ‘కెమెరామన్’. నోటిఫికేషన్‌లో కూడా కెమెరామన్ పోస్టుకు ఇంటర్వ్యూ అనే ప్రచురించారు. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయిన తర్వాత ఆమెకు ఆఫర్ లెటర్ ఇచ్చేటప్పుడు తలెత్తింది సందేహం. ఒక ఉమన్‌కి ‘కెమెరామన్’ డిజిగ్నేషన్ ఇవ్వవచ్చా? అని. అదేమీ పట్టించుకోలేదు జయశ్రీ పూరి. ఆఫర్ లెటర్ రాగానే వెళ్లి దూరదర్శన్‌లో కెమెరాఉమన్‌గా ఉద్యోగంలో చేరారు జయశ్రీ పూరి.



ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర సహోద్యోగినితో కలిసి నవ్వులు చిందిస్తూ జయశ్రీ (ఎడమ వైపు)

అసలేమీ తెలియకుండానే!

‘‘ఆ ఇంటర్వ్యూకి ఒక అమ్మాయి రావడాన్ని ఆశ్చర్యంగా చూశారు ఇంటర్వ్యూ బోర్డులో ఉన్న వాళ్లు. వాళ్లను అంతకంటే ఆశ్చర్యపరిచిన విషయం.. నా సమాధానం. ‘నీకు కెమెరా గురించి క్షుణ్ణంగా తెలుసా?’ అని అడిగారు. ‘నాకేమీ తెలియదని, నేర్చుకోవాలనే కోరిక బలంగా ఉందని, నేర్చుకుని నైపుణ్యంతో పని చేస్తాననీ’ చెప్పాను. ‘నువ్వేం చదివావు?’ అని అడిగారు నా సర్టిఫికేట్స్ చూస్తూ. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా చేస్తున్నానప్పటికి. నా చదువుకు సంబంధం లేకపోయినా, పేపర్‌లో వచ్చిన ప్రకటన చూసి ఆసక్తితో వచ్చానని చెప్పాను. ఉద్యోగం ఇచ్చారు’’ అని అప్పటి రోజుల్ని గుర్తు చేసుకుంటారు జయశ్రీ. ఇప్పుడామెకి 55 ఏళ్లు. ఉద్యోగంలో చేరిన తొలి రోజులను ఎవరు మాత్రం మర్చిపోగలరు? ‘‘నాకు ఈ ఫీల్డ్ అస్సలే తెలియదు. ఉత్సాహం కొద్దీ కెమెరాతో పనిచేయడంలో ట్రెనింగ్ తీసుకుని ఉద్యోగంలో చేరిపోయాను. స్టూడియోలో అడుగుపెట్టిన తొలి క్షణాలు నాకు ఇప్పటికీ గుర్తే. హాలీవుడ్ సినిమా సెట్టింగ్‌కంటే తక్కువగా ఏమీ లేదనిపించింది’’ అంటారీ కేరళ కెమెరాఉమన్.

పది కిలోల బరువైన ఉద్యోగం

ఇరవై మూడేళ్ల అమ్మాయి, సన్నగా, నాజూగ్గా ఉన్న అమ్మాయి సుమారు పది కిలోల వీడియో కెమెరాతో కుస్తీ పడుతుంటే కొందరు ముచ్చటగా చూసేవాళ్లు. మరికొందరు జాలి చూపేవారు. ఆ కెమెరా బరువును తాము మోస్తూ ఆ అమ్మాయికి కొంచెం రిలీఫ్ ఇద్దాం అనుకున్న వాళ్లూ ఉండి ఉంటారు. రకరకాల సానుభూతులు వ్యక్తం అయ్యేవి. అయితే ‘షేమ్’ అన్న మాటను జయశ్రీ ఊహించలేదు. ఆ మాట విన్న రోజును మర్చిపోలేనంటారామె.

సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడిని ఇంటర్వ్యూ చేయాల్సిన అసైన్‌మెంట్ అది. జయశ్రీతో పాటు మరో అసిస్టెంట్ కూడా ఉన్నాడు. ఇంటర్వ్యూ ఇచ్చే పెద్దాయనకు ఓ పీఆర్‌వో కూడా ఉన్నాడు. పెద్దాయనకు సమయం ఎంతో విలువైనది. ఆ సమయంలో తమకు ఇంటర్వ్యూ ఇవ్వడానికి ఎప్పుడు వీలవుతుందో తెలుసుకోవాలి. అది తెలుసుకోవడానికే పీఆర్‌వో వెంట నడుస్తూ ఉన్నారు జయశ్రీ, ఆమె అసిస్టెంట్ కెమెరామన్. అతడితోపాటు లిఫ్ట్‌లో అడుగుపెట్టింది జయశ్రీ. ఆమె కెమెరా.. అసిస్టెంట్ కెమెరామన్ దగ్గరే ఉంది. అతడు లిఫ్ట్ బయటే ఉన్నాడు. అప్పుడు అడిగాడు పిఆర్‌వో.. కెమెరాపర్సన్ ఎవరు అని. నేనే అంది జయశ్రీ. ‘షేమ్’ అని అన్నాడతను! ఆ మాట ఆమెను బాణంలా తాకింది. షేమ్ అనడంతోపాటు మరోమాట కూడా అన్నాడా పిఆర్‌వో. ‘‘చూడండి మేడమ్! కెమెరాపర్సన్‌కి బిడ్డలాంటిది కెమెరా. ఒక సంగీతకారుడికి సంగీతవాద్యం బరువు కాకూడదు. అలాగే మీకు కెమెరా కూడా. ముందు మీరు కెమెరాను మీ బిడ్డను ప్రేమించినట్లు ప్రేమించండి. ఆ తర్వాత మాత్రమే దాంతో మీరు అద్భుతాలు చేయగలుగుతారు’’ అన్నాడాయన. ఆ మాటలు అప్పటికి జయశ్రీని షాక్‌కు గురి చేశాయి. కానీ అవే వేద వాక్యాలు అయ్యాయి ఆమెకు. ఆ క్షణం నుంచి ఆమెను డ్యూటీలో కెమెరా లేకుండా చూసిన వారు లేరు.

> **“చూడండి మేడమ్! కెమెరాపర్సన్‌కి బిడ్డలాంటిది కెమెరా. ఒక సంగీత కారుడికి సంగీతవాద్యం బరువు కాకూడదు. అలాగే మీకు కెమెరా కూడా. ముందు మీరు కెమెరాను మీ బిడ్డను ప్రేమించినట్లు ప్రేమించండి. ఆ తర్వాత మాత్రమే దాంతో మీరు అద్భుతాలు చేయగలుగుతారు” అన్నాడాయన.**

స్టాఫంతా సోదరిలా ఆదరించారు

ఇది మగవాళ్ల ప్రపంచం అనే అభిప్రాయం సహజమే. అప్పట్లో ఇన్నేసి టెలివిజన్ చానళ్లు లేవు, దూరదర్శన్ ఒక్కటే ఉండేది. ఎక్కడ ప్రోగ్రామ్ కవర్ చేయడానికి వెళ్లినా మగవాళ్లే ఉండేవారు. అలాగని మహిళ అయిన కారణంగా జయశ్రీపై ఎటువంటి వివక్షా ఉండేది కాదు. ఒక సోదరిలాగా ఆదరించేవారు. ‘‘ఆఫీస్‌లో అసైన్‌మెంట్‌లు వేయడంలోనూ మహిళ అయిన కారణంగా నాకు తక్కువ చేయలేదెప్పుడూ. కీలకమైన సంఘటనలు కూడా కవర్ చేశాను. 2004లో హిందూ మహాసముద్రంలో వచ్చిన సునామీని కవర్ చేశాను. నాగపట్టణమ్ వెళ్లి బాధితుల వ్యథలను షూట్ చేశాను. రాష్ట్రపతి భవన్ ముందు రాజ్‌పథ్‌లో రిపబ్లిక్ డే పెరేడ్‌లను కవర్ చేశాను. ఎర్రకోట బురుజు మీద ప్రధాని ప్రసంగాలనూ కవర్‌చేశాను. వాటితోపాటు మాజీ ప్రధాని వాజ్‌పేయి నుంచి ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ వరకు వారి ప్రత్యేకమైన ఈవెంట్స్‌ను షూట్ చేసే అవకాశం నాకు వచ్చింది’’ అంటారు జయశ్రీ.



కలామ్ ఇంటర్వ్యూను షూట్ చేస్తున్న జయశ్రీ

కష్టపడటంలోనే అందం ఉంది

‘‘మనం ఏ ప్రొఫెషన్‌లో అడుగుపెట్టినా సరే, ఆ ప్రొఫెషన్ మీద ప్రేమను పెంచుకోవాలి. అందులో మన వంతుగా నూటికి నూరు శాతం అవుట్‌పుట్ ఇవ్వాలి. అలా శ్రమించినప్పుడు అనేక అవాంతరాలు వాటికవే దూరమై పోతాయి. మహిళలు ఈ ఫీల్డ్‌లో పని చేయడం కష్టం అంటుంటారు. ఎండలో తిరగడం వల్ల చర్మం కమిలిపోతుందని, గ్లామర్ పోతుందని కూడా వింటుంటాను. నా మట్టుకు నేను నా ఉద్యోగంలో చెమట చిందే వరకు పని చేయడమే అసలైన గ్లామర్ అనుకుంటాను’’ అన్నారు జయశ్రీ.

- మంజీర

టెన్షన్ పెట్టరు.. టెన్షన్ పడనివ్వరు


ఉద్యోగంలో చేరిన కొద్ది నెలలకే పెళ్లి చేసుకున్నాను. నా ఉద్యోగం ఎలాంటిదో తెలుసుకునే నాతో జీవితం పంచుకున్నారు కాబట్టి నా భర్త నుంచి ఎటువంటి ఇబ్బంది రాలేదు. పైగా నేను డ్యూటీలో ఉన్నంత సేపు ఇంటి గురించి ఆందోళన పడాల్సిన అవసరం లేకుండా నాకు సపోర్ట్ ఇస్తున్నారు. నేను అవుటాఫ్ స్టేషన్ వెళ్లాల్సినప్పుడు మా అమ్మాయిలిద్దరి బాధ్యత ఆయనే చూసుకుంటారు.

- జయశ్రీ పూరి, సీనియర్ కెమెరాఉమన్



భర్త డి.కె.పూరితో...

వెరీ స్మార్ట్



ఇటువంటి చెడు కళ్లకు చెక్ పెట్టడానికే త్వరలో బెంగళూరు సిటీ రోడ్లకు ‘స్మార్ట్ ఐస్’ వస్తున్నాయి.

చూసే కళ్లుంటాయ్..! స్వేచ్ఛగా వెళ్లమంటాయ్

‘నిర్భయ’ నుంచి నిధులు: ఢిల్లీలో జరిగిన నిర్భయ ఉదంతం నేపథ్యంలో దేశంలోని ప్రధాన నగరాలన్నింటినీ ‘సేఫ్ సిటీ’ ప్లాన్‌లోకి తీసుకొచ్చారు. అందులో భాగంగానే ఈ బిబిఎమ్‌పి అధికారులు స్మార్ట్ ఐస్‌ను అమరుస్తున్నారు. ఇందుకోసం 667 కోట్ల నిర్భయ నిధులు మంజూరయ్యాయి.

అవే కళ్లు... నిఘా కళ్లు... డేగ చూపులకంటే తీక్షణమైన చూపులు. ఈ మాటలన్నీ విలన్‌ని సూచిస్తుంటాయి. రాబోయే ప్రమాదానికి ఉపోద్ఘాతంలా ఉంటాయి. కానీ ఇవన్నీ ఇక మహిళలకు ఫ్రెండ్లీ కళ్లు. ఆ చూపులు ఆడవాళ్లకు అన్నయ్యల్లాంటి చూపులు. ఆ చూపుల కింద ఆడవాళ్లు ధైర్యంగా నడిచి వెళ్లవచ్చు. అది అర్ధరాత్రయినా అపరాత్రయినా సరే! బెంగళూరు పోలీసు వ్యవస్థ చొరవతో రూపొందిన ‘చురుకైన కళ్ల’ ప్రోగ్రామ్ అది. పేరు.. ‘స్మార్ట్ ఐస్’

మహానగరంలో మహిళ

బెంగళూరు అనగానే టెక్నాలజీ హబ్ గుర్తొస్తుంది. హైదరాబాద్ నగరం ఐటి అడుగులు నేర్చుకునేటప్పటికే బెంగళూరులో సాఫ్ట్‌వేర్ రంగం వేళ్లూనుకున్నది. పొరుగు రాష్ట్రాల వలసలతో ఆ నగరం రోజు రోజుకీ విస్తరిస్తోంది. ప్రధానమైన రోడ్డు మీద ఎడమ నుంచి కుడివైపుకి వెళ్లాలంటే యు టర్న్ కోసం కిలోమీటర్లు ప్రయాణించాలి. అలాంటి మహానగరంలో మగవాళ్లతోపాటు మహిళలు కూడా అదే స్థాయిలో ఉద్యోగాలు చేస్తుంటారు. ఇరవై నాలుగ్గంటలూ షిఫ్టులుంటాయి. ఎవరి డ్యూటీ టైమ్‌కి వాళ్లు ఇళ్ల నుంచి బయలు దేరాలి. డ్యూటీ అయిపోయిన తర్వాత ఇళ్లకు చేరాలి. అలాంటి పరిస్థితుల్లో ఎలాంటి ఆపదలు, టీజింగ్‌లు ఎదురైనా సరే ఇట్టే పట్టేయడానికి వీలుగా టెక్నాలజీని అభివృద్ధి చేస్తోంది పాలన వ్యవస్థ. అర్ధరాత్రి అయినా సరే మిట్టమధ్యాహ్నమే అన్నంత ధైర్యంగా ఆడవాళ్లు సంచరించవచ్చు.

మాయగాళ్లపై నిఘా!


ఇప్పటికే ఉన్న ‘సురక్ష మిత్ర’ పథకంలో భాగంగా బెంగళూరు నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, ముఖ్యమైన హాస్పిటళ్లు, ఇతర పబ్లిక్ ప్రదేశాలు... అన్నీ కలుపుకుని మొత్తం 4,500 ప్రదేశాల్లో పదివేల నిఘా కెమెరాలను అమరుస్తోంది బిబిఎమ్‌పి (బృహత్ బెంగళూరు మహానగర పాలికె). జేబుదొంగలు, ఆకతాయిలు, రౌడీషీటర్‌లు, ట్రాఫికింగ్‌కు పాల్పడే కరడుగట్టిన నేరగాళ్ల నుంచి మహిళలకు రక్షణ కల్పించడానికి ఈ ‘స్మార్ట్ ఐస్’ ఆలోచన రూపుదాల్చింది. రోజులో 24 గంటలూ ఈ కళ్లు పని చేస్తూనే ఉంటాయి. వీటిని ‘ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సిస్టమ్’ పర్యవేక్షిస్తూ ఉంటుంది. ఉదాహరణకు నగరంలో ఒక వ్యక్తి రోజూ ఒక రోడ్డు మీద ప్రయాణిస్తూ, అదే వ్యక్తి ఒక్కరోజు ఊహించని మరోచోట సంచరించినట్లయితే ఆ ‘మార్పు’ కూడా వెంటనే రికార్డు అవుతుంటుంది. అవసరమైతే కెమెరా బ్యాకప్‌తో విశ్లేషించడానికి సాధ్యమవుతుంది. అలా నగరంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తి మీద మూడో కంటికి తెలియకుండానే పోలీస్ నిఘా మొదలవుతుంది.

– మను

మేకప్ వైప్స్

అంత మంచివేం కాదట

మేకప్‌ను తుడుచుకోవడానికి వాడే మేకప్ వైప్స్ వల్ల చర్మానికి ఎలాంటి మేలూ లేక పోగా, హాని ఎక్కువని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిని తరచుగా వాడితే, చర్మంపై సహజంగా ఉండే తేమ మాయమై చర్మం త్వరగా పొడిబారిపోతుందని, ముఖంపై త్వరగా ముడుతలు ఏర్పడతాయని బ్రిటన్‌కు చెందిన ఈస్తటీషియన్ జోవానా వర్గాస్ చెబుతున్నారు. చర్మంపై పేరుకు పోయిన మురికిని, మృతకణాలను ఈ వైప్స్ కొంతవరకు తొలగించగలిగినా, పూర్తిగా శుభ్రం చేయవట. చర్మ ఆరోగ్యానికి ఇబ్బంది లేకుండా మేకప్‌ను తొలగించుకోవాలనుకుంటే మేకప్ వైప్స్‌కు బదులుగా తేలికపాటి సబ్బు, చన్నీటితో శుభ్రం చేసుకోవడమే మేలంటున్నారు.



లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా...! నేను ఒక అమ్మాయిని ప్రాణంకంటే ఎక్కువగా ప్రేమించాను. తను కూడా నన్ను ఇష్ట పడింది. కానీ మా నేపథ్యాలు వేరు. నాకు తనంటే పిచ్చి. తనకి తన పేరెంట్స్ అంటే చాలా ఇష్టం. ''ముందు నువ్వు జాబ్ తెచ్చుకో.. ఇంట్లో ఒప్పిస్తాను'' అంది. ఇదంతా ఇంట్లో చెబితే, మా ఇంట్లో వాళ్లు చాలా భయపడుతున్నారు. నువ్వు ఆ అమ్మాయిని చేసుకుంటే మేం చచ్చిపోతాం అని బెదిరిస్తున్నారు. నాకు ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు. ఒకవైపు నా ఫ్యామిలీ కావాలి. మరోవైపు తనూ కావాలి అనిపిస్తోంది. ప్లీజ్ అన్నయ్యా.. నాకు సలహా ఇవ్వండి ప్లీజ్.

- రాజీవ్

ఉద్యోగం తెచ్చుకో రాజీవ్....
ఎక్కడైనా దూరంగా....
హ్యాపీగా ఉద్యోగం చేసుకుంటూ....
లైఫ్ ఎంజాయ్ చెయ్యి..
ఆ ఊరిలోనే...
అవే పరిసరాలలో ఉండీ.. ఉండీ....
బుర్ర బర్బాద్ అయిపోయింది.
గాలి తగలాలి....
మనసుకు... హృదయానికి....
రోజూ ఏవో ఆలోచనలతో పిచ్చెక్కి....
బాగా డౌన్ అయిపోయావు ఎమోషనల్‌గా...
కొంచెం టైమ్, ఆ పరిసరాల నుంచి దూరంగా ఉంటే...
మంచి నిర్ణయం తీసుకోగలుగుతావు రాజీవ్.

'అబ్బా ఎంత సింపుల్‌గా, క్లియర్‌గా చెప్పారు సార్ ఆన్సర్...
రోజూ ఇలాగే చెబితే ఎవరికీ తలనొప్పి ఉండదు కదా సార్????'

గుండె నొప్పి అలాగే ఉండిపోతుంది నీలూ...! నవ్వుతూ... నవ్విస్తూ... పరిష్కారం చెబితే... బాధ, కోపం, విస్మయం తగ్గి సంతోషం కలుగుతుందిరా బంగారం.

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.
లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
lovedoctorram@sakshi.com

సుడోకు

5			7			4		
		3	6	1		2		9
		7	2	4			8	1
1			9	5			3	
7				6				2
	5			2	1			8
9	1			7	2	3		
2		5		3	9	8		
		4			6			5

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

5	3	6	4	7	1	8	2	9
9	4	7	2	8	5	1	6	3
2	8	1	9	6	3	4	7	5
1	9	4	5	2	7	6	3	8
3	6	5	8	1	4	7	9	2
7	2	8	3	9	6	5	4	1
4	1	3	7	5	2	9	8	6
6	7	9	1	3	8	2	5	4
8	5	2	6	4	9	3	1	7

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్‌చేయ్...దాచేయ్...

పల్లవి:
ముద్దబంతి నవ్వులో మూగ బాసలు
మూసి ఉన్న రెప్పలపై ప్రేమలేఖలు (2)

చదువుకునే మనసుంటే ఓ కోయిలా (2)
మధుమాసమే అవుతుంది అన్ని వేళల ॥ ముద్దబంతి॥

చరణం : 1
బంధమంటు ఎరుగని బాటసారికి
అనుబంధమై వచ్చింది ఒక దేవత(2)
ఇంత చోటులోనే అంత మనసు ఉంచి
నా సొంతమే అయ్యింది ప్రియురాలిగా(2) ॥ముద్దబంతి॥

చరణం : 2
అందమైన తొలిరేయి స్వాగతానికి
మౌనగీతమై వచ్చింది పెళ్ళికూతురు
ఎదుటనైన పడలేని గడ్డిపువ్వును
గుడిలోనికి రమ్మంది ఈ దైవము
మాటనోచుకోని ఒక పేదరాలిని (2)
నీ గుండెలో నిలిపావు గృహలక్ష్మిగా
॥ముద్దబంతి॥ ॥చదువుకునే॥

రచన: 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి;
సంగీతం: కె.వి.మహదేవన్
గానం: కె.జె ఏసుదాస్, కె.యస్. చిత్ర
చిత్రం: అల్లుడు గారు

కట్‌చేయ్...దాచేయ్...



● ఆది పినిశెట్టి, రవిశంకర్, మోహన్, నవీన్, చిరంజీవి, రామ్‌చరణ్, సమంత, దేవిశ్రీప్రసాద్, సుకుమార్, చంద్రబోస్

ఆర్టిస్ట్‌గా ఈర్ష్య పడుతున్నాను... తండ్రిగా గర్వ పడుతున్నాను

-చిరంజీవి

''విశాఖకి వచ్చిన ప్రతీసారి ఆనందం, ఉద్వేగం అనిపిస్తుంది. విశాఖను చూస్తే నా సినిమాలు 'ఆరాధన, అభిలాష', 'బంగారు కోడిపెట్ట..' గుర్తుకొస్తాయి. మైత్రీ మూవీస్ మిత్ర త్రయానికి ధన్యవాదాలు. ముగ్గురి కో–ఆర్డినేషన్ చూస్తే ముచ్చటేస్తోంది. మంచి సినిమాలు తీయాలని తపిస్తుంటారు. సుకుమార్ అద్భుతమైన పనితనం చూపించాడు. ఎన్నో సినిమాలు వచ్చాయి పల్లెటూరి నేపథ్యంలో. ఇది చాలా ప్యూర్ సినిమా. సుకుమార్ ఎలా చెప్పాడో అలాగే తీశాడు. పల్లె మనస్తత్వాలను బాగా చిత్రీకరించాడు. స్టార్టింగ్ నుంచి ఎండ్‌వరకు ఎంజాయ్ చేశాను. ఇది చరణ్‌కు స్టార్ స్టేటస్‌ను పెంచి నటుడిగా ఇంకో మెట్టు ఎక్కించే సినిమా. ఆర్టిస్ట్‌గా ఈర్ష్య పడుతున్నాను.. తండ్రిగా గర్వ పడుతున్నాను'' అన్నారు నటుడు చిరంజీవి. రామ్‌చరణ్, సమంత జంటగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రంగస్థలం'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై. రవిశంకర్, మోహన్ చెరుకూరి నిర్మించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక వైజాగ్‌లో జరిగింది ఈ సందర్భంగా ''చిరంజీవి మాట్లాడుతూ – ''హీరోకి వినికిడి లోపం ఉంది అంటే ఫ్యాన్స్ ఎలా తీసుకుంటారో అని కంగారుపడ్డాం. అయితే చరణ్ ఫుల్‌గా ఎంటర్‌టైన్ చేశాడు. నవ్వించాడు, ఏడిపించాడు. ఒక డీ గ్లామరైజ్డ్ పాత్రలో శభాష్ అనిపించుకున్నాడు. సుకుమార్ ఈ సినిమాకి అగ్రతాంబులాం. కర్త, కర్మ క్రియ. దేవిశ్రీ ప్రసాద్ చాలా అద్భుతమైన బాణీలు ఇచ్చాడు. చంద్రబోస్ తెలంగాణ బిడ్డ అయ్యుండి ఈ సినిమాలో గోదారి గడ్డ మీదుండే పల్లె పదాలను అంత చక్కగా రాయడం మాములు విషయం కాదు. 'మీ పెన్నుకు నా వెన్ను' వంచి నమస్కరిస్తున్నాను. 'రోబో' చేసిన రత్నవేలేనా ఈ సినిమా చేసింది అనిపించింది. జూబ్లీ హిల్స్‌లో విలేజ్‌ను సృష్టించారు. గ్రేట్ ఆర్ట్ డైరెక్టర్స్ సెట్ వేస్తే అసలు సెట్ వేసినట్టు ఉండదు. ఆ వాతావరణాన్ని అలా క్రియేట్ చేసిన రామకృష్ణ గారిని అభినందిస్తున్నాను. సినిమా చూశాక స్పెల్‌బౌండ్ అయ్యాను. కొడుకును హగ్ చేసుకుంది సురేఖ. విలేజ్‌ను చూసింది లేదు. రాణిస్తాడా లేదా అనుకున్నాను కానీ చాలా చక్కగా చేశాడు. డెప్త్‌కి వెళ్లి చేశాడు. ఏడవకుండా ఏడిపించటం చాలా గ్రేట్. సమంత సమంతలా కనిపించలేదు. ఆమె హావభావాలు బాగా చూపించింది. ఈ సినిమాకు జాతీయ అవార్డులు రాకపోతే అన్యాయం జరిగినట్టే'' అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ – ''సినిమా రషెస్ చూసినవాళ్లు చెప్పిన మాటేంటంటే చరణ్ మునుపెన్నడూ చేయనంత అద్భుతంగా చేశాడని. దేవిశ్రీ ప్రసాద్ తన సంగీతంతో సినిమాను లిఫ్ట్ చేశాడు. సుకుమార్ ఎంత గొప్ప డైరెక్టర్ అంటే సినిమా చేస్తానంటే చాలు ఏ హీరో అయినా తనకు డేట్స్ ఇచ్చేస్తాడు. చిరంజీవిగారు వేసిన రహదారి మీదే ఇప్పుడున్న మెగా హీరోలంతా వెళ్తున్నారు. ఆయన పడ్డ కష్టమే ఇదంతా'' అన్నారు. ''చిన్నప్పటినుంచి విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సినిమా చేయాలనుకున్నాను. అది సుకుమార్ సినిమాతోనే నేరవేరటం హ్యాపీగా ఉంది'' అన్నారు దేవిశ్రీ ప్రసాద్. ''సుకుమార్‌గారు చాలా ప్రేమతో రాశారు రామలక్ష్మి క్యారెక్టర్. ఆయన గర్వపడేలా చేయాలని చాలా కష్టపడి చేశాను. చిరంజీవిగారికి 'స్వయంకృషి' సినిమా ఎలానో చరణ్‌కి 'రంగస్థలం' అలా అవుతుంది'' అన్నారు సమంత. సుకుమార్ మాట్లాడుతూ– ''చిరంజీవిగారు రాజకీయాల్లోకి వెళ్తుంటే దేవి ఓ మాట అన్నాడు. ముఖ్యమంత్రి పదవి కంటే మెగాస్టార్ పదవే పెద్దది కదా అని. అవును సార్.. ఎన్ని పదవులున్నా మెగాస్టార్ పదవి చాలా ప్రత్యేకం. చిరంజీవిగారు సినిమా చూసి ఇంటికి పిలిచారు. చిరంజీవిగారు అభినందించినప్పుడు పక్కన ఎవరూ లేరు. ఒకవేళ అది బయట చెబుదాం అంటే అబద్ధం అనుకుంటారేమో అని భయం. అంత గొప్పగా పొగిడారు. మంచి ప్రొడ్యూసర్స్ దొరికారు. ఖర్చు దగ్గర అస్సలు వెనకాడరు. ఒకవేళ నేను గుడ్ డైరెక్టర్ అని ఎవరైనా అంటే ఆ గుడ్ రత్నవేలు గారు. నేను సినిమా చేయాలంటే కథ అవసరం లేదు, దేవి ఉంటే చాలు. మూడున్నర రోజుల్లో పాటలన్నీ కంప్లీట్ చేశాం. చంద్రబోస్‌గారు పాటలు ఎలా రాశారంటే ఒక కవి ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు ఎలాంటి పదాలు వస్తాయో అలాంటి పదాలు వాడారు. సమంతను లైఫ్ లాంగ్ డైరెక్ట్ చేయాలనుంది. అంత గొప్ప నటి. ఆర్ట్ డైరెక్టర్స్‌కు అవార్డు క్రియేట్ చేసి ఇవ్వాలని ఉంది. ఆది క్యారెక్టర్‌లో ఒదిగిపోయాడు. చరణ్ చాలా తొందరగా క్యారెక్టర్‌లోకి వెళ్లిపోయాడు. చరణ్ ఫస్ట్ డే టేక్ చేయగానే చప్పట్లు కొట్టాం'' అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ – ''ప్రొడ్యూసర్స్ ఎలాంటి ఇబ్బంది లేకుండా సినిమాను డీల్ చేశారు. విజువల్స్‌ను రత్నవేలు తెరమీద అందంగా చూపించారు. ఊరిని బాగా పరిచయం చేసిన సుక్కుకి థ్యాంక్స్. షూటింగ్ చేసిన తర్వాత ఎందుకు సిటీలో ఉంటున్నామా? అనిపించింది. సిటీలో మనం కొంచెం కలుషితం అయిపోయాం. కానీ అక్కడి మనుషులు చాలా ప్యూర్‌గా ఉంటారు. గోదావరి నీళ్ల చాలా తియ్యగా ఉంటాయి. ఆది నిజంగా నాకు అన్నయలాగానే ఉన్నాడు. ఒక మంచి కో–ఆర్టిస్ట్ దొరికితే ఎంత బాగా చేయొచ్చో సమంత వల్ల తెలిసింది. దేవిశ్రీ ప్రసాద్ అద్భుతమైన పాటలు ఇస్తే, చంద్రబోస్ గారు అద్భుతంగా రాశారు. సుక్కు ఒక కొత్త చరణ్‌ని నాకు పరిచయం చేశారు. ఆ చరణ్ మీద నాకు రెస్పెక్ట్ పెరిగింది. మార్చి 30 తర్వాత సుకుమార్‌ని చూడనా అని బెంగ పట్టుకుంది. అమ్మానాన్న, ఫ్యాన్స్ గర్వపడే ఒక సినిమా ఇచ్చినందుకు చాలా థ్యాంక్స్'' అన్నారు. నిర్మాత నవీన్ మాట్లాడుతూ – ''చిరంజీవి గారికి థ్యాంక్స్. చరణ్‌గారి విశ్వ రూపం చూస్తారు. సమంత అద్భుతంగా చేశారు. దేవిశ్రీ, సుకుమార్ టీమ్ అందరికీ థ్యాంక్స్'' అన్నారు. ఈ వేడుకలో ఉపాసన, పూజా హెగ్డే, ఆది, చంద్రబోస్, అనసూయ, రామకృష్ణ, మోనికా, రామ్–లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్ హార్డ్... సక్సెస్ విల్ ఫాలో

"కొత్త దర్శకులతోనే సినిమాలు చేయాలని అనుకోలేదు. స్క్రిప్ట్‌లో జెన్యూనిటీ కనిపిస్తే న్యూ డైరెక్టరా? ఎస్టాబ్లిష్డ్ డైరెక్టరా? అని ఆలోచించను. సినిమా చేసేస్తాను" అన్నారు కల్యాణ్ రామ్. నూతన దర్శకుడు ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో కల్యాణ్ రామ్, కాజల్ అగర్వాల్ జంటగా రూపొందిన చిత్రం 'ఎం.ఎల్.ఎ'. బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్.ఎల్.పి, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్స్ పై భరత్ చౌదరి, కిరణ్ రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం మార్చి 23న విడుదల కానుంది ఈ సందర్భంగా కల్యాణ్ రామ్ చెప్పిన విశేషాలు.

■ పోలింగ్ (సినిమా విడుదలను ఉద్దేశించి) దగ్గర పడింది. ఈ పోలింగ్‌లో విశేషమేంటంటే రిజల్ట్ కూడా అదే రోజు వచ్చేస్తుంది. సినిమా టైటిల్‌లోనే హీరో క్యారెక్టరైజేషన్ ఉంటుంది.


■ సినిమా పొలిటికల్ డ్రామానే బట్ పూర్తిగా పాలిటిక్స్ గురించి మాట్లాడం. లవ్ స్టోరీతో బిగిన్ అయి సెకండ్ హాఫ్ పాలిటిక్స్ వైపు మళ్లుతుంది. కార్పొరేట్ ఎడ్యుకేషన్ గురించి కూడా డిస్కస్ చేశాం. ■ ఉపేంద్ర మాధవ్ రైటర్ అవ్వటం వల్ల సినిమాలో డైలాగ్స్ చాలా బాగా వచ్చాయి. సినిమాలో నా డైలాగ్ డిక్షన్ చాలా కొత్తగా ఉంటుంది. ఈ విషయంలో ఉపేంద్ర చాలా పర్టికులర్‌గా ఉన్నాడు.

■ 'ఏంటి ఇంత చెత్త సినిమా చేశాడు' అనే రివ్యూ అయితే ఇప్పటి వరకు రాలేదు. నా గురించి ఏమైనా బ్యాడ్ రివ్యూలు వస్తే వాటిని అన లైజ్ చేసుకొని వర్కౌట్ చేస్తాను. మై ఫ్యామిలీ ఈజ్ మై బిగ్గెస్ట్ క్రిటిక్. 'వర్క్ హార్డ్.. సక్సెస్ విల్ ఫాలో' అనే ఫిలాసఫీని నమ్ముతాను. సక్సెస్ కోసం పరిగెత్తినా కొన్ని సార్లు రాకపోవచ్చు. మనం ఏం చేసినా మనకు సంతృప్తిగా అనిపించాలి. ■ సాయిధరమ్ తేజ్, నేను ఓ మల్టీస్టారర్ చేద్దాం అనుకున్నాం. బట్ స్క్రిప్ట్ కుదరక ఆ ప్రాజెక్ట్ ఆగిపోయింది. స్క్రిప్ట్ నచ్చితే ఎవరితో అయినా మల్టీస్టారర్ సినిమాలు చేస్తాను. ఈ జులైలో ఒక మల్టీస్టారర్ సినిమా అనౌన్స్ చేయనున్నాం. ■ ప్రొడ్యూసర్‌గా నేనెప్పుడూ హ్యాపీనే. 'ఈ సినిమా ఎందుకు చేశాను' అని ప్రొడ్యూసర్‌గా ఎప్పూడు అనుకోలేదు. ఏంటి ఇంత తలనొప్పి సినిమా చేశాడు? అని ఆడియన్స్ కూడా అనుకోకూడదు. బయట ప్రొడక్షన్స్‌తో చేసేటప్పుడు అనుకున్న బడ్జెట్‌లోనే పూర్తి చేయాలని చూస్తాను.

■ తారక్, నేను ఎక్కువగా సినిమాల గురించే మాట్లాడుకుంటాం.'ఎం.ఎల్.ఎ' ట్రైలర్ చూసి చాలా డిఫరెంట్‌గా ఉన్నావు, చాలా కాన్ఫిడెంట్‌గా కూడా కనిపిస్తున్నావు' అన్నాడు. మా డిస్కషన్‌లో పాలిటిక్స్ రాదు. ఎక్కువగా కార్లు, గాడ్జెట్స్ గురించి డిస్కస్ చేస్తాం.

■ ఈ సినిమాలో ఎం.ఎల్.ఏ పలికిన సంభాషణలు కానీ టైటిల్ కానీ నా ఫ్యూచర్ పాలిటిక్స్ గురించి ఏమీ ఇండికేషన్ ఇస్తున్నట్లు కాదు. ఇది సినిమాలో నా క్యారెక్టర్ మాత్రమే. రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదు.

■ నెక్ట్స్ 'నా నువ్వే' సినిమా చేస్తున్నాను. ఫుల్ లెంగ్త్ లవ్ స్టోరీ ఫస్ట్ టైమ్ చేస్తున్నాను.



● కల్యాణ్ రామ్

నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా 'ఉయ్యాల జంపాల, మజ్ను' చిత్రాల ఫేమ్ విరించి వర్మ దర్శకత్వంలో ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ పతాకంపై 'జెమినీ' కిరణ్ నిర్మించనున్న సినిమాను ఆదివారం ఉగాది రోజున అధికారికంగా ప్రకటించారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది. " చక్కని కుటంబ నేపథ్యం ఉన్న చిత్రమిది. ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం" అన్నారు నిర్మాత.



● అఖిల్

హలో.. నెక్ట్స్ మూవీ ఫిక్స్

హలో! అఖిల్ నెక్ట్స్ సినిమా ఏంటి? ఎవరితో? ఎప్పుడు? అన్న ప్రశ్నలకు ఈ ఆదివారం ఉగాది రోజున సమాధానం దొరికింది. యస్.. అఖిల్ తర్వాతి చిత్రం ఖరారైంది. 'తొలిప్రేమ' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో అఖిల్ హీరోగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించనున్నారు. మేలో చిత్రీకరణ మొదలవుతుంది. ''నా తర్వాతి చిత్రం గురించి ప్రకటిస్తున్నందుకు ఆనందంగా ఉంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్ అండ్ బాపినీడు నిర్మించనున్నారు. హ్యావ్ ఎ లవ్లీ సండే'' అన్నారు అఖిల్. ''మూవీ లవర్స్‌కి ఉగాది సర్‌ప్రైజ్ ఇది. త్వరలో ఈ సినిమా మరిన్ని వివరాలను వెల్లడిస్తాం'' అన్నారు నిర్మాతలు. ''అందరికీ ఉగాది శుభాకాంక్షలు'' అన్నారు వెంకీ అట్లూరి.

ఛల్.. పాటలన్నీ వచ్చేశాయ్



● నితిన్, మేఘా ఆకాశ్

'మీ పేరేటండి?' అంటూ హీరోయిన్ మేఘా ఆకాశ్‌ను ఎంక్వైరీ చేస్తూ తొలి గీతాన్ని వదిలాడు ఛల్ మోహన్ రంగడు. ఆ తర్వాత 10 రోజులకు 'వారం కాని వారం పేరు యవ్వారం..' అంటూ మరో సాంగ్‌ను రిలీజ్ చేశాడు. నెక్ట్స్ రిలీజైన 'పెద్దపులి..' సాంగ్‌తో అమాంతం రెచ్చిపోయాడు మోహనరంగడు. ఉగాది రోజున ఏకంగా ఆల్ సాంగ్స్ జ్యూక్ బాక్స్‌ను ఆన్‌లైన్‌లో వదిలేసి, సంగీతప్రియులకు ఆనందాన్ని పంచాడు. నితిన్ హీరోగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో శ్రీమతి నిఖితా రెడ్డి సమర్పణలో పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, శ్రేష్ఠ్ మూవీస్ బ్యానర్స్‌పై ఎన్. సుధాకర్‌రెడ్డి నిర్మించిన సినిమా 'ఛల్ మోహన్ రంగ'. ఇందులో మేఘా ఆకాశ్ కథానాయిక. ''ఆల్బమ్‌లోని ప్రతి సాంగ్‌ను కొత్తగా ట్యూన్ చేశారు తమన్. అమెరికా, ఊటీ, హైదరాబాద్ ఇలా ఎన్నో అందమైన ప్రదేశాల్లో చిత్రీకరించాం. సుబ్రమణ్యాన్ మంచి విజువల్స్ అందించారు. సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుందన్న నమ్మకం ఉంది. ఏప్రిల్ 5న చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు చిత్రబృందం.

నన్ను మాత్రమే ప్రేమిస్తే సరిపోదు!

మంచి వాడై , హ్యాండ్‌సమ్‌గా ఉండాలి. నవ్వుతూ, నవ్విస్తుండాలి. వంట వచ్చి ఉండాలి... ఇలా తమ కలల రాకుమారుడికి ఉండాల్సిన లక్షణాల గురించి అమ్మాయిలు ఆలోచిస్తూ ఉంటారు. అలాగే బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ కూడా తన బాయ్‌ఫ్రెండ్‌కు ఉండాల్సిన ఓ మేజర్ లక్షణం గురించి చెప్పారు. అదేమిటంటే.. తన బాయ్‌ఫ్రెండ్ కచ్చితంగా దేశభక్తుడై ఉండాలట. ''నా దేశాన్ని నేనెంతగానో ప్రేమిస్తాను. ఒకవేళ నేను ప్రేమించే వ్యక్తి దేశభక్తుడు కాదని తెలిస్తే అతనికి బ్రేకప్ చెప్పేస్తా. కన్నభూమి పై అభిమానం లేనివాడు, నాతో విశ్వాసంగా ఉంటాడన్న నమ్మకం నాకు లేదు. నన్ను మాత్రమే ప్రేమిస్తే సరిపోదు. దేశాన్ని కూడా ప్రేమించాలి'' అని చెప్పుకొచ్చారు కంగనా. అదండీ మేటర్. కంగనాకి ప్రపోజ్ చేయాలంటే దేశం మీద భక్తి ఉండాలి. సినిమాల సంగతి కొస్తే వీరనారి ఝాన్సీ లక్ష్మీభాయ్ జీవితకథ ఆధారంగా క్రిష్ దర్శకత్వంలో 'మణికర్ణిక: ది క్వీన్ ఆఫ్ ఝాన్సీ', ప్రకాశ్ కొవెలమూడి దర్శకత్వంలో 'మెంటల్ హై క్యా' చిత్రాలతో బిజీగా ఉన్నారు కంగనా.



● కంగనా రనౌత్

పరి పరిశోధన

ప్లాస్టిక్ రీసైక్లింగ్‌తో నీటి కాలుష్యానికి చెక్!



రోజువారీ వ్యవహారాల్లో ప్లాస్టిక్ ఎంత ఉపయోగకరమైందో మనకు తెలియంది కాదు. అదే సమయంలో దీంతో కాలుష్యమూ ఎక్కువే. ఇకపై మాత్రం ఈ పరిస్థితిని మార్చేస్తామంటున్నారు బ్రిస్టల్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. భూమిని కలుషితం చేస్తున్న ప్లాస్టిక్‌తో నీటిలోని కాలుష్యాన్ని తొలగించేందుకు వీరు ఓ వినూత్న టెక్నాలజీని అభివృద్ధి చేశారు. వస్త్ర పరిశ్రమలో వాడే కృత్రిమ రంగులు కలిసి నీరు కాస్తా విషమవుతున్న విషయం తెలిసిందే. అయితే పాలిస్టైరీన్ అనే ప్లాస్టిక్‌తో తాము ఒక కొత్త పదార్థాన్ని తయారు చేశామని... ఇది కాస్తా నీటిలో కలిసిపోయిన నానోస్థాయిలోని కృత్రిమ రంగులనూ తొలగించగలదని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ప్రొఫెసర్ జూలియన్ ఎస్టోయి అంటున్నారు. పాలిస్టైరీన్‌ను సైక్లోహెక్సేన్‌తో కలిపి ఉష్ణోగ్రతలను ఆరు డిగ్రీల స్థాయికి తగ్గించడం ద్వారా కొత్త పదార్థం తయారీ ప్రక్రియ మొదలవుతుంది. ఆ తరువాత సైక్లోహెక్సేన్‌ను తొలగిస్తే ప్లాస్టిక్ గణనీయంగా ఉబ్బిపోతోంది. ఈ దశలో దానిపై నానోస్థాయి పూత పూస్తే అది నీటిలోని కృత్రిమ రంగుల తాలూకు కణాలను ఆకర్శించి తనలో నిక్షిప్తం చేసుకుంటుందని జూలియన్ వివరించారు. మహా సముద్రాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ చెత్తను మరింత సమర్థంగా వాడుకునేందుకు ఈ పద్ధతి ఉపయోగపడుతుందని జూలియన్ అంచనా.


మేధ వెనుక 500లకు పైగా జన్యువులు!



మనిషి మేధకు.. మనలోని దాదాపు 500 జన్యువులు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు తొలిసారి గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2.40 లక్షల మంది డీఎన్ఏలను అధ్యయనం చేయడం ద్వారా తాము ఈ అంచనాకు వచ్చామని అంటున్నారు శాస్త్రవేత్తలు. ఎడిన్‌బరో, సౌతాంప్టన్, హార్వర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సంయుక్తంగా జరిపిన అధ్యయనం ద్వారా ఈ విషయం తెలిసింది. మానవ జన్యుక్రమంలోని దాదాపు 187 ప్రాంతాలు ఆలోచన నైపుణ్యానికి కారణమవుతున్నాయని, 538 జన్యువులు వేర్వేరు మార్గాల్లో మనిషి తెలివిని ప్రభావితం చేస్తున్నాయని వీరు చెప్పారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. మేధకు సంబంధించిన కొన్ని జన్యువులతో దీర్ఘాయుష్షుకూ సంబంధం ఉండటం! ఇంకేముంది... ఇంకొన్నేళ్లలో ఈ జన్యువులన్నింటినీ ప్రభావితం చేయడం ద్వారా అపరమేధావులను తయార చేసేద్దామని అనుకుంటున్నారా? అది ఇప్పట్లో సాధ్యమయ్యే పని కాదు. ఎందుకంటే కేవలం జన్యుక్రమం ద్వారానే మనిషికి మేధను సమకూర్చడం చాలా కష్టమని ఈ అధ్యయనంలో పాల్గొన్న శాస్త్రవేత్త డేవిడ్ హిల్ అంటున్నారు. జన్యువులతోపాటు వాతావరణ పరిస్థితులు కూడా మేధను ప్రభావితం చేస్తుండటం దీనికి కారణం. అందుకే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, బుర్రకు పదును పెట్టే పరిస్థితుల్లో పెరిగే వారితో పోలిస్తే, ఇవేవీ లేని పరిస్థితుల్లో పెరిగిన పిల్లలు తక్కువ మేధ కలిగి ఉంటారని ఆయన వివరించారు.

"మొదటి" ప్లేస్‌లో చాలామంది ఉంటారు!
ఏకైక అనేది అతికొద్దిమందికే దక్కుతుంది!
ఇది అరుదైన అవకాశం.. ప్రత్యేకమైన స్థానం!
ఇది దక్కించుకున్న మహిళ డాక్టర్ సీమారావు..
ఆ అర్హత ఆమెకు ఆషామాషీగా రాలేదు.
వీరగాథలు విన్నది.. వీరోచిత పోరాటాలు చేసింది..
సైన్యానికి యుద్ధ విద్యలను నేర్పుతోంది!
ఫస్ట్ అండ్ ఓన్లీ ఫీమేల్ కమాండో ట్రైనర్‌గా
భారత సాయుధ దళాలు ఆమెకు సెల్యూట్ చేస్తున్నాయి!!

లేడీ కమాండో


డాక్టర్ సీమారావు

''నాన్న పోయారు'' ఇంటి నుంచి ఫోన్. ఆ ఫోన్‌కాల్ ఇచ్చిన షాక్ నుంచి తేరుకున్నాక మనసులో పొగిలి పొగిలి ఏడ్వడం తప్ప ఆమె ఉన్న పళంగా బయలుదేరి తండ్రి చివరి చూపుకు నోచుకోలేదు. కారణం.. అప్పుడామె తన సొంతూరుకి వందల కిలోమీటర్ల దూరంలో.. కాలి నడకే దుస్సహాసమైన పర్వతసానువుల్లో ఉంది.

• ❖ •

''అమ్... మా...'' నరాలు తెగిపోతున్న బాధను పంటి వరకు పరిమితం చేసి గొంతు నొక్కేసి పెదవులు బిగించేసింది.

''ఓర్చుకో...''ఫస్ట్ ఎయిడ్ చేస్తూ చెప్పాడు భర్త.

''ఉమ్...'' కేకగా బయటకు రాని నొప్పి నీళ్లుగా కళ్లలోంచి జారుతుండగా కళ్లను గట్టిగా మూసుకుంటూ అంది.

''ఇవన్నీ నీకు కొత్తకాదు కదా..'' భార్య భుజం తడుతూ అన్నాడు. ఆ సున్నితమైన ఆత్మీయ స్పర్శను కూడా భరించే స్థితిలో లేదామె. అర్థమైన వాడల్లే వెంటనే భుజమ్మీద నుంచి చేయి తీసేసాడు భర్త.

''దీపక్.. మనకు పిల్లలు వద్దు'' అన్నది. భర్తలో ఆశ్చర్యం, ఆవేశం ఏమీ లేదు. ఎందుకు అన్న ప్రశ్న కూడా లేదు. ఎందుకంటే అతనికి తెలుసు అది ఆమె స్థిర నిర్ణయం అని.

• ❖ •

''అమ్మాయి పుట్టిందని చెత్తకుప్పలో పడేసిన తండ్రి''... ''గర్భంలో ఉన్నది ఆడపిల్ల తెలిసి అబార్షన్ చేయించుకొమ్మని అత్తింటివారి బలవంతం''... ''పుట్టిన అమ్మాయిని పురిట్లోనే చంపేసిన కసాయి తండ్రి''.. వార్తా పత్రికల్లో ఒకే రోజు వచ్చిన ఆ వార్తలకు చలించిపోయింది ఆమె.

''మనం ఓ ఆడపిల్లను దత్తత తీసుకుందాం'' చెప్పింది భర్తతో.

ఈసారి మారుమాట లేకుండా ఆనందంగా ఒప్పుకున్నాడు భర్త.

ఆమే సీమా రావు. భారతదేశపు మొట్టమొదటి, ఏకైక మహిళా కమెండో శిక్షకురాలు. పైన చెప్పిన సంఘటనలన్నీ సీమా ఎంచుకున్న రంగం వల్ల ఆమెకు ఎదురైన అనుభవాలు, కోల్పోయిన అవకాశాలు!

అయినా కర్తవ్యమే మిన్న అంటారు సీమా. తల్లి కావాలని ఏ స్త్రీ కలకనదు? ఆశ పడదు? కాని కమెండో ట్రైనర్‌గా తన శరీర కష్టం ఎలాంటిదో తెలుసు.. ఎన్నో సార్లు ఆమె మీద దాడులు జరిగాయి. ఆమే ఎదురు దాడి చేసింది. వెన్నుముక విరిగింది. తలకూ తీవ్రగాయలై కొన్ని నెలలపాటు జ్ఞాపకశక్తిని కోల్పోయి తనను తానే మరిచిపోయింది. ఇవన్నీ అనుభవించాకే నిశ్చయించుకుంది అమ్మతనం వద్దని. చేస్తున్న పనిపట్ల అంత నిబద్ధత.. అంకిత భావం.

వారసత్వంలోనే ఉంది..

సీమ తత్వంలో ఉన్న పోరాటపటిమ ఆమెకు వారసత్వంగా వచ్చిందే. ఆమె తండ్రి ప్రొఫెసర్ రమాకాంత్ సినరి స్వాతంత్ర్య సమరయోధుడు. పోర్చుగీస్ ఆక్రమణలో ఉన్న గోవా విముక్తి కోసం పోరాడిన వీరుడు. సీమా చిన్నప్పుడు ఆ వీరోచిత పోరాట సంఘటనలనే కథలుగా చెప్పేవాడు కూతురికి. తర్వాత ఆమె ఎంచుకున్న కెరీర్‌కు అవే స్ఫూర్తి. దేశం కోసం ఏదైనా చేయాలి... సైనికురాలిగా దేశాన్ని కాపాడాలి అనే తపనతోనే పెరిగారు సీమ.

చానెల్..

సీమ శక్తికి, యుక్తికి సరైన చానల్ ఆమె పదహారవ యేట దొరికింది. దీపక్ రావు పరిచయం అయ్యాడు. అప్పటికే ఆయన మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్‌గా ఉన్నాడు. ఆయన దగ్గర శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టారు ఆమే. అలా దీపక్‌రావుతో పరిచయం, ఆయన దగ్గర శిక్షణ... ఇద్దరూ కలిసి జీవితంలోనూ ప్రయాణించే పరిణయంగా మారింది. పెళ్లి చేసుకున్నారు. తర్వాత ఇద్దరూ కలిసి మిలిటరీ మార్షల్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టారు. ఓవైపు మెడిసిన్ చదువుతూనే ఇంకో వైపు షూటింగ్, వెపన్ డిఫెన్స్‌లలో ట్రెనింగ్ తీసుకోసాగారు. డాక్టర్ అయ్యాక సీమా క్రైసిస్ మేనేజ్‌మెంట్‌లో ఏంబీఏ కూడా చేశారు. అయినా ఏదో అసంతృప్తి. చిన్నప్పటి నుంచి తను కలగన్నది వేరు. లక్ష్యం వేరు. అది సాధించాలి. దేశానికి సేవ చేసే అవకాశం పొందాలి అని ఆలోచించి చివరకు దేశ సాయుధ దళ సైనికులకు శిక్షణనివ్వాలని నిర్ణయించుకున్నారు. వెంటనే 1996లో ఆర్మీ, నావీ, బీఎస్ఎఫ్, ఎన్ఎస్జీ ప్రధాన సైనికాధికారులను కలిశారు. తమ ఆశయం గురించి వివరించారు. సీమా దంపతుల అంకిత భావం, నిబద్ధత చూసి సైనికాధికారులు చలించారు. అవకాశమిచ్చారు. అంతే మళ్లీ వెనక్కి తిరిగి చూడలేదు సీమా. ఎన్ని అవరోధాలు ఎదరైనా. 22 ఏళ్లుగా పైసా ప్రతిఫలం ఆశించకుండా ఫుల్‌టైమ్ ట్రెనర్‌గా ఉన్నారు ఆమే, ఆమె భర్త మేజర్ దీపక్‌రావు కూడా. ప్రత్యక్ష యుద్ధంలో ప్రతిపక్ష సైనికులను ఎదుర్కొనే విద్యనూ నేర్పిస్తున్నారు.


● ట్రైనీలకు శిక్షణ ఇస్తూ...


● సైనికులకు యుద్ధ విద్యలు నేర్పిస్తూ...

కమెండోలకు ట్రైనింగ్..

సైనికబలగాల్లోని ఎన్ఎస్జీ బ్లాక్ క్యాట్స్, పారా కమాండోస్, మార్కోస్, గరుడ్, బీఎస్ఎఫ్ కమాండోస్‌కు ట్రెనింగ్ ఇస్తున్నారు సీమా. అయితే మొదట్లో.. ఒక మహిళ దగ్గర మేము శిక్షణ పొందడమేంటీ అన్నట్లుగా తిరస్కార ధోరణితో ఉండేవాళ్లట జవాన్లంతా. అయినా స్థయిర్యం కోల్పోకుండా అదే క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగారు సీమా. చివరకు ఆమెను అనుసరించక తప్పలేదు జవాన్లకు. పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ రంగంలో అడుగడుగునా తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటునే ఉన్నారు. ఇప్పటికీ ప్రతీ కొత్త బ్యాచ్‌లోని జవాన్లు మహిళ అయిన సీమా దగ్గర శిక్షణ పొందడానికి మొదట్లో ఇబ్బంది పడ్తూనే ఉన్నారు. లెక్క చేయకుండా ముందుకు వెళ్తూనే ఉన్నారు సీమా. ఆమె ఇచ్చే శిక్షణలోని మెళకువలు, నైపుణ్యం చూసి ఆ సేవలను నేషనల్ పోలీస్ అకాడమీ, ది ఆర్మీ ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ అందుకుంటోంది. 2009లో గరుడ కమాండోస్‌కు శిక్షణ తర్వాత ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పారా జంప్ కోర్స్ శిక్షణ ఇవ్వడం కోసం ఆమెను ఆహ్వానించారు. ఇదీ ఆమె అందుకున్న అరుదైన గౌరవం, అరుదైన విజయం కూడా!

పదిమందిలో ఒకరు..

షూటింగ్.. ఆమె బలం. మార్షల్ ఆర్ట్స్ ఆమె స్టయిల్. బ్రూస్లీ కనిపెట్టిన జీట్ కూన్ డోలో ఎక్స్‌పర్ట్. ఈ విద్యలో ప్రపంచ వ్యాప్తంగా కేవలం పది మంది మహిళలు మాత్రమే నిష్ణాతులు. అందులో సీమారావు ఒకరు. 20 ఏళ్లకు పైగా భారత సైన్యంలో తాను అందిస్తున్న సేవలకు గాను 2011లో ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాస్ ర్యాంక్ అవార్డ్‌ను పొందారు. తన భర్తతో కలిసి నాలుగు సార్లు ఆర్మీ చీఫ్ సైటేషన్స్ అందుకున్నారు. ఇది రికార్డ్. సీమా దంపతులు అనార్మ్‌డ్ కమాండో కంబాట్ అకాడమీ (యూసీసీఏ), యాన్ ఎలీట్ మిలిటరీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీని స్థాపించారు. ఈ అకాడమీలో జీట్ కూన్ డో తోపాటు ఇతర మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తారు. ట్రెనింగ్ మీద సైనికుల కోసం పుస్తకాలు రాస్తున్నారు, ప్రచురిస్తున్నారు. మామూలు పౌరుల కోసమూ అనార్మ్‌డ్ కాంబాట్ బ్లాక్‌బెల్ట్ ప్రోగామ్‌ను నిర్వహిస్తున్నారు.

డేర్..

మహిళల రక్షణకోసమూ నడుం బిగించారు సీమా. వేధింపులు, లైంగిక దాడులను స్త్రీలు ఎదుర్కొనేలా DARE (డిఫెన్స్ ఎగైనెస్ట్ రేప్ అండ్ ఈవ్ టీజింగ్) అనే ట్రెనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. మానసికంగా, శారిరకంగా మహిళలను దృఢంగా తయారు చేయడమే ఈ ప్రోగ్రామ్ ధ్యేయం. అంతేకాదు దేశంలోనే మొదటి మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ మీద "Hathapayi' అనే సినిమా నిర్మించి అందులో సీమా నటించారు కూడా. ఈ సినిమాలో తొలిసారిగా జీట్ కూన్ డోను చూపించారు. ఈ చిత్రం దాదాసాహెబ్ ఫాల్కే జ్యూరీ ప్రత్యేక ప్రశంసలను పొందింది.

ఆమె ఓ శక్తి..

ఇప్పటి వరకు దాదాపు పదిహేను వేల మంది సైనికులకు శిక్షణనిచ్చిన సీమారావు 47 దేశవిదేశాల సన్మానపురస్కారాలతోపాటు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన వరల్డ్ పీస్ అవార్డ్, ప్రెసిడెంట్స్ వలంటీర్ సర్వీస్ అవార్డ్‌లనూ అందుకున్నారు. ''భారత సైనికులకు శిక్షణనివ్వడంలో ఉన్న ఆత్మసంతృప్తే నాకు అన్నిటికన్నా గొప్ప అవార్డ్'' అంటారు సీమారావు వినమ్రంగా. సామాన్యులూ అసాధారణ పనులు చెయ్యొచ్చు అని నిరూపించిన ఈ స్త్రీ శక్తికి సలాం! •

ఈ వారం YouTube హిట్స్

మేథీ కా లడ్డూ - షార్ట్‌ఫిల్మ్



నిడివి: 8 ని. 04 సె. ::: హిట్స్: 1,79,519

ఇది ఒక తల్లి ఇద్దరు కూతుళ్ల మధ్య ఒక మధ్యాహ్నం పూట వంట జరుగుతుండగా నడిచే చిన్న కథ. తల్లిని చూడటానికి ఇద్దరు కూతుళ్లు వచ్చి ఉంటారు. తల్లి లడ్డూలు చేస్తూ ఉంటుంది. అవి తన కోసం చేస్తున్న లడ్డూలు అని పెద్ద కూతురు భావిస్తుంది. కాని ఆ లడ్డూలు చిన్న కూతురి కోసమనీ– కడుపుతో ఉన్న ఆ కూతురి బొజ్జలో ఉన్న బుజ్జిపాపాయి కోసమని తల్లి చెబుతుంది. పెళ్లయి ఏడేళ్లయినా పిల్లలు పుట్టని పెద్ద కూతురు నొచ్చుకుంటుంది. సాధారణంగా మధ్యతరగతి ఇళ్లలో దేవుణ్ణి నమ్ముకోవడమే ముఖ్యంగా ఉంటుంది గానీ... సైన్సును నమ్ముకోవడం జరగదు. కాని తల్లి నెమ్మదిగా మాటలు కదిలేసి కృత్రిమ పద్ధతి ద్వారా బిడ్డలను కనడం తప్పు కాదని భార్యాభర్తలు ఇద్దరూ కలిసి టెస్ట్‌ట్యూబ్ బేబీ కోసం ట్రై చేయమని చెప్పి ఒప్పిస్తుంది. ఇదంతా వంటగదిలో ఒక అందమైన సంభాషణ రూపంలో సాగుతుంది. ఈ సంభాషణలో తల్లి ఎప్పుడూ పిల్లల పక్షమే అనే అభిప్రాయం మరో మారు రూఢీ అవుతుంది. జరీనా వహాబ్, ఆకాంక్షా సింగ్ నటించిన ఈ షార్ట్ ఫిల్మ్ చూడదగ్గది.

అక్టోబర్ - ట్రైలర్


నిడివి: 2 ని. 02.సె.
హిట్స్: 20,063, 983

'పికూ' సినిమాకు దర్శకత్వం వహించి 'పింక్' సినిమాకు నిర్మాతగా మారిన సూజిత్ సర్కార్ రెండేళ్ల విరామం తర్వాత 'అక్టోబర్' సినిమాతో దర్శకుడిగా తిరిగి వస్తున్నాడు. వరుణ్ ధావన్ వంటి యాక్షన్ హీరో ఈ సినిమాలో హోటల్ బోయ్‌గా నటిస్తుండటం విశేషం. తమిళంలో 'షాపింగ్ మాల్' అనే సినిమా వచ్చింది. షాపింగ్ మాల్‌లో పని చేసే ఇద్దరు అమ్మాయి, అబ్బాయిలు ప్రేమలో పడతారు. ఈ సినిమాలో ఒక స్టార్ హోటల్‌లో పని చేసే వర్కింగ్ క్లాస్ అమ్మాయి, అబ్బాయి ప్రేమలో పడతారు. అయితే ఆ అమ్మాయి ప్రాణాంతకమైన సమస్యతో హాస్పిటలైజ్ అయితే హీరో ఆమె కోసం ఎలాంటి కేర్ తీసుకున్నాడన్నది ఈ ప్రేమ కథ సారాంశం కావచ్చని తెలుస్తోంది. పూర్తిగా కొత్త తరహా కథ, కథనం ప్రామిస్ చేస్తున్న ఈ సినిమా ట్రెలర్ కుతూహలం రేపుతోంది. సూజిత్ సర్కార్ సినిమాలకు తరచూ పని చేసే జుహు చతుర్వేది ఈ సినిమాకు కూడా రచన చేశారు.

తథాస్తు - షార్ట్‌ఫిల్మ్


నిడివి: 19 ని. 41 సె.
హిట్స్: 3,48,934

యాంకర్‌గా సుప్రసిద్ధురాలైన సుమ ఆర్.పి.పట్నాయక్ దర్శకత్వంలో నటించిన షార్ట్‌ఫిల్మ్ ఇది. సమాజంలో ఎవరూ పెద్దగా పట్టించుకోని అనాథల పట్ల... మనందరి కర్తవ్యాన్ని గుర్తు చేసే కథగా దీనిని రూపొందించారు. ఇందులో లాయర్‌గా నటించిన సుమ అనాథ శరణాలయాలకు కేవలం డొనేషన్లు ఇవ్వడం వల్ల పనులు జరగవనీ మనం కూడా అప్పుడప్పుడు వాటిని పట్టించుకోవాల్సి ఉంటుందని, ఆ కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొనాల్సి ఉంటుందని గ్రహిస్తుంది. తన పాప పుట్టినరోజును అనాథ శరణాలయంలో నిర్వహించడమే కాక ప్రతి తల్లిదండ్రులు ఇదే పద్ధతిని పాటించాలని పిలుపునిస్తుంది. ఈ షార్ట్‌ఫిల్మ్‌లో మరో యాంకర్, గాయని సునీత చమక్కుమనడం బాగుంది. ఆలోచింపజేసే ఈ షార్ట్‌ఫిల్మ్ చూడదగ్గది.

నీదీ నాదీ ఒకే కథ – ట్రైలర్


నిడివి: 2.58
హిట్స్: 4,39,769

తల్లిదండ్రులు నిర్ధారించిన మూసలో ఇమడలేక సతమతమయ్యే పిల్లల మానసిక వ్యథను ప్రధానాంశంగా తీసుకొని వేణు ఊడుగుల దర్శకత్వం వహించిన సినిమా 'నీదీ నాదీ ఒకే కథ'. చదువు రాని వాళ్లు, లేదా మంచి మార్కులు తెచ్చుకోనివాళ్లు, లేదా కొన్నిసార్లు మంచి ర్యాంకులు సాధించినవాళ్లు కూడా దేనికి పనికిరారనే విధంగా మన విద్యావ్యవస్థ, మన సామాజిక దృష్టికోణం స్థిరపడిపోయాయి. ప్రతి ఒక్కరికీ తనదైన ప్రతిభతో రాణించే హక్కు ఉంది. దేనిలో రాణిస్తారో దానిని ఎంచుకునే హక్కు కూడా ఉంది. ఆ విషయాన్ని తల్లిదండ్రులు మర్చిపోవడం వల్లే పిల్లలు ఇళ్ల నుంచి పారిపోవడం, ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతోంది. ఈ అంశాలు చర్చకు పెట్టే ఈ సినిమా ట్రైలర్ మంచి హిట్స్ సాధిస్తోంది. హీరో శ్రీవేణుకు ఈ సినిమా మంచి ఫలితాన్నే ఇస్తుందని ఆశిద్దాం.

ఫ్యామిలీ డాక్టర్

పీడియాట్రిక్ కౌన్సెలింగ్

ఇంత చిన్న వయసులోనూ కండరాల నొప్పులా?

మా బాబుకు ఏడేళ్లు. ఇటీవల తరచూ కాళ్లూ చేతుల్లో నొప్పులు అంటున్నాడు. కండరాల నొప్పులు కూడా ఉన్నాయి. ఈ సమస్య మినహా అన్ని రకాలా ఆరోగ్యంగానే ఉన్నాడు. డాక్టర్‌కు చూపిస్తే విటమిన్-డి లోపాల వల్లగాని లేదా ఎదుగుదల సమయంలో వచ్చే నొప్పులు కావచ్చని అంటున్నారు. అయితే ఇటీవల నాకు కూడా విపరీతంగా కాళ్లూ, చేతుల్లో నొప్పి వస్తే డాక్టర్‌కు చూపించాను. నాకు విటమిన్-డి లోపం ఉన్నట్లు చెప్పారు. దీన్నిబట్టి మా బాబుకు నిశ్చయంగా విటమిన్-డి లోపమేనంటారా? ఇది ఇతర సమస్యలకు దారితీయవచ్చా? దయచేసి వివరంగా సలహా చెప్పండి.

– సుహానా, కర్నూలు



మీ బాబు విషయంలో మీరు పేర్కొన్న లక్షణాలు అనేక కారణాల వల్ల కనిపించినప్పటికీ... అతడిలో ఇతర ఆరోగ్య సమస్యలు... అంటే... తరచూ జ్వరం, బరువులో మార్పులు, ఎదుగుదల సమస్యలు, కడుపుకు సంబంధించిన లేదా కాలేయానికి సంబంధించిన సమస్యలు, కీళ్లలో వాపులు, నడవడంలో తీవ్ర ఇబ్బందులు లేవు కాబట్టి మీ బాబు సమస్యను తీవ్రమైన ఇతర జబ్బులకు సూచనగా భావించలేం. మీ డాక్టర్ చెప్పినట్లుగా విటమిన్-డి లోపం ఉన్నప్పుడు ఇటువంటి లక్షణాలు చాలా ఎక్కువగా చూస్తుంటాం.

సాధారణంగా ఇటీవలి కాలం వరకూ బాగా చల్లటివీ, సూర్యరశ్మి తక్కువగా ఉండే పాశ్చాత్య దేశాల్లోనే విటమిన్–డి లోపం ఎక్కువగా ఉంటుందనే అపోహ ఉండేది. అయితే ఇటీవల మన దేశంలాంటి ఉష్ణమండల (ట్రాపికల్) వాతావరణం ఉన్నచోట్ల కూడా విటమిన్–డి లోపాన్ని చాలా ఎక్కువగా చూస్తున్నాం.

విటమిన్–డి అనేది అనేక ఆరోగ్య అంశాల నిర్వహణకు చాలా అవసరం. మన ఎముకల ఆరోగ్యానికి, పటిష్టతకు అది దోహదం చేస్తుంది. అలాగే మన దేహంలోని అనేక కీలక అవయవాల సమర్థమైన పనితీరుకు అది అవసరం. ఎండకు తగినంతగా ఎక్స్‌పోజ్ కాకపోవడం వల్ల, మనం తీసుకునే ఆహారంలో విటమిన్–డి లోపం వల్ల, శాకాహార నియమాన్ని మరీ ఖచ్చితంగా పాటిస్తుండటం వల్ల, పాలతో అలర్జీ ఉండటం వల్ల విటమిన్–డి లోపం కనిపిస్తుంది. అలాగే కొందరిలో దీర్ఘకాలికంగా కాలేయ వ్యాధులు, మూత్రపిండాల సమస్యలు ఉండటం, కొన్ని రకాల మందులు వాడుతుండటం జరుగుతుంటే ఈ లోపం కనిపించవచ్చు. ఇప్పుడు విటమిన్–డి లోపం అన్నది పిల్లల్లో, పెద్దల్లో కనిపించడం చాలా సాధారణమైంది.

విటమిన్–డి లోపం ఉన్నప్పుడు ఫిట్స్ వచ్చి స్పృహతప్పడం, కాళ్లూచేతులు వంకర్లు తిరగడం, కండరాల నొప్పులు, నడకలో నిదానం, రికెట్స్ కనిపించవచ్చు. దాంతో పాటు కొద్దిమందిలో వ్యాధినిరోధకశక్తి (ఇమ్యూనిటీ)లో లోపం రావడం వల్ల తరచూ ఇన్ఫెక్షన్స్ బారిన పడటం, ఆస్తమా, మతిమరపు, డయాబెటిస్, మల్టిపుల్ స్క్లిరోసిస్, గుండెజబ్బుల బారినపడటం వంటి అనేక ఇతర ఆరోగ్య సమస్యలకు లోనయ్యేందుకు విటమిన్–డి లోపం ఒక కారణమని తెలుస్తోంది.

మీ అబ్బాయి విషయంలో విటమిన్–డి లోపంతో పాటు బహుశా క్యాల్షియం మెటబాలిజం లోపాల వల్ల కూడా మీరు చెప్పిన లక్షణాలు కనిపిస్తూ ఉండవచ్చు. అలాగే మీలోనూ విటమిన్–డి లోపం ఉన్నట్లు చెబుతున్నారు. కాబట్టి మీరు, మీ అబ్బాయి ఇద్దరూ విటమిన్–డి3తో పాటు క్యాల్షియమ్, ఫాస్ఫరస్ లోపాలు కనుగొనడానికి అవసరమైన వైద్య పరీక్షలతో పాటు థైరాయిడ్, పారాథైరాయిడ్ హార్మోన్ పరీక్షలు, సీబీపీ, సీపీకే పరీక్ష చేయించుకుంటే ఈ నొప్పులకు తగిన కారణాలపై పూర్తి స్థాయి సమాచారం తెలుస్తుంది.

ఈ లోపం తొలగడానికి విటమిన్–డి ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం కంటే కూడా... సూర్యుడికి తగినంత ఎక్స్‌పోజ్ కావడమే చాలా ముఖ్యం. ఇక ఆహారం విషయానికి వస్తే విటమిన్–డి ఎక్కువగా ఉండే పాలు, చేపలు, మాంసాహారం తీసుకోవాలి. దీంతో పాటు విటమిన్–డి సప్లిమెంట్స్ తీసుకోవడం వల్ల మీ బాబు సమస్య తప్పక తగ్గుతుంది. అలాగే పైన పేర్కొన్న వాటితో పాటు క్యాల్షియం కూడా తగిన పాళ్లలో అందేలా జాగ్రత్త తీసుకోవాలి. ఒకవేళ లోపం మరీ ఎక్కువగా ఉన్నట్లు తెలిస్తే విటమిన్–డి ఇంజెక్షన్లను తీసుకోవాల్సి ఉంటుంది. మీరు పైన చెప్పిన జాగ్రత్తలు తీసుకుంటూ మీ పిల్లల వైద్య నిపుణుడిని సంప్రదించి, తగిన చికిత్స తీసుకోండి.

బాబుకు యూరిన్‌లో ప్రోటీన్స్ ఎక్కువగా పోతున్నాయి... కిడ్నీ జబ్బు కావచ్చా?

మా బాబుకు ఐదేళ్లు. వాడికి ఇటీవల రెండు మూడు సార్లు జ్వరం వచ్చింది. మందులు ఇచ్చిన వెంటనే తగ్గింది. ఇప్పుడు బాగానే ఉన్నాడు. డాక్టర్‌ను సంప్రదిస్తే మావాడికి మూత్రంలో ఇన్ఫెక్షన్ అని చెప్పారు. కొద్దిగా నీరసంగా కూడా ఉన్నాడు. ఈమధ్య మూత్రపరీక్ష చేయిస్తే అతడికి యూరిన్‌లో కొద్దిగా ప్రోటీన్స్ పోతున్నట్లుగా రిపోర్టు వచ్చింది. మా దూరపు బంధువుల్లో ఒకరికి కిడ్నీ రుగ్మత ఉంది. ఆయనకు కూడా ఇలాగే ప్రోటీన్స్ పోతుంటాయి. దాంతో మావాడి విషయంలో నాకు చాలా ఆందోళనగా ఉంది. ఇదేమైనా మావాడి రాబోయే కిడ్నీ రుగ్మతకు సూచనా? దయచేసి వివరంగా చెప్పండి.

– సునీల, బెంగళూరు



పిల్లల్లోని పదిశాతం మందిలో ఎనిమిది, పదిహేనేళ్ల మధ్య...వారిలో జీవితకాలంలోని ఏదో సమయంలో ఇలా మూత్రంలో ప్రోటీన్ పోవడం అన్నది చాలా సాధారణంగా జరిగేదే. అయితే ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిన ప్రధానమైన అంశం ఏమిటంటే... ఇలా పోతున్న ప్రోటీన్ అన్నది కిడ్నీకి సంబంధించినదా, లేక తాత్కాలికంగా నష్టపోతున్నదా లేదా ఇతరత్రా హానికరం కాని కారణాల వల్ల పోతున్నదా అని తెలుసుకోవడం అన్నది చాలా ముఖ్యం. పిల్లలకు జ్వరం వచ్చినప్పుడు, అధికంగా వ్యాయామం చేసినప్పుడు, జలుబు చేసినప్పుడు, తీవ్రమైన ఒత్తిడికి గురైనప్పుడు, తాము ఉన్న స్థితి నుంచి మారడం (పొజిషనల్ వేరియేషన్) వంటి సాధారణమైన కారణాలు మొదలుకొని కిడ్నీజబ్బులు, ట్యూబ్యులార్ డిసీజెస్, పాలీసిస్టిక్ కిడ్నీ, రిఫ్లక్స్ నెఫ్రోపతి వంటి తీవ్రమైన, దీర్ఘకాలిక జబ్బుల వరకు ప్రోటీన్ పోవడం సంభవించవచ్చు. ప్రోటీన్ పోవడంలోని తీవ్రత ఆధారంగానే పేషెంట్ విషయంలో భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలను నిర్ణయించడం జరుగుతుంది.

పిల్లల్లో యూరిన్‌లో ప్రోటీన్ పోవడంలోని తీవ్రత – నిత్యం, గుర్తించేంత మోతాదులో అంటే కన్సిస్టెంట్‌గా, సిగ్నిఫికెంట్‌గా పోతుంటే అప్పుడిది ఏదైనా దీర్ఘకాలిక కిడ్నీ జబ్బులకు దారితీసే కండిషన్స్‌కు సూచికా అని తెలుసుకోవడం చాలా ముఖ్యం. అలాగే కొన్నిసార్లు మనకు తెలియకుండా కూడా మూత్రంలో ప్రోటీన్స్ చాలా తక్కువ మోతాదులో పోతుంటాయి. దీన్నే మైక్రో ఆల్బ్యుమిన్ యూరియా అంటారు. ఈ అంశంలో తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు యూరిన్ ప్రోటీన్ క్రియాటినిన్, 24గంటల్లో మూత్ర విసర్జన పరిమాణం, ఇమ్యూనలాజికల్ టెస్ట్, అల్ట్రాసౌండ్ అబ్డామిన్ వంటి మరిన్ని అదనపు పరీక్షలు చేయించాలి. అవసరమైతే కిడ్నీ బయాప్సీ మొదలైన పరీక్షల ద్వారానే ఇదేమైనా దీర్ఘకాలిక కిడ్నీ జబ్బుకు ఒక లక్షణమా అని తెలుసుకోవచ్చు.

ఇక మీ అబ్బాయి విషయానికి వస్తే రెండు మూడు సార్లు జ్వరం తప్ప మరే ఇతర లక్షణాలూ కనిపించలేదు కాబట్టి అతడి విషయంలో కనిపిస్తున్న ప్రోటీన్ పోవడం అన్నది తీవ్రమైన, దీర్ఘకాలిక కిడ్నీ జబ్బుకు ఒక లక్షణం కాకపోవచ్చు. అయినా మీ బంధువుల్లో ఒకరు కిడ్నీ జబ్బుతో బాధపడుతున్నారని రాశారు కాబట్టి పైన పేర్కొన్న పరీక్షలు చేయించడం వల్ల మీ అబ్బాయి సమస్యకు సంబంధించిన పూర్తి సమాచారం లభ్యమవుతుంది. మీరేమీ ఆందోళన చెందకుండా మీ అబ్బాయికి సంబంధించిన యూరిన్ టెస్ట్ రిపోర్టులు, ప్రోటీన్ పోతున్న రిపోర్టులతో ఒకసారి మీ పిల్లల వైద్యనిపుణుడితో పాటు నెఫ్రాలజిస్టును కలిసి తగిన సలహా తీసుకోండి.



డా. రమేశ్‌బాబు దాసరి
సీనియర్ పీడియాట్రీషియన్, రోహన్ హాస్పిటల్స్,
విజయనగర్ కాలనీ, హైదరాబాద్

సినిమా
సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
సోమవారం
19-3-2018



మహేశ్‌బాబు


పంచెకట్టు... అదిరేట్టు

స్వచ్ఛమైన తెలుగుదనానికి అచ్చ తెలుగు యువకుడిలా మహేశ్‌బాబు లుక్ అదిరిపోయింది. సంప్రదాయానికి కేరాఫ్ అడ్రస్‌లా ఉందని అభిమానులు అనుకుంటున్నారు. మహేశ్‌బాబు హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో డి. పార్వతి సమర్పణలో డీవీవీ ఎంటర్‌టైనెమెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న సినిమా 'భరత్ అనే నేను'. ఇందులో కియారా అద్వాని కథానాయిక. సీయం భరత్‌చంద్ర పాత్రలో మహేశ్‌బాబు కనిపించనున్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది సందర్భంగా మహేశ్‌బాబు సంప్రదాయ లుక్‌లో ఉన్న ఫొటోను చిత్ర బృందం రిలీజ్ చేసింది. ''ఉగాది పండగ కళ ఉట్టిపడే పంచెకట్టుతో ఉన్న మహేశ్‌బాబు లుక్‌కి విశేష స్పందన లభిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించి రాజు సుందరం నేతృత్వంలో ఓ పాట చిత్రీకరణ జరుగుతోంది. భారీ టెంపుల్ సెట్‌లో వంద మంది డ్యాన్సర్లు, వెయ్యిమంది జూనియర్ ఆర్టిస్టులతో చాలా గ్రాండ్‌గా పాటను తెరకెక్కిస్తున్నాం. ఈ నెల 25న స్పెయిన్‌లో కొత్త షెడ్యూల్ స్టార్ట్ చేయాలనుకుంటున్నాం. సినిమాను ఏప్రిల్ 20న రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు నిర్మాత డీవీవీ దానయ్య. ప్రకాశ్‌రాజ్, శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీప్రసాద్.

ఆ 'నర్తనశాల'తో సంబంధం లేదు

- నాగశౌర్య

నాగశౌర్య కథానాయకుడిగా ఐరా క్రియేషన్స్ పతాకంపై శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మాణంలో రూపొందనున్న '@నర్తనశాల' చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు కృష్ణవంశీ దగ్గర సహాయ దర్శకుడిగా చేసిన శ్రీనివాస్ చక్రవర్తి ఈ సినిమాతో దర్శకునిగా పరిచయం అవుతున్నారు. హీరో నాగశౌర్యపై దర్శకుడు వంశీ పైడిపల్లి క్లాప్ ఇచ్చారు. నాగశౌర్య మాట్లాడుతూ– ''మా సంస్థ నుంచి మరో కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇది డ్యాన్స్ బేస్డ్ చిత్రమని, పాత 'నర్తనశాల' చిత్రానికి రీమేక్ అని చాలామంది అనుకుంటున్నారు. కానే కాదు. ఫుల్ ఎంటర్‌టైనర్. నవ్వుకునే చిత్రం. రెండో సినిమాకు కూడా బయటివారిని కాకుండా నన్నే హీరోగా పెట్టినందుకు మా అమ్మకు థ్యాంక్స్'' అన్నారు. ''భిన్నమైన కథను సరిగ్గా జడ్జ్ చేసి, సినిమా చేద్దామని ఒప్పుకుని, నాకు ఫ్రీడమ్ ఇచ్చిన హీరో నాగశౌర్య, నిర్మాతలు శంకర్‌ప్రసాద్, ఉషగార్లకు థ్యాంక్స్. 'ఛలో'ను మించిన హిట్‌ను ఐరా క్రియేషన్స్‌కు అందిస్తానన్న నమ్మకం ఉంది'' అన్నారు శ్రీనివాస్ చక్రవర్తి. నందిని రెడ్డి, శ్రీనివాస్ అవసరాల, నటుడు అజయ్,ఎడిటర్ చంటి, డీఓపీ విజయ్ సి. కుమార్, ఎమ్ఎన్ఎస్. గౌతమ్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం:మహతి స్వర సాగర్, కెమెరా: విజయ్. సి. కుమార్.



నాగశౌర్యపై క్లాప్ ఇస్తున్న వంశీ పైడిపల్లి

మంచి రోజు.. మంచి వార్త



వరుణ్ తేజ్

'ఫిదా', 'తొలి ప్రేమ' విజయాలతో జోష్‌గా ఉన్న వరుణ్ తేజ్ తదుపరి చిత్రం ఖరారైంది. 'అయ్యారే, అప్పట్లో ఒకడుండేవాడు' వంటి వైవిధ్యమైన చిత్రాలను తెరకెక్కించిన సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా ఓ సినిమా రూపొందనుంది. 14 రీల్స్ ఎంటర్‌టైన్మెంట్స్ అధినేతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా 14 రీల్స్ ప్లస్ అనే బేనర్‌ను స్థాపించారు. ఈ బేనర్‌పైనే వరుణ్ తేజ్ సినిమా రూపొందనుంది. ''మంచి రోజు మంచి వార్త'' అన్నారు వరుణ్ తేజ్. ''14 రీల్స్ ప్లస్ బ్యానర్ తొలి సినిమా సాగర్ చంద్ర దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా రూపొందనుందని శుభప్రదమైన ఉగాది రోజున ప్రకటించినందుకు ఆనందంగా ఉంది'' అన్నారు నిర్మాత రామ్ ఆచంట.

ని'శబ్దం' అతని ఆయుధం



నారా రోహిత్

అందరికీ ఆయుధాలు కత్తో, కొడవలో అయితే అతని ఆయుధం మాత్రం నిశబ్దం. ఎందుకంటే.. మూగవాడు కనుక. నారా రోహిత్ తదుపరి సినిమా 'శబ్దం'లో మూగవాడి పాత్రలో కనిపించనున్నారు. పి.బి. మంజునాథ్ దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వైష్ణవి క్రియేషన్స్ పతాకంపై నారాయణరావు అట్లూరి నిర్మించనున్నారు. ఈ సినిమాను ఉగాది సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, సివిల్ సప్లైస్ మినిస్టర్ ప్రత్తిపాటి పుల్లారావు క్లాప్‌నిచ్చారు. పి.బి.మంజినాధ్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ– ''ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడం కోసం టీమ్ అంతా కష్టపడతాం. ఈ కథకు 'శబ్దం' అనే టైటిల్ చాలా యాప్ట్'' అన్నారు. ''శబ్దం' సూపర్ హిట్ అవ్వాలని, చిత్రబృందానికి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అన్నారు ప్రత్తిపాటి పుల్లారావు. ''రోహిత్‌గారితో సినిమా చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు నిర్మాత నారాయణరావు. ''నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన హీరో రోహిత్, నిర్మాతలకు థ్యాంక్స్. ఏప్రిల్‌లో షూటింగ్ స్టార్ట్ అవుతుంది''అన్నారు మంజునాథ్.



సుమంత్, ఈషా రెబ్బలపై క్లాప్ ఇస్తున్న నాగచైతన్య

సూపర్ న్యాచురల్ సుబ్రహ్మణ్యపురం

సుమంత్, ఈషా రెబ్బ జంటగా నూతన దర్శకుడు సంతోష్ జాగర్లమూడి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'సుబ్రహ్మణ్యపురం'. తారస్ సినీకార్ప్ పతాకంపై ధీరజ్ బొగ్గారం, బీరం సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి హీరో నాగచైతన్య క్లాప్‌నివ్వగా, దర్శకుడు ప్రశాంత్ వర్మ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించారు. చిత్రం లోగోను ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి, రాజశేఖర్, జీవితా సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ – ''దర్శకుడు సంతోష్ స్టోరీ న్యారేషన్‌లోనే సినిమాను చూపించారు. సూపర్ న్యాచురల్ అంశాలున్న మిస్టరీ థ్రిల్లర్ మూవీ ఇది. ఇలాంటి జోనర్ అంటే నాకు భయం కానీ కథ నచ్చి చేస్తున్నాను. నిర్మాతలు గుర్తు చేసే వరకు ఇది నా 25వ సినిమా అని నాకు తెలియదు. అందుకే సందడిగా ప్రారంభించారు'' అన్నారు. ''కథ వింటున్నప్పుడు తర్వాత ఏంటి? అనే ఉత్కంఠతో ఎదురు చూశాను. ఆడియన్స్ కూడా అలానే ఫీల్ అవుతారని అనుకుంటున్నాను'' అన్నారు ఈషా. ''నా షార్ట్ ఫిల్మ్స్ చూసి నిర్మాతలు నాకీ అవకాశం ఇచ్చారు. సింపుల్‌గా అవుట్‌లైన్ చెబుదాం అని వెళ్తే క్లియర్‌గా స్టోరీ అంతా చెప్పమన్నారు సుమంత్‌గారు. కథ అంతా విన్న తర్వాత అంగీకరించారు. ఏప్రిల్ నుంచి రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేస్తాం'' అన్నారు దర్శకుడు. ''సుమంత్‌గారి 25వ సినిమా నిర్మించడం ఆనందంగా ఉంది. సుధాకర్ రెడ్డిగారు మంచి సహకారం అందిస్తున్నారు'' అన్నారు ధీరజ్ రెడ్డి. ఈ చిత్రానికి కెమెరా: ఆర్.కె. ప్రతాప్, సంగీతం: శేఖర్ చంద్ర.

హాలీవుడ్ స్పైస్

సూపర్ హీరోల హంగామా!



హాట్ హాట్ సమ్మర్. ఏప్రిల్ నెలాఖరు. అప్పటికి మన తెలుగు సూపర్‌స్టార్ మహేశ్ బాబు, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమాల హడావుడి మామూలుగా ఉండదు. సరిగ్గా ఆ హడావుడి మధ్యే ఒక హాలీవుడ్ సినిమా వస్తోంది. 'అవెంజర్స్ : ఇన్ఫినిటీ వార్' ఆ సినిమా పేరు. అలాంటి ఇలాంటి సినిమా కాదది. హాలీవుడ్‌లో మాస్‌కే మాస్ అనే సినిమా ఎలా ఉంటుందో అలా ఉంటుంది. ఎటు చూసినా సూపర్ హీరోలే! మార్వెల్ కామిక్స్ సృష్టించిన సూపర్ హీరోలు ఐరన్‌మేన్, స్పైడర్‌మేన్, బ్లాక్ పాంథర్.. ఇలా గత పదేళ్లుగా సూపర్‌హీరోలుగా మనల్ని మెప్పించిన వాళ్లందరూ ఉంటారు. వాళ్లు చేసే భారీ యాక్షన్, సమాజాన్ని కాపాడడానికి వాళ్లు చేసే అడ్వెంచర్స్‌తో ఆ సినిమా అదిరిపోనుంది. ఈమధ్యే విడుదలైన ట్రైలర్ సినిమా అభిమానులకు పండగే ఇవ్వనుందని స్పష్టం చేస్తోంది. భారీ బడ్జెట్‌తో మార్వెల్ స్టూడియో సూపర్‌హీరో సిరీస్‌లో 19వ సినిమాగా తెరకెక్కిన 'అవెంజర్స్ : ఇన్ఫినిటీ వార్' మొత్తం రెండు భాగాలుగా రానుంది. మొదటి భాగం ఏప్రిల్ 27, 2018న విడుదలవుతోంటే, దానికి సీక్వెల్ అయిన రెండో భాగం 2019లో రానుంది. ఒక్క సూపర్ హీరో ఉంటేనే ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద హంగామా చేసేస్తుంది. ఇక సినిమా నిండా సూపర్ హీరోలే అయితే? అందులోనూ ఐమాక్స్, 3డీ వర్షన్స్‌లో చూస్తే? థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఇందుకు ఎక్కువ కాలం ఆగక్కర్లేదు. ఇంకొక్క నెలే.. 'అవెంజర్స్ : ఇన్ఫినిటీ వార్' అందరికీ ఫుల్ ఆన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చేందుకు వచ్చేస్తోంది.

ముద్దు గొడవ!



కేటీ పెరీ

''నువ్వెప్పుడైనా, ఎవరినైనా కిస్ చేశావా?'' అనడిగింది పాపులర్ సింగర్ కేటీ పెరీ, 20 ఏళ్ల బెంజమిన్ గ్లేజ్‌ని. అమెరికన్ ఐడల్ షోలో కంటెస్టెంట్ అతను. ఆమె జడ్జి. బెంజమిన్ లేదన్నాడు. అయితే నాకొక ముద్దివ్వు అనడిగింది కేటీ, అతను ఆమె చెంపమీద ఒక ముద్దు పెట్టాడు. 'ఇలాగా?' అంటూ అతను ఊహించని రీతిలో గ్లేజ్ పెదాల మీద ముద్దు పెట్టింది కేటీ. చిన్న కుర్రాడు. అందులోనూ అంతకుముందు ఎప్పుడూ కిస్ చెయ్యలేదు. కంగారు పడిపోయి, బాగా ఇబ్బంది పడ్డాడు. ఆ విషయమే తర్వాత అందరికీ చెప్పాడు. గొడవ అప్పుడు మొదలైంది. కేటీ పేరీ చేసిన పని ఏ రకంగా చూసినా అబ్యూజ్ కిందకే వస్తుందని అన్నారంతా. 'ఇదే పని ఒక మేల్ జడ్జి చేస్తే ఏం చేసేవారు?' అని గొడవ చేశారు. ముందు ఇద్దరిద్దరే కామెంట్ చేశారు. ఆ తర్వాత ఈ ముద్దు గొడవ పెద్దదైపోయింది. ఇంటర్నెట్‌లో ఎక్కడ చూసినా ఈ ముద్దు గొడవే! ఇదింకా పెద్దదవుతుందనుకున్నాడో ఏమో, గ్లేజ్ బయటకొచ్చి చెప్పాడు.. ''నేను ఇబ్బందిగా ఫీలియిన మాట వాస్తవమే. నా ఫస్ట్ కిస్ నా గర్ల్‌ఫ్రెండ్‌తో ఉండాలనుకున్నా. కేటీ పెరీ స్ట్రేంజర్. ఆమె అలా కిస్ చేస్తే ఇబ్బందనిపించింది. అంతేకానీ అదేమీ అబ్యూజ్ కాదు. హరాస్‌మెంట్ అంతకన్నా కాదు''. మొత్తానికి గ్లేజ్ ఇచ్చిన ఎక్స్‌ప్లనేషన్‌తో గొడవైతే మొత్తం సద్దుమణిగిపోయింది. కానీ ముద్దు ఇంకా ఆన్‌లైన్లో సెన్సేషనే!

స్పెషల్ బాండ్.. స్పెషల్ డైరెక్టర్!



డేనీ బోయల్

బాండ్.. జేమ్స్‌బాండ్. 56 సంవత్సరాల బ్రాండ్ అది. 24 సినిమాల ఎంటర్‌టైన్‌మెంట్. ఎంతో మంది దర్శకులు మారిపోయారు. ఎంతో మంది నటులూ మారిపోయారు. ఆ బ్రాండ్ ఇప్పటికీ అలాగే ఉంది. బాండ్ సినిమా వస్తోందంటే యాక్షన్ సినిమా అభిమానులకు పండగే. ఇక ఈసారి వచ్చేది 25వ సినిమా కదా! కాబట్టి ఈ స్పెషల్ బాండ్ సెట్స్‌పైకి వెళ్లకముందు నుంచే రోజూ వార్తల్లో కనిపిస్తోంది. ఇంతకుముందు నేటితరం టాప్ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ బాండ్ 25వ సినిమాకు డైరెక్టర్ అని వినిపించింది. ఆ తర్వాత వరుసగా టాప్ డైరెక్టర్స్ పేర్లన్నీ ఒక్కొక్కటిగా వినిపిస్తూ వచ్చాయి. ఇక ఎట్టకేలకు స్పెషల్ బాండ్ దర్శకుడు ఫిక్స్ అయిపోయాడు. ఆయనే మన డేనీ బోయల్. 'స్లమ్‌డాగ్ మిలియనీర్', '127 అవర్స్' సినిమాలతో ఇండియన్ సినిమా అభిమానులకూ బాగా దగ్గరైన డేనీ, జేమ్స్‌బాండ్ కొత్త సినిమాకు దర్శకత్వం వహిస్తున్నానని స్వయంగా ప్రకటించాడు. ఇప్పుడే అసలైన చర్చ మొదలైంది. డ్రామా, థ్రిల్లర్ జానర్‌కు పెట్టింది పేరైన డేనీ బోయల్, బాండ్ లాంటి ఔట్ అండ్ ఔట్ యాక్షన్ సినిమాను ఎలా తెరకెక్కిస్తాడా అన్నది ఆసక్తికరం. ఇప్పటికే దర్శకులు మారినప్పుడల్లా బాండ్ సినిమా ప్లాట్, కోర్ ఎమోషన్, టోన్ మారిపోతూ వచ్చింది. ముఖ్యంగా స్కైఫాల్, స్పెక్టర్ సినిమాలతో శామ్ మెండిస్ బాండ్ రూపు రేఖలనే మార్చేశాడు. దీంతో ఇప్పుడు కొత్తగా, అదీ స్పెషల్ సినిమాకు, ఈ స్పెషల్ డైరెక్టర్ డేని బోయల్ ఏ టోన్ పట్టుకొస్తాడో చూడాలి. గత నాలుగు జేమ్స్‌బాండ్ సినిమాలకు హీరో అయిన డేనియల్ క్రెయిగ్ ఈ సినిమాలోనూ నటిస్తున్నాడు.

హాఫ్ న్యూడ్‌గా కనిపించమన్నారు!



జెన్నీఫర్ లోపెజ్

''నేను ఆ రోజు ఆడిషన్‌కు వెళ్లా. ఒక్కదాన్నే. ఆడిషన్ చేసిన ప్రొడ్యూసర్ నన్ను షర్ట్ విప్పమని, హాఫ్ న్యూడ్‌గా కనిపించమని అడిగాడు. నేనప్పుడు గట్టిగా నో చెప్పడానికి కూడా ఎలా భయపడ్డానో ఆలోచిస్తే ఈరోజుకీ భయమేస్తుంది'' జెన్నిఫర్ లోపెజ్ ఈ మధ్యే ఒక ఇంటర్వ్యూలో చెప్పిన మాటలివి. 48 ఏళ్ల జెన్నిఫర్, 30 ఏళ్లకు పైనే ఇండస్ట్రీలో ఉంది. పైన చెప్పిన సంఘటన 30 ఏళ్ల క్రిందట, ఆమె ఇండస్ట్రీకి అడుగు పెట్టకముందు జరిగింది. ఇన్నేళ్లకు గానీ ఆమె ఈ విషయం చెప్పలేదంటే, స్త్రీ ఒక జీవిత కాలమంత విషాదాన్ని తనలో దాచుకుంటుందని అనుకోవాలి. ఇప్పటికైనా జెన్నిఫర్ ఈ మాటలు చెప్పిందంటే, అది మీటూ అన్న ఒక ఉద్యమం బయటకొచ్చాకే! హాలీవుడ్‌లో మీటూ ఉద్యమం తీసుకొచ్చిన మార్పు తెలిసిందే. ఆరు నెలలుగా వందలాది మంది హీరోయిన్లు తమపై జరిగిన లైంగిక దాడుల గురించి చెబుతూ, ఎందరి పేర్లనో బయటపెట్టారు. హాలీవుడ్‌లో ఇప్పటికీ ఆ ఉద్యమం కొనసాగుతూనే ఉంది. ''నాకే ఈ విషయం చెప్పడానికి ఇన్నేళ్లు పట్టిందంటే.. ఇంక మామూలు అమ్మాయి సంగతి?'' అంటూ మీటూ ఉద్యమం లాంటివి ఎప్పుడూ ఉండాలని, హాలీవుడ్ ఇప్పటికైనా మారాలని జెన్నిఫర్ లోపెజ్ అన్నారు.

ఏపీ సెట్-2018

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ వర్సిటీలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్/లెక్చరర్స్‌గా పనిచేయడానికి అర్హత, ఉద్యోగోన్నతి కోసం నిర్వహించే 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీ సెట్)-2018'కు దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణులు అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ 2018, మార్చి 26 నుంచి ప్రారంభమవుతుంది. చివరి తేదీ మే 2, 2018. దరఖాస్తు రుసుం జనరల్‌కు రూ.1,000, బీసీ-రూ.800, ఎస్సీ/ఎస్టీ/పీహెచ్/వీహెచ్‌కు రూ.500. జూలై 1, 2018న పరీక్ష ఉంటుంది. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: apset.net.in

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

జాబ్ ట్రెండ్స్

కార్పొరేట్ రంగంలో ఐఐఎంలపై క్రేజ్ మరోమారు స్పష్టమైంది! బహుళ జాతి సంస్థలు ఐఐఎం విద్యార్థుల కోసం క్యూ కట్టాయి. రూ.లక్షల వేతనాలతో ఎర్రతివాచీ పరిచాయి. ఐఐఎంల్లో ఇటీవల ముగిసిన చివరి ప్లేస్‌మెంట్స్ గణాంకాలు ఇందుకు నిదర్శనం! ఈ నేపథ్యంలో విద్యార్థులకు లభించిన ఆఫర్లు, వేతన ప్యాకేజీలు తదితరాలపై ఫోకస్..



ఐఐఎం ప్లేస్‌మెంట్స్..

కార్పొరేట్ హవా!

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంలు).. మేనేజ్‌మెంట్ విద్యను అందించడంలో అత్యున్నత విద్యా సంస్థలుగా గుర్తింపు సాధించాయి. కార్పొరేట్ కంపెనీలకు నిపుణులైన అభ్యర్థులను అందిస్తున్న విద్యాసంస్థలుగా పేరు గడించాయి. ఐఐఎం అనగానే గుర్తొచ్చే ఐఐఎం-అహ్మదాబాద్ మొదలు.. ఇటీవల ఏర్పాటైన కొత్త ఐఐఎం క్యాంపస్‌ల వరకు.. అన్నింటిలోనూ దాదాపు 100 శాతం ప్లేస్‌మెంట్స్ నమోదయ్యాయి. విద్యార్థులకు రూ.లక్షల్లో వేతన ప్యాకేజీలు లభించాయి.

ప్రఖ్యాత ఐఐఎంల జోరు

ఐఐఎం-అహ్మదాబాద్, కోల్‌కతా, బెంగళూరు, లక్నో.. ఎన్నో ఏళ్లుగా అత్యున్నత మేనేజ్‌మెంట్ విద్యను అందిస్తున్నాయి. ఈ ఏడాదీ వీటిలో కొలువుల జోరు కొనసాగింది. ఈ క్యాంపస్‌ల్లో 100 శాతం ప్లేస్‌మెంట్స్ నమోదయ్యాయి. 2017 డిసెంబర్ నుంచి 2018 ఫిబ్రవరి చివరి వరకు సాగిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌లో మొదటి దశలోనే 60 శాతం మందికి ఆఫర్లు లభించాయి. చివరి దశలో భాగంగా ఇటీవల నిర్వహించిన ప్లేస్‌మెంట్స్ లో మిగిలిన వారికీ నియామక పత్రాలు చేతికందాయి.

ఒకట్రెండు రోజుల్లోనే..

- చివరి ప్లేస్‌మెంట్స్‌లో తుది దశ డ్రైవ్స్ ఒకట్రెండు రోజుల్లోనే ముగియడం గమనార్హం.
- ఐఐఎం- కోల్‌కతాలో రెండు రోజుల్లో 481 ఆఫర్లతో 100 శాతం రికార్డు నమోదైంది. ఐఐఎం బెంగళూరులోనూ ఇదే పరిస్థితి. మొత్తం 420 మంది విద్యార్థులకు 462 ఆఫర్లు లభించాయి.
- ఐఐఎం లక్నోలో 445 మంది విద్యార్థులకు నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 454 ఆఫర్లు ఖరారయ్యాయి.
- ఐఐఎం-అహ్మదాబాద్‌లో క్లస్టర్ విధానం అమలవుతోంది. మూడు క్లస్టర్లలోని విద్యార్థులందరికీ క్యాంపస్ డ్రైవ్స్‌లో నియామకాలు ఖరారయ్యాయి. ఐఐఎం- అహ్మదాబాద్ ట్రేడ్ మార్క్ ప్రోగ్రామ్.. 'ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్'లోనూ అధిక ఆఫర్లు లభించాయి.
- ఇటీవల ఏర్పాటై, కొత్త ఐఐఎంలుగా పేర్కొంటున్న రాంచీ, రాయ్‌పూర్, ఉదయ్‌పూర్, విశాఖపట్నం తదితరాల్లోనూ 100 శాతం ప్లేస్‌మెంట్స్ నమోదవడం విశేషం.
- గతంలో ఐఐఎంల గడప తొక్కని సంస్థలూ ఈసారి రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చేపట్టడం విశేషం. ఐఐఎం-లక్నో క్యాంపస్‌లో 47 సంస్థలు, ఐఐఎం-అహ్మదాబాద్‌లో 30, కోల్‌కతాలో 42 సంస్థలు ఈ ఏడాదే కొత్తగా వచ్చాయి.

గతేడాదితో పోల్చితే..!

క్యాంపస్ డ్రైవ్స్ ఆఫర్ల ఖరారులో గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం మంచి పెరుగుదల కనిపించింది. ఐఐఎం-బెంగళూరు, కోల్‌కతా, అహ్మదాబాద్, లక్నో, ఉదయ్‌పూర్ తదితర క్యాంపస్‌ల్లో 20 శాతం పెరుగుదల నమోదైంది. 10 శాతం మంది విద్యార్థులకు రెండేసి ఆఫర్లు సైతం లభించాయి. ఐఐఎం లక్నోలో ఏడుగురు విద్యార్థులకు అంతర్జాతీయ ఆఫర్లు అందాయి.

బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్

క్యాంపస్ డ్రైవ్స్ గణాంకాలను పరిశీలిస్తే.. అన్ని ఐఐఎం క్యాంపస్‌ల్లోనూ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), కన్సల్టింగ్ సంస్థల హవా కనిపించింది. యాక్సెంచర్ స్ట్రాటజీ, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, బెయిన్ అండ్ కంపెనీ, మెకిన్సే అండ్ కో తదితర ప్రముఖ కన్సల్టింగ్ సంస్థలు; సిటీ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, ఐసీఐసీఐ బ్యాంకులు ముందంజలో నిలిచాయి. సగటున ప్రతి ఐఐఎంలోనూ 40 శాతం మేరకు ఆఫర్లు ఇచ్చాయి.

ఐటీ సంస్థలు..

ఐఐఎం క్యాంపస్ డ్రైవ్స్‌లో ఐటీ సంస్థలూ భారీ ఆఫర్లు ఇవ్వడం విశేషం. అన్ని ఐఐఎంలలో కలిపి సగటున 30 శాతం మేర ఐటీ సంస్థలు ఆఫర్లు ప్రకటించాయి. ఈ సంస్థలు ప్రధానంగా అనలిటిక్స్, డేటా మేనేజ్‌మెంట్, బిగ్‌డేటా విభాగాలకు అభ్యర్థులను నియమించుకున్నాయి. కనిష్ఠంగా రూ.25 లక్షలు, గరిష్ఠంగా రూ.40 లక్షలు, సగటున రూ.28 లక్షల వార్షిక వేతనంతో ఆఫర్లు అందించాయి.

పీపీవోలకు ప్రాధాన్యం

- 2016-18 బ్యాచ్‌కు సంబంధించి క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ పరంగా తమ సంస్థల్లో ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ (పీపీవో) సొంతం చేసుకొని ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన వారికి ఫైనల్ ప్లేస్‌మెంట్స్‌లో సంస్థలు ప్రాధాన్యం ఇచ్చాయి. ఆయా సంస్థలు నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో.. పీపీవో అభ్యర్థుల సంఖ్య 60 శాతం వరకు ఉన్నట్లు క్యాంపస్ వర్గాలు పేర్కొన్నాయి.
- 2017-19 బ్యాచ్ ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ (సమ్మర్ ఇంటర్న్స్)లోనూ పెరుగుదల నమోదైంది. ఒకట్రెండు నెలల వ్యవధిలో ఉండే ప్రీ ప్లేస్‌మెంట్స్ పరంగా గతేడాదితో పోల్చితే.. ఈ సంవత్సరం అన్ని ఐఐఎంలలో 20 శాతం పెరుగుదల కనిపించింది. రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు స్టైపెండ్ ఇచ్చేందుకు సంస్థలు సిద్ధమవడం విశేషం.

పెరుగుదలకు కారణం

పీపీవో సొంతం చేసుకున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్ సమయంలో సమర్థంగా రాణించడమే ఫైనల్ ప్లేస్‌మెంట్స్‌లో ఆఫర్లు పెరగడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. దీంతోపాటు సంస్థలు విస్తరణ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ... యంగ్, డైనమిక్ ప్రొఫెషనల్స్‌ను నియమించుకోవాలని చూడటమూ మరో కారణంగా చెబుతున్నారు.

టాప్ రిక్రూటర్స్

- బెయిన్ అండ్ కంపెనీ
- యాక్సెంచర్ ■ ఎ.టి.కెర్నీ
- బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్
- బ్యాంక్ ఆఫ్ అమెరికా

అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం

అంతర్జాతీయంగా సంస్థలు కార్యకలాపాలు, ప్రణాళికల పరంగా కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నాయి. దాంతో ఈసారి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం కంపెనీలన్నీ యువత కోసం అన్వేషిస్తున్నాయి. యువ ఉద్యోగులు తమ అవసరాలకు అనుగుణంగా చురుగ్గా పనిచేస్తారనే నమ్మకం కంపెనీల్లో ఉంది. ఈ సంవత్సరం భారత్‌లోనూ ఆయా సంస్థల కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. క్యాంపస్ డ్రైవ్స్‌లో పెరుగుదల ఇందులో భాగమే.

– తపస్ రంజన్, మేనేజర్, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్, ఐఐఎం-వి.

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్).. ఏటా దేశ వ్యాప్తంగా లక్షల మంది పోటీపడే పరీక్ష. ఇందులో ప్రతిభ చూపితే.. ఉన్నతవిద్య పరంగా ఉపకార వేతనాలు, పేరున్న కాలేజీలో పీజీ చేసే చక్కటి అవకాశాలు సొంతమవుతాయి. మెరుగైన ర్యాంకు సాధిస్తే ప్రభుత్వ రంగ సంస్థలు.. పిలిచి మరీ ఉద్యోగాలిస్తాయి. తాజాగా గేట్-2018 ఫలితాలను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) గువహటి విడుదల చేసింది. తెలుగు విద్యార్థి యాదగిరి శశాంక్... సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో జాతీయ స్థాయి తొమ్మిదో ర్యాంకు సాధించాడు. పటిష్ఠ ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే.. 'గేట్'లో గెలుపొందడం పెద్ద కష్టమేమీ కాదంటున్న శశాంక్ సక్సెస్ స్టోరీ ఆయన మాటల్లోనే..



సక్సెస్ స్పీక్స్

సరైన ప్రణాళికతోనే గేట్ గెలుపు..

'మాది మంచిర్యాల. నాన్న రామ్మోహన్‌రావు శ్రీరాంపూర్‌లోని సింగరేణి కాలరీస్‌లో ఎలక్ట్రికల్ ఫోర్‌మ్యాన్. అమ్మ రుక్మిణి, ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలు. నేను ఒక్కడినే సంతానం. నా విద్యాభ్యాసం ఏడో తరగతి వరకు బెల్లంపల్లిలో, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు గుడివాడలో పూర్తయింది.

ఇంజనీరింగ్ తర్వాత..

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)-కాలికట్‌లో 2014లో ఇంజనీరింగ్ పూర్తిచేశా. గేట్ ద్వారా పేరొందిన విద్యాసంస్థల్లో ఉన్నత విద్య అవకాశాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు లభించే అవకాశం ఉండటంతో ఆ దిశగా సన్నద్ధమయ్యా. 2015లో మొదటి ప్రయత్నంలోనే గేట్‌లో 114వ ర్యాంకు వచ్చింది. దాంతో కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలు తలుపు తట్టినప్పటికీ.. ఎంటెక్ పూర్తిచేయాలనే లక్ష్యంతో ఐఐటీ మద్రాసులో చేరా.

ఐఈఎస్, గేట్‌కు ఏకకాలంలో..

ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్ (ఐఈఎస్) ఎగ్జామ్, గేట్‌కు ఏకకాలంలో సన్నద్ధమయ్యా. ఈ ఏడాది జనవరి 7న ఐఈఎస్ ప్రిలిమినరీ పరీక్ష జరిగింది. దాని తర్వాత గేట్‌కు నెల వ్యవధి అందుబాటులో ఉంది. ఐఈఎస్, గేట్ సిలబస్ మధ్య పెద్దగా వ్యత్యాసం లేకపోవడంతో.. ప్రిపరేషన్‌కు ఇబ్బంది కలగలేదు. ఉన్న కొద్దిపాటి సమయంలోనే మాక్‌టెస్టులు ఎక్కువగా రాశా. వాటి ఫలితాలు ఎప్పటికప్పుడు సమీక్షించుకున్నా.

ప్రిపరేషన్ ఇలా..

ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిక్షణ తరగతులుండేవి. ఇంటికెళ్లాక గంటన్నర విరామం అనంతరం క్లాసు నోట్స్ చదివేవాడిని. ఆయా అంశాల నుంచి గతంలో వచ్చిన ప్రశ్నలను ప్రాక్టీస్ చేసేవాడిని. ఎప్పటికప్పుడు మాక్‌టెస్టులు రాస్తూ పొరపాట్లు సరిదిద్దుకొని ముందడుగు వేశా. ప్రిపరేషన్ ప్రారంభం నుంచి ప్రతి అంశాన్నీ అధ్యయనం చేస్తూ షార్ట్‌నోట్స్ రాసుకున్నా. దీంతో పరీక్ష సమయంలో రివిజన్ సులువైంది. పరీక్షకు ముందు షార్ట్ నోట్స్ ఎంతో ఉపయోగపడింది. కానీ, పరీక్షలో న్యూమరికల్ ఎబిలిటీ విభాగం కష్టమనిపించింది. కారణం.. ఆ ప్రశ్నలకు ఆప్షన్లు ఉండవు. ఒకటికి రెండుసార్లు ప్రశ్నలు సాల్వ్ చేసి సమాధానాలు రాయాల్సి ఉంటుంది.

మాక్ టెస్టులు

ప్రిపరేషన్‌లో మాక్ టెస్టులు అత్యంత కీలకం. తప్పులు సమీక్షించుకునేందుకు, సన్నద్ధతలో ప్రిపరేషన్ స్థాయిని తెలుసుకునేందుకు ఇవి ఎంతో ఉపయోగపడ్డాయి. గేట్ ఔత్సాహికులు కోచింగ్‌కు వెళ్లకున్నా.. టెస్టు సిరీస్‌లు రాయాలి. గేట్ పరీక్ష ట్రెండ్‌ను అర్థం చేసుకోవడానికి గత ప్రశ్నపత్రాలు ఉపయోగపడతాయి. ఏయే అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి? అధ్యాయాల వారీ వెయిటేజీ ఎలా ఉంటుంది? తదితర అంశాలు తెలుసుకునేందుకు గత ప్రశ్నపత్రాలు ఉపయోగపడతాయి.

అకడమిక్స్‌పై పట్టుతోనే..

గేట్ అంటే ఎంతో క్లిష్టమనే భావన చాలామంది విద్యార్థుల్లో ఉంటుంది. బీటెక్ స్థాయిలో అకడమిక్ సిలబస్ అంశాలపై పట్టు సాధిస్తే గేట్‌లో ర్యాంకు సాధించడం తేలికే. గేట్‌లో ప్రశ్నలు అప్లికేషన్ ఓరియెంటెడ్‌గా ఉంటాయి. కాబట్టి బీటెక్ స్థాయిలోనే అకడమిక్ అంశాలను అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో చదివితే ప్రిపరేషన్‌కు ఎంతో ఉపయోగపడుతుంది. గేట్ ఔత్సాహికులు మొదటి నుంచి షార్ట్‌నోట్స్ రాసుకుంటూ, ఆన్‌లైన్ పరీక్షలు రాయాలి. చివర్లో రాయొచ్చనే ధోరణి సరికాదు. ప్రిపరేషన్ పూర్తయిన రోజు నుంచే ఆన్‌లైన్ టెస్టులు రాయడం లాభిస్తుంది. విద్యార్థులు కనీసం ఏడాది ముందు నుంచి గేట్ లక్ష్యంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. అంటే.. ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్ సెకండ్ సెమిస్టర్ నుంచే గేట్‌కు సన్నద్ధమవ్వడం మంచిది. అప్పటికే ఇంజనీరింగ్ కరిక్యులం పూర్తవుతుంది కాబట్టి ఇంజనీరింగ్ చివరి సంవత్సరంలోనే మంచి ర్యాంకు పొందడానికి వీలుంటుంది. కోచింగ్ తప్పనిసరి కాకున్నా .. సందేహాల నివృత్తి, ప్రస్తుత పరీక్షల సరళి, పరీక్ష విధానం తదితరాలను అర్థం చేసుకోవడానికి శిక్షణ ఉపయోగపడుతుంది.

ఐఈఎస్ సాధన లక్ష్యం

ప్రస్తుతం ఐఈఎస్ మెయిన్స్‌కు సిద్ధమవుతున్నా. ఈ ఏడాది జూలైలో మెయిన్ పరీక్ష ఉంది. ఐఈఎస్ సాధన లక్ష్యంగా చదువుతున్నాను. గేట్ స్కోరు ఆధారంగా నియామకాలు చేపట్టే పీఎస్‌యూలకు ఇప్పటివరకు దరఖాస్తు చేయలేదు. భవిష్యత్తులో ఏవైనా ఉద్యోగ ప్రకటనలు వెలువడితే వాటికి దరఖాస్తు చేసుకుంటా.

చదివిన పుస్తకాలు

సివిల్ ఇంజనీరింగ్‌లో స్ట్రెంథ్ ఆఫ్ మెటీరియల్స్, సాయిల్ మెకానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, ఫ్లూయిడ్ మెకానిక్స్ ముఖ్యమైనవి. సాయిల్ మెకానిక్స్‌కు గోపాల్ రంజన్; ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్‌కు ఖన్నా అండ్ జస్తో; ఫ్లో ఇన్ ఓపెన్ చానెల్స్‌కు కె.సుబ్రమణ్య పుస్తకాలను రిఫర్ చేశాను.

ప్రొఫైల్

- గేట్ మార్కులు: 87.35/100. ■ ఆలిండియా ర్యాంకు: 9
- గేట్ స్కోరు: 954
- పదో తరగతి మార్కులు: 85 శాతం.
- ఇంటర్మీడియెట్ మార్కులు: 92.2 శాతం.
- ఎంసెట్ ర్యాంకు 1321.
- బీటెక్‌లో 74 శాతం; ఎంటెక్‌లో 86 శాతం మార్కులు.

విద్య, ఉద్యోగ సమాచారం



ఏపీ పీఈసెట్-2018

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో 2018-19కి గాను ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సు (బీ.పీఈడీ, ఎం.పీఈడీ)ల్లో ప్రవేశానికి 'ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ పీఈసెట్)-2018' ద్వారా దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదలైంది. సంబంధిత కోర్సులను బట్టి ఇంటర్/డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ మార్చి 22, 2018 నుంచి ప్రారంభమవుతుంది. దరఖాస్తు రుసుం రూ.850(ఎస్సీ/ఎస్టీ-రూ.650). పూర్తి వివరాలకు వెబ్‌సైట్: sche.ap.gov.in

భెల్‌లో 12 లా ఆఫీసర్ పోస్టులు

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్).. 12 లా ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన విడుదల చేసింది. ❖ **పోస్టు:** లా ఆఫీసర్. ❖ **వేతనశ్రేణి:** రూ.24,900-రూ.50,500. ❖ **అర్హతలు:** బ్యాచిలర్ డిగ్రీ ఇన్ లా (బీఎల్/ఎల్ఎల్‌బీ). అలాగే కనీసం ఏడాది అనుభవం, క్లాట్-2018 పీజీ స్కోర్. ❖ **వయసు:** 2018, మార్చి 1 నాటికి 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **దరఖాస్తుల స్వీకరణ:** ఏప్రిల్ 2, 2018. ❖ **చివరి తేదీ:** మే 2, 2018. ❖ **వెబ్‌సైట్:** www.bhel.com

బ్రాత్‌వైట్ బర్న్ అండ్ జెస్సప్‌లో 8 ఖాళీలు

కోల్‌కతాలోని ది బ్రాత్‌వైట్ బర్న్ అండ్ జెస్సప్ (బీబీజే) కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్.. 8 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది దేశవ్యాప్తంగా నిర్మాణరంగ (రోడ్లు/బ్రిడ్జిలు..) కార్యకలాపాలకు ప్రసిద్ధి. కేంద్ర భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ❖ **పోస్టు:** అసిస్టెంట్ ఇంజనీర్ (ప్రాజెక్ట్). ❖ **అర్హతలు:** సివిల్‌లో బీఈ/బీటెక్/డీసీఈ. డీసీఈ అయితే కనీసం ఐదేళ్లు, బీఈ/బీటెక్ అయితే కనీసం మూడేళ్లు అనుభవం ఉండాలి. ❖ **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **వేతనం:** రూ.25,000. ❖ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్. ❖ **చివరి తేదీ:** నోటిఫికేషన్ వెలువడిన 15 రోజుల్లోపు. ❖ **వెబ్‌సైట్:** www.bbjconst.com

డీఐబీఈఆర్‌లో 12 ఖాళీలు

ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్‌లో ఉన్న డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయో ఎనర్జీ రీసెర్చ్ (డీఐబీఈఆర్)... 12 జేఆర్ఎఫ్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. డీఐబీఈఆర్.. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని డీఆర్‌డీవోకు చెందింది. ❖ **పోస్టు:** జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్). ❖ **విభాగాల వారీ ఖాళీలు:** కెమిస్ట్రీ-1, బయోటెక్నాలజీ/బయోకెమిస్ట్రీ/మైక్రోబయాలజీ-3, బోటనీ/లైఫ్ సైన్స్-2, ఫార్మకాలజీ-1, అగ్రికల్చరల్ సైన్స్-5. ❖ **అర్హతలు:** సంబంధిత విభాగాలను బట్టి పీజీ/బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్‌తోపాటు నెట్/గేట్/జీప్యాట్. ❖ **వయసు:** దరఖాస్తు గడువు ముగిసే నాటికి 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి. ❖ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్. ❖ **చివరి తేదీ:** ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో నోటిఫికేషన్ వెలువడిన 21 రోజుల్లోపు. ❖ **వెబ్‌సైట్:** www.drdo.gov.in

ఐఐటీ భువనేశ్వర్‌లో ఎంటెక్

ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ).. 2018-19కి ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ❖ **కోర్సు:** ఎంటెక్. ❖ **విభాగాలు-సీట్లు:** క్లైమేట్ సైన్స్ అండ్ టెక్నాలజీ-18, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్-12, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్-10, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్-18, పవర్ సిస్టమ్ ఇంజనీరింగ్-18, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్-18, మెకానికల్ సిస్టమ్ డిజైన్-18, థర్మల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-18, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్-12, వాటర్ రీసోర్సెస్ ఇంజనీరింగ్-12. ❖ **అర్హతలు:** సంబంధిత విభాగాలను బట్టి కనీసం 60 శాతం మార్కులు/తత్సమాన గ్రేడ్‌తో బీఈ/బీటెక్/ఎంఎస్సీతోపాటు గేట్ స్కోర్. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. ❖ **ఎంపిక:** గేట్ స్కోర్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ. ❖ **దరఖాస్తు రుసుం:** రూ.300; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ-రూ.150. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **చివరి తేదీ:** ఏప్రిల్ 10, 2018. ❖ **వెబ్‌సైట్:** www.iitbbs.ac.in

నిట్ హమీర్‌పూర్‌లో ఎంబీఏ

హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్).. 2018-20కి గాను ఎంబీఏలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ❖ **వ్యవధి:** రెండేళ్లు. ❖ **విభాగాలు:** ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్. ❖ **అర్హతలు:** కనీసం 60 శాతం (ఎస్సీ/ఎస్టీ-55 శాతం) మార్కులు/తత్సమాన గ్రేడ్‌తో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ. తుది సంవత్సరం/సెమిస్టర్ విద్యార్థులూ అర్హులే. ❖ **ఎంపిక:** రాతపరీక్ష (సీమ్యాట్/జీమ్యాట్ అభ్యర్థులకు మినహా), గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ. ❖ **దరఖాస్తు రుసుం:** రూ.1,000; ❖ **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్. ❖ **దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ:** ఏప్రిల్ 9, 2018. ❖ **వెబ్‌సైట్:** www.nith.ac.in

నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో కోర్సులు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఉన్న నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఎస్ఐ).. 2018కి వివిధ పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ❖ **కోర్సు-సీట్లు:** పీజీ డిప్లొమా-173 (ఏఎన్ఎస్ఐ (ఎస్‌టీ)-69+ఏఎన్ఎస్ఐ (ఎస్ఈ)-28+డీఐఎఫ్ఏటీ-28+డీఎస్‌పీ ఎంఎం-18+డీఐపీఏ-15+డీక్యూసీఈఎస్-15); షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్ కోర్స్ (ఎస్‌బీసీసీ)-57; షుగర్ ఇంజనీరింగ్ సర్టిఫికెట్ కోర్స్ (ఎస్ఈసీసీ)-15+సర్టిఫికెట్ కోర్స్ ఇన్ క్వాలిటీ కంట్రోల్ (సీసీక్యూసీ)-15; ఎఫ్ఎన్ఎస్ఐ (షుగర్ టెక్నాలజీ/షుగర్ కెమిస్ట్రీ), ఎఫ్ఎన్ఎస్ఐ (షుగర్ ఇంజనీరింగ్), ఎఫ్ఎన్ఎస్ఐ (ఫెర్మెంటేషన్ టెక్నాలజీ). ❖ **అర్హతలు:** సంబంధిత కోర్సులు, విభాగాలను బట్టి పదోతరగతి/ఇంటర్మీడియెట్/ఇంజనీరింగ్ డిప్లొమా/బీఎస్సీ/బీఎస్సీ అగ్రికల్చర్/బీఈ/బీటెక్. ❖ **దరఖాస్తు రుసుం:** ఎస్సీ/ఎస్టీ-రూ.800; మిగిలిన కేటగిరీలకు రూ.1,200; ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక, హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి గడువులోగా పంపాలి. ❖ **చివరి తేదీ:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తుకు మే 4, 2018; ఆన్‌లైన్ హార్డ్‌కాపీ చేరడానికి మే 14, 2018. ❖ **వెబ్‌సైట్:** nsi.gov.in

నైసర్ భువనేశ్వర్‌లో పీహెచ్‌డీ

ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైసర్).. తన పరిధిలోని వివిధ బేసిక్ సైన్స్ స్కూళ్లలో 2018-19 సమ్మర్ సెషన్‌కు పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ❖ **పరిశోధన విభాగాలు:** బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్. ❖ **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ఎంఈ/ఎంటెక్/తత్సమాన విద్య. ❖ **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **చివరి తేదీ:** మార్చి 26, 2018. ❖ **వెబ్‌సైట్:** www.niser.ac.in

నిఫ్ట్‌లో పీహెచ్‌డీ

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్).. పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ❖ **విభాగాలు:** డిజైన్, మేనేజ్‌మెంట్, టెక్నాలజీ. ❖ **అర్హతలు:** సంబంధిత విభాగాల్లో పీజీ. ❖ **ఎంపిక:** ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ. ❖ **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ-రూ.2,300; ఎస్సీ/ఎస్టీ-రూ.1,300. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీకి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి గడువులోగా పంపాలి. ❖ **దరఖాస్తు చేరడానికి చివరి తేదీ:** ఏప్రిల్ 20, 2018. ❖ **వెబ్‌సైట్:** www.nift.ac.in

ఐఐటీ బాంబేలో పీహెచ్‌డీ, పీజీ ప్రోగ్రామ్స్

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బాంబే (ఐఐటీబీ).. 2018-19 జూలై సెషన్‌కు వివిధ పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ❖ **కోర్సులు:** పీహెచ్‌డీ, ఎంటెక్, ఎంటెక్+పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ, ఎంఫిల్ (ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్), ఎంఎస్సీ-పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ (ఎనర్జీ). ❖ **అర్హతలు:** సంబంధిత కోర్సులు, విభాగాలను బట్టి మాస్టర్స్ డిగ్రీ/బ్యాచిలర్ డిగ్రీతోపాటు గేట్/సీడ్/జేఆర్ఎఫ్ (సీఎస్ఐఆర్/యూజీసీ/ఎన్‌బీహెచ్ఎం/ డీబీటీ/ఐసీఏఆర్/ఐసీఎంఆర్/ఐసీపీఆర్)/డీఎస్‌టీ ఇన్‌స్పైర్ ఫెలోషిప్/యూజీసీ-నెట్ లెక్చరర్‌షిప్ (ఎల్ఎస్) ఉండాలి. ❖ **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ. ❖ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్. ❖ **దరఖాస్తుల స్వీకరణ-ముగింపు:** పీహెచ్‌డీ, ఎంటెక్, ఎంటెక్+పీహెచ్‌డీ (డ్యూయల్ డిగ్రీ)కి.. మార్చి 20-ఏప్రిల్ 11, 2018; ఎంఫిల్‌కు ఏప్రిల్ 2-మే 7, 2018; ఎంఎస్సీ-పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ (ఎనర్జీ)కి ఏప్రిల్ 3-ఏప్రిల్ 17, 2018. ❖ **వెబ్‌సైట్:** www.iitb.ac.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
510 ▼	165 ▼
33,176	10,195

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	7,482	▲	1
డోజోన్స్	24,947	▲	73
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,164	▲	24
డాక్స్	12,390	▲	44
షాంఘై	3,270	▽	21
నికాయ్	21,677	▽	127

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	65.70	65.83
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	91.82	92.00
€	యూరో	ఎస్‌బీఐ	81.14	81.30
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	62.25	62.37
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.41	51.51
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	50.15	50.25
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.71	18.62
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	16.08	18.80
¥	చైనా యువాన్	థామస్‌కుక్	7.26	11.77

'ఫండ'ంటి బహుమతివ్వండి!

నేరుగా ఫండ్స్‌ను గిఫ్ట్ ఇచ్చే అవకాశం లేదు

కానీ ప్రత్యామ్నాయ మార్గాలు చాలానే ఉన్నాయ్

- ఎస్‌బీఐ బంధన్ ప్లాన్ అయితే క్రమంగా విత్‌డ్రా
- అందుబాటులో హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ చిల్డ్రన్ ప్లాన్లు
- కుటుంబ సభ్యులకు ఏ రూపంలో ఇచ్చినా పన్ను లేదు
- లాభాలపై మాత్రం తప్పనిసరిగా పన్ను చెల్లించాల్సిందే

స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్‌మెంట్లకు ఆదరణ పెరుగుతుండటంతో ఇటీవలి కాలంలో మ్యూచువల్ ఫండ్స్ చాలా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పొదుపుతో పాటు మంచి రాబడికి చక్కని సాధనాలుగా నిరూపించుకున్నాయి. అందుకే ఏటేటా ఫండ్స్‌లోకి వచ్చే పెట్టుబడుల్లో అనూహ్యమైన వృద్ధి కనిపిస్తోంది. ఈ పరిస్థితులు చూసి చాలా మందికి ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనిపిస్తోంది. వాటిని కుటుంబ సభ్యులకు కానుకగా ఇవ్వాలని కూడా కొందరు ఆశపడుతుంటారు. కాకపోతే ఇందుకు నిబంధనలు అనుమతించవు. అయినప్పటికీ ఫండ్స్ యూనిట్లను కానుకగా ఇచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు కొన్ని ఉన్నాయి. వాటిని తెలియజేసే కథనమే ఇది.

– సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం



బహుమతి అంటూ మీ బ్యాంకు ఖాతా నుంచి మీ జీవిత భాగస్వామి పేరిట నేరుగా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయటానికి నిబంధనలు అంగీకరించవు. ఎందుకంటే మ్యూచ్‌వల్ ఫండ్ సంస్థలు థర్డ్ పార్టీ పేమెంట్లను అనుమతించవు. అంటే! ఎవరి పేరిట కొంటారో వారి ఖాతా నుంచే నగదు చెల్లింపులు జరగాలి. ఒకవేళ మీ పేరిట మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి... కాల వ్యవధి ముగిశాక మీ జీవిత భాగస్వామి పేరిట ఫండ్ యూనిట్లను బదిలీ చేయటానికి కూడా అవకాశం లేదు. మ్యూచువల్ ఫండ్స్ ఎవరి పేరిట ఉంటాయో వారు గనక మరణించిన పక్షంలో మాత్రం ఆ యూనిట్లను వారసులకు బదిలీ చేసే అవకాశముంది.

ఇలాంటి పరిస్థితుల్లో ఫండ్స్ యూనిట్లను కానుకగా ఇవ్వాలంటే మీ ముందున్న ఆప్షన్...

- మీ పేరిట ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లి కాల వ్యవధి తీరాక రిడెంప్షన్ చేసుకుని... నగదు బ్యాంకులో జమయిన అనంతరం మీ జీవిత భాగస్వామికి కానుకగా ఇవ్వడమే.
- మీ జీవిత భాగస్వామి బ్యాంకు ఖాతాకు ప్రతి నెలా పెట్టుబడి మొత్తాన్ని తరలిస్తూ వారి పేరిట మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

నిజానికి ఈ రెండు మార్గాలూ అంత ఆకర్షణీయంగా అనిపించకపోవచ్చు. అందుకని అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు ఇలాంటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని పథకాలను అందిస్తున్నాయి. వీటిలో చిల్డ్రన్స్ పేరిట హెచ్‌డీఎఫ్‌సీ చిల్డ్రన్స్ గిఫ్ట్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ చైల్డ్‌కేర్ తదితర పథకాలను పరిశీలించొచ్చు. ఈ పథకాలు చాలా కాలంగా మార్కెట్లో అందుబాటులో ఉన్నవే. తమ పిల్లల పేరిట పెట్టుబడులకు అవకాశం కల్పించే గిఫ్ట్ పథకాలు ఇవి.

విభిన్న ఆప్షన్లు...



ఈ తరహా పథకాలు కొన్నింటిలో లాకిన్ పీరియడ్ ఉంటుంది. అంటే చిన్నారులకు 18 ఏళ్లు వచ్చే వరకు పెట్టుబడుల ఉపసంహరణకు వీలుండదు. పిల్లల ఉన్నత విద్య, వివాహ అవసరాలకు ఉపయోగపడాలన్నదే ఈ లాకిన్ పీరియడ్ ఉద్దేశం. అయితే, లాకిన్ పీరియడ్ లేకుండా ఎంచుకునే ఆప్షన్ కూడా ఉంది. ఇన్వెస్ట్ చేసే ముందే కంపెనీని ఈ విషయమై విచారించాలి. ఇక ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఇటీవలే బంధన్ పేరిట సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్‌ను ఆవిష్కరించింది. మ్యూచువల్ ఫండ్‌ను కానుకగా ఇవ్వాలనుకునే వారికి ఇది చక్కగా సరిపోతుంది. బంధన్ ఎస్‌డబ్ల్యూపీ ప్లాన్‌లో చేరిన వారు ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో నచ్చినదాన్ని ఎంచుకోవచ్చు. ఆ తర్వాత క్రమం తప్పకుండా ఇన్వెస్టర్ కుటుంబంలో ఒకరికి మ్యూచువల్ ఫండ్ సంస్థ చెల్లింపులు చేస్తూ ఉంటుంది. ఇన్వెస్ట్ చేసిన మొత్తం... ఎంచుకున్న పథకం... దానిపై వచ్చే రాబడుల ఆధారంగా చెల్లించే మొత్తం ఆధారపడి ఉంటుంది. నిర్ణీత తేదీన బ్యాంకు ఖాతాలో ఆ మొత్తం జమవుతుంది.

పన్నులు కూడా వర్తిస్తాయి...

మరొకరికి కానుకగా ఇవ్వడం అంటే ఒకరు చెల్లిస్తే మరొకరు ప్రయోజనం పొందడం. కాబట్టి ఇది పన్ను పరిధిలోకి వస్తుందో లేదో చూద్దాం...

- ఆదాయపన్ను చట్టం ప్రకారం బంధువు నుంచి బహుమతి పొందితే దానిపై పన్ను ఉండదు. బంధువులు అన్నదానికి తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి, తోడబుట్టిన వారు, జీవిత భాగస్వామికి తోడబుట్టిన వారు, తల్లిదండ్రులకు తోడబుట్టిన వారు అని చట్టం చెబుతోంది. ఇవే నిబంధనలు మైనర్ లబ్ధిదారులకూ వర్తిస్తాయి.
- బహుమతిపై పన్ను లేకపోయినప్పటికీ... డెట్, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాలపై స్వల్ప, దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నులంటూ ఉన్నాయి. వీటిని చెల్లించడం తప్పనిసరి.
- ఒకవేళ మీ జీవిత భాగస్వామి బ్యాంకు ఖాతాకు మీరు ప్రతి నెలా పెట్టుబడుల మొత్తం బదలాయించి ఆమె లేదా అతని పేరిట ఇన్వెస్ట్ చేస్తున్నట్టు అయితే లాభాలపై పన్నును నిబంధనల మేరకు లబ్ధిదారే చెల్లించాలి.
- ఒకవేళ మీ పేరిటే ఇన్వెస్ట్ చేసి కాల వ్యవధి తీరిన తర్వాత వెనక్కి తీసుకుని అప్పుడు ఆ మొత్తాన్ని కానుకగా ఇచ్చినట్టయితే గడించిన లాభంపై మీరే పన్ను చెల్లించాల్సి ఉంటుంది.
- మీ చిన్నారుల పేరిట మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసినప్పటికీ లాభాలపై నిబంధనల మేరకు పన్ను చెల్లించాలి. ఒకవేళ చిన్నారి మైనారిటీ తీరకముందే ఆ పెట్టుబడుల కాల వ్యవధి ముగిసిపోతే ఆ ఆదాయాన్ని పేరెంట్ ఆదాయంలో కలిపి చూపించాల్సి ఉంటుంది.

ఆదాయపన్ను చట్టంలోని నిబంధన ప్రకారం క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ అన్నది బదిలీ చేసే వ్యక్తికి సంబంధించినదని నాంజియా అండ్ కో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నేహ మల్హోత్రా చెప్పారు. ఈ విధంగా బదిలీ చేసిన వారు అవసరమైతే దాన్ని రద్దు చేసుకునే హక్కును కూడా కలిగి ఉంటారని ఆమె తెలియజేశారు. ఇక ఎస్‌బీఐ బంధన్ ప్లాన్‌లో పెట్టుబడులు పెట్టే వారు కూడా వారే పన్ను చెల్లించాల్సి ఉంటుందని క్లియర్ ట్యాక్స్ సీఈవో అర్చిత్ గుప్తా తెలిపారు.



పోర్ట్‌ఫోలియో సమీక్షించారా?

- కొత్త ఆర్థిక సంవత్సరం వచ్చేస్తోంది
- మార్కెట్లకు తగ్గట్టుగా మార్పుచేర్పులు అవసరం
- ఓ సారి పనితీరును మదింపు చేయడం మంచిది
- అలా చేయటం వల్ల రిస్క్‌ను తట్టుకోవచ్చు
- మారిన లక్ష్యాలకు అనుగుణంగా కేటాయింపులు కూడా

మరికొన్ని రోజుల్లో... అంటే ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం 2018–19 ప్రారంభం కానుంది. ఈక్విటీ మార్కెట్లు ఈ ఏడాది బాగానే ర్యాలీ చేసినా... తరువాత కొంత తగ్గాయి. మొత్తమ్మీద చూస్తే గతేడాది లాభదాయకమేనని చెప్పాలి. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరంలో రాబడులు ఏ మేరకున్నాయి, పోర్ట్‌ఫోలియోలో మార్పులు అవసరమా... లేదా? తదితర అంశాలపై ఓ సారి దృష్టి సారించడం ద్వారా వాటిల్లో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశముంటుంది. ఈక్విటీల్లో రాబడులకు తగ్గట్టుగా పెట్టుబడుల కేటాయింపుల్లో మార్పుచేర్పులు చేయడం తప్పనిసరి. దీనివల్ల మీ పోర్ట్‌ఫోలియోకు రిస్క్‌ను తట్టుకునే సామర్థ్యం వస్తుంది. ఇందుకు ఏం చేయాలనేదే ఈ 'ప్రాఫిట్ ప్లస్' కథనం...



మార్కెట్ల ర్యాలీతో ఫండ్స్ ఆకర్షణీయం...

మ్యూచువల్ ఫండ్స్ పట్ల ఇటీవలి కాలంలో సాధారణ ఇన్వెస్టర్లలోనూ ఆసక్తి పెరిగింది. మ్యూచుల్ ఫండ్స్ పథకాల్లోకి పెట్టుబడుల రాక పెరగడమే ఇందుకు నిదర్శనం. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో 2016 ఏప్రిల్‌లో రూ.3,122 కోట్లు ఫండ్స్ పథకాల్లోకి రాగా, 2017 ఏప్రిల్ నెలకొచ్చేసరికి ఇవి కాస్తా రూ.4,300 కోట్లకు పెరిగాయి. ఈ ఏడాది జనవరి నెలలో సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లోకి ఏకంగా రూ.6,644 కోట్ల నిధులు వచ్చి పడ్డాయి. ఇన్వెస్టర్ల ఫోలియోల సంఖ్యలోనూ భారీ వృద్ధి కనిపిస్తోంది. 2015 డిసెంబర్‌లో సుమారు 3.8 కోట్ల ఫోలియోలు ఉండగా, 2017 డిసెంబర్ నాటికి ఇవి 4.8 కోట్లకు చేరాయి. ఇక మ్యూచువల్ ఫండ్స్‌లో అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టే ఇన్వెస్టర్ల (హెచ్‌ఎన్ఐ) సంఖ్యలోనూ పెరుగుదల కనిపిస్తోంది. 2015 డిసెంబర్‌లో 8,60,000 మంది హెచ్‌ఎన్ఐలు ఉండగా, 2017డిసెంబర్ నాటికి 17 లక్షలకు చేరారు. అంటే దాదాపు రెట్టింపయ్యారు. ఒక ఇన్వెస్టర్ పెట్టుబడులకు సంబంధించి కేటాయించే సంఖ్యే ఫోలియో నంబర్. ఒకటికి మించిన ఫండ్స్ సంస్థల్లో పెట్టుబడులుంటే ఒకే ఇన్వెస్టర్‌కు ఒకటికి మించి ఫోలియోలుంటాయి.

అసెట్ అలోకేషన్‌ను సమీక్షించాలి...

ఫండ్స్‌లోకి ఈ స్థాయిలో పెట్టుబడులు రావటానికి ఈక్విటీ మార్కెట్ల ర్యాలీయే ప్రధాన ఇంధనమని చెప్పుకోవాలి. 2017లో బీఎస్‌ఈ సెన్సెక్స్ 28 శాతం, బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 48 శాతం, బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 60 శాతం చొప్పున పెరిగాయి. వాస్తవానికి ఇలా మార్కెట్లు పెరుగుతున్న కొద్దీ, పెట్టుబడులపై రాబడులు అధికం అవుతుంటాయి. అంటే ఆ మేరకు ఇన్వెస్టర్లు ఎక్స్‌పోజర్‌ను తగ్గించుకోవాలి. దీన్నే పోర్ట్ ఫోలియో రీబ్యాలన్స్‌గా చెబుతారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ మార్కెట్ల ర్యాలీ నేపథ్యంలో అసెట్ అలోకేషన్‌ను (పెట్టుబడుల కేటాయింపులు) ఓ సారి సమీక్షించుకోవాలనేది నిపుణుల సూచన. ''గడిచిన రెండేళ్లలో భారత ఈక్విటీ మార్కెట్లు ర్యాలీ చేశాయి. ఇన్వెస్టర్ల పెట్టుబడి విలువ గణనీయంగా పెరిగింది. దీనర్థం ఈక్విటీలు బాగా ఖరీదయ్యాయి. అమెరికా, యూరోప్, జపాన్‌లో బాండ్ ఈల్డ్స్ పెరుగుతున్నాయి. దీంతో అక్కడ వడ్డీ రేట్లు పెరుగుతాయి'' అంటూ క్రెడిట్ సూసీ వెల్త్ మేనేజిమెంట్ ఇండియా ఫండ్స్ హెడ్ కునాల్ వాలియా కొన్ని సూచనలు చేశారు. అవి...

- ఈక్విటీల్లో అధిక పెట్టుబడులకు దూరంగా ఉండటం మంచిది.
- మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో పెట్టుబడులు తగ్గించుకోవాలి
- డెట్ ఫండ్స్‌లో రాబడులు పెరుగుతున్నందున కార్పొరేట్ బాండ్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు.

లక్ష్యాలకు తగ్గ బడ్జెట్



మీ దగ్గర సమగ్రమైన ఆర్థిక ప్రణాళిక ఉంటే చాలదు. ఎందుకంటే కొత్త లక్ష్యాలు మీ ముందుకు రావచ్చు. అప్పటికే కొన్ని లక్ష్యాలను దాటిపోవచ్చు. కొత్తగా రుణాలు తీసుకుని ఉండొచ్చు. వీటన్నింటికీ బడ్జెట్‌లో చోటు కల్పించాలి. ఈ విషయమై మ్యాక్స్ ఫైనాన్షియల్ ప్లానర్స్ వ్యవస్థాపకుడు ప్రకాశ్ ప్రహరాజ్ మాట్లాడుతూ... ఓ క్లయింట్ అనుభవాన్ని తెలియజేశారు. ''ఓ వ్యక్తి తన కుమారుడి విదేశీ చదువుల కోసం రూ.25 లక్షల విద్యా రుణం తీసుకున్నాడు. విదేశీ యూనివర్సిటీకి తొలి ఏడాదే అన్ని ఫీజులు కట్టాలి కదా!! దాంతో రుణాన్ని నాలుగు వాయిదాలుగా మొదటి ఏడాదిలోనే త్రైమాసికోసారి ఇచ్చేందుకు బ్యాంకు అంగీకరించింది. రెండు వాయిదాలిచ్చాక కొర్రీ వేసింది. తిరిగి ఐదో ఏడాదిలోనే ఇస్తానని స్పష్టం చేసింది. బ్యాంకు ఇంటర్నల్ ఆడిట్ బృందం అభ్యంతరాలతో అనూహ్యమైన నిర్ణయం తీసుకుంది. దీన్ని అతడు ఊహించలేదు. దీంతో అతడి అంచనాలు తప్పాయి. తన సొంత నిధుల నుంచి సర్దుబాటు చేసుకోవాల్సి వచ్చింది. అతడు తన పోర్ట్‌ఫోలియో, పెట్టుడులను సమీక్షించుకోవాల్సి వచ్చిం ది'' అని ప్రకాశ్ ప్రహరాజ్ తెలిపారు. ఈ పరిస్థితితో సదరు వ్యక్తి తన కుమారుడి విదేశీ విద్యా ఫీజులు కట్టేందుకు తన రిటైర్మెంట్ నిధి నుంచి, తన కుమార్తె వివాహ అవసరాల కోసం ఏర్పాటు చేస్తున్న నిధి నుంచి సర్దుబాటు చేసుకున్నారని ప్రకాశ్ చెప్పారు.

కేటాయింపులు మారాలి...

ఇక ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగులకు సాధారణంగా వేతన పెంపు ఉంటుంది. అయినప్పటికీ చాలా మంది తమ పెట్టుబడుల్లో మార్పులకు చొరవ తీసుకోరు. దీంతో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పెట్టుబడుల మొత్తం వృద్ధి ఉండదు. అందుకే ఏటా వేతనం పెంపు స్థాయిలో పెట్టుబడులను కూడా పెంచుకోవాలని ప్రహరాజ్ సూచించారు. సిప్ రూపంలో పెట్టుబడుల మొత్తాన్ని పెంచుకోవచ్చన్నారు.

నామినేషన్, విల్లు



చాలా మంది చేసే తప్పు నామినేషన్‌ను పట్టించుకోకపోవడం లేదా నిర్లక్ష్యం వహించడం. కానీ, ప్రతీ పెట్టుబడి సాధనానికి నామినేషన్ ఇవ్వడం ఎంతో అవసరమైనదనేది ఆర్థిక నిపుణుల సూచన. పెట్టుబడి పెట్టే వ్యక్తికి అనుకోనిది ఏదైనా జరిగితే వారి పేరిట ఉన్న పెట్టుబడులు సరైన వారి చేతికి, జాప్యం లేకుండా సకాలంలో అందుతాయి. ఇందుకు విల్లు రాయడం కూడా మంచి ఆలోచనే. కోరుకున్న విధంగా పెట్టుబడులు, ఆస్తులు సరైన వారి చేతికి చేరేందుకు విల్లు వీలు కల్పిస్తుంది. ఒకరికి మించి పంపకం జరగాలని ఆశించినా ఆ మేరకు విల్లు రాసుకోవచ్చు. నామినేషన్ అన్నది ట్రస్టీలాంటిది. నామినీ అంటే వారసులే కావాలని లేదు. ఒకవేళ నామినీగా వారసుల్లో ఒకరి పేరును చేర్చినప్పటికీ మీ తదనంతరం వారికి బదిలీ అయిన ఆస్తులను వారసులందరికీ సమానంగా పంపిణీ చేయాల్సిన బాధ్యత నామినీపై ఉంటుంది.

మీ డివిడెండ్ మీకు చేరిందా?



- లేదంటే కంపెనీ దగ్గరే ఉండి ఉంటుంది
- వివరాలు కంపెనీ వెబ్‌సైట్లో ఉంటాయి
- ఏడేళ్ల వరకూ కంపెనీ డివిడెండ్ ఖాతాలోనే
- ఆ తర్వాత ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్‌కు బదిలీ
- ఈ లోపు ఎప్పుడైనా క్లెయిమ్ చేసుకోవచ్చు

వ్యాపార కార్యకలాపాలు సజావుగా సాగించే కంపెనీలన్నీ దాదాపుగా తమ వాటాదారులకు ఏటా కొంత లాభాన్ని డివిడెండ్ రూపంలో పంపిణీ చేస్తుంటాయి. కొన్ని కంపెనీలు ప్రతి మూడు నెలలకూ ఎంతో కొంత డివిడెండ్ చెల్లిస్తాయి కూడా. ఇప్పుడు ఆన్‌లైన్ డీమ్యాట్ ఖాతాలు వచ్చాయి కనక దాదాపు అన్ని కంపెనీలూ డివిడెండ్లను నేరుగా బ్యాంకు ఖాతాలకే జమ చేస్తున్నాయి. కొన్ని కంపెనీలు మాత్రం ఇంకా డివిడెండ్ వారెంట్లను జారీ చేయటం జరుగుతోంది. ఈ డివిడెండ్ వారెంట్లు వాటాదారు చిరునామాకు నేరుగా వెళతాయి. వాటిని బ్యాంకులో జమ చేసుకోవాల్సి ఉంటుంది. చిరునామా మారినా కొత్తది తెలియజేయని వారు... మరణించిన వాటాదారుల పేరిట జారీ అయిన డివెండ్ వారెంట్లు క్లెయిమ్ చేసుకోకుండా అలాగే ఉండిపోతాయి. ఏడేళ్ల తరవాత ఆ మొత్తాన్ని కంపెనీలు ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్‌కు (ఐఈపీఎఫ్) బదిలీ చేస్తాయి. ఈ ఫండ్‌ను సెబీ ఏర్పాటు చేసింది. ఇన్వెస్టర్లలో అవగాహన కల్పించడమే కాక వారి ప్రయోజనాల పరిరక్షణకు ఈ నిధులు ఖర్చు చేస్తారు. ఈ నేపథ్యంలో చట్ట ప్రకారం తమకు రావాల్సిన డివిడెండ్‌ను పొందడం ఎలాగో ఒకసారి చూద్దాం...

లిస్టెడ్ కంపెనీలు డివిడెండ్‌ను క్లెయిమ్ చేసుకోని వాటాదారుల వివరాలను కచ్చితంగా తమ వెబ్‌సైట్లలో ప్రదర్శించాలి. పేరు, రికార్డుల్లో నమోదై ఉన్న వారి చిరునామా, ఎంత మేర డివిడెండ్ పెండింగ్‌లో ఉంది తదితర వివరాలను ప్రతి కంపెనీ ఏటా వార్షిక వాటాదారుల సమావేశం ముగిసిన తర్వాత 90 రోజుల్లోపే వెబ్‌సైట్‌లో ఉంచాలి. ఇలా క్లెయిమ్ చేసుకోని వాటాదారుల వివరాలను వరుసగా ఏడేళ్ల పాటు వెబ్‌సైట్‌లో ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ వివరాలను సరిచూసుకుని తమ పేరు గనక ఉంటే సంబంధిత డివిడెండ్ కోసం క్లెయిమ్ చేసుకోవాలి. లేదంటే ఏడేళ్ల తర్వాత ఆ మొత్తం ఐఈపీఎఫ్‌కు బదిలీ అవుతుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అసోసియేట్ డైరెక్టర్ కె.వి.సునీల్ కుమార్ చెప్పారు.

డివిడెండే కాదు, రిఫండ్లు కూడా...




ఒక్క డివిడెండే కాదు, షేర్ల కోసం ఇన్వెస్టర్లు దరఖాస్తు చేసుకున్నప్పుడు చెల్లించిన మొత్తాన్ని ఒకవేళ ఆ మేరకు షేర్లు అలాట్ చేయలేకపోతే కంపెనీలు వెనక్కిచ్చేయాల్సి ఉంటుంది. అలా చెల్లించాల్సి ఉన్న నిధులు, కాల వ్యవధి తీరిన డిపాజిట్లు, డిబెంచర్లు, వాటిపై వడ్డీ సైతం కంపెనీ వద్దే ఉండిపోతే ఆ నిధులను కూడా నిబంధనల మేరకు ఐఈపీఎఫ్‌కు బదిలీ చేయాలని సునీల్ వెల్లడించారు. ''సెక్షన్ 124(5) ప్రకారం ఏడు సంవత్సరాల వ్యవధిలోపు ఎప్పుడు ఇన్వెస్టర్ క్లెయిమ్ చేసుకున్నా ఆ మొత్తం వారికి చెల్లించడం జరుగుతుంది'' అని ఆయన తెలిపారు.

క్లెయిమ్ ప్రక్రియ ఇలా...



ఐఈపీఎఫ్–5 అనే డాక్యుమెంట్‌ను (http://www.iepf.gov.in) వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇన్వెస్టర్లు లేదా డివిడెండ్ ఆదాయం కోసం క్లెయిమ్ చేసుకునే వారు దరఖాస్తులో అన్ని వివరాలనూ పొందు పరచాల్సి ఉంటుంది. ఇందులో క్లెయిమ్ చేసుకుంటున్న వారి పేరు, కంపెనీ పేరు, షేర్లకు సంబంధించిన వివరాలు, ఆధార్ నంబర్, ఎన్ని క్లెయిమ్‌లు, బ్యాంకు ఖాతా, డీమ్యాట్ ఖాతా వివరాలు అన్నీ ఇవ్వాలి. ఈ వివరాలన్నీ పూర్తి చేసిన తర్వాత ఆ దరఖాస్తును తిరిగి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం ఎంసీఏ21కు పేజీ రీడైరెక్ట్ అవుతుంది. ఇక్కడ సర్వీస్ రిక్వెస్ట్ నంబర్ జారీ అవుతుంది. దీన్ని భవిష్యత్తులో విచారణల కోసం సేవ్ చేసుకోవడం మంచిది. ఇక్కడే పేమెంట్ ఆప్షన్ ఉంటుంది. ఫీజు ఉన్నా, లేకపోయినా గానీ పే ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. అప్పుడు ఆన్‌లైన్ అక్నాలెడ్జ్‌మెంట్ అందుతుంది. ఆ తర్వాత క్లెయిమ్ ఫామ్, అక్నాలెడ్జ్‌మెంట్ కాపీలను, ఇండెమ్నిటీ బాండ్‌తో కలిపి ఐఈపీఎఫ్ నోడల్ ఆఫీసర్‌కు అందజేయాలి. క్లెయిమ్ అందిన తర్వాత కంపెనీ 15 రోజుల్లోపు ఐఈపీఎఫ్‌కు వెరిఫికేషన్ రిపోర్ట్ అందచేస్తుందని సునీల్‌కుమార్ తెలిపారు. ఒకవేళ షేర్లు బకాయి ఉంటే వాటిని డీమ్యా ట్ ఖాతాకు బదిలీ చేయడం లేదా ఫిజికల్ సర్టిఫికెట్లను అందజేయడం జరుగుతుందన్నారు. వెరిఫికేషన్ రిపోర్ట్ అందిన తేదీ నుంచి 60 రోజుల్లోపు తిరిగి చెల్లించడం పూర్తవుతుంది.



"ఎప్పుడూ ఒకే ఆదాయ మార్గంపై ఆధారపడొద్దు. ఇన్వెస్ట్‌మెంట్‌ను మరొక ఆదాయ మార్గంగా మార్చుకో."
- వారెన్ బఫెట్

పొదుపు-మదుపు



టాటా రిటైర్మెంట్ సేవింగ్స్ ఫండ్ - కన్జర్వేటివ్ ప్లాన్

రక్షణకు రక్షణ.. రాబడికి రాబడి

రిటైర్మెంట్ జీవితానికి కావాల్సిన నిధిని సమకూర్చుకునేందుకు హామీ కూడిన పథకాలు, మార్కెట్ లింక్డ్ ఈఎల్ఎస్ఎస్ పథకాలు ఎన్నో ఉన్నాయి. పీపీఎఫ్, యులిప్ ప్లాన్లు, ఎన్‌పీఎస్ పథకాలు సైతం అందుబాటులో ఉన్నవే. రిటైర్మెంట్ అవసరాల కోసం రిస్క్ తక్కువగా ఉండి, మంచి రాబడులను ఆశించే వారు పరిశీలించతగిన వాటిలో టాటా రిటైర్మెంట్ సేవింగ్స్ ఫండ్- కన్జర్వేటివ్ ప్లాన్ ఒకటి. రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్నవారు, రిటైర్మెంట్ తర్వాతా కొంచెం అదనపు రాబడులను ఆశించే వారు కూడా ఈ పథకాన్ని పరిశీలించొచ్చు. తక్కువ నుంచి మోస్తరు రిస్క్ ప్రొఫైల్ వారికి ఇది అనువైనది.



పథకం నిర్వహణలోని మొత్తం నిధుల్లో 70శాతాన్ని తీసుకెళ్లి డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. దీంతో పెట్టుబడుల్లో అధిక భాగానికి రక్షణ ఉన్నట్టే. ఇక మిగిలిన 30 శాతాన్ని ఈక్విటీలకు కేటాయిస్తుంది. ఇది మాత్రమే రిస్క్‌తో కూడినది. దీర్ఘకాలంలో ఇందులో రిస్క్ సగటున పరిమితమై రాబడులకు అవకాశం ఉంటుంది. ఇక రిటైర్మెంట్ కోసమని పూర్తిగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తున్న వారు రిటైర్మెంట్‌కు సమీపిస్తున్న వేళ రిస్క్ తగ్గించుకోవాలని భావిస్తే ఈ పథకంలో మారిపోవడాన్ని పరిశీలించొచ్చు. దీంతో రిస్క్ తగ్గుతుంది. అయితే, టాటా రిటైర్మెంట్‌సేవింగ్స్ ఫండ్‌లో 60 ఏళ్లు రాకుండా వైదొలగాలని భావిస్తే కార్పస్‌పై 3 శాతాన్ని ఎగ్జిట్ లోడ్ కింద భరించాలి. ఇదొక్కటి ప్రతికూలత. 60 దాటితే ఎగ్జిట్‌లోడ్ ఉండదు.

మెరుగైన పనితీరు...

ఇది హైబ్రిడ్, డెట్ ఆధారిత అగ్రెస్సివ్ విధానంలో ఇన్వెస్ట్ చేస్తుంది. ఈక్విటీలకు 25-30 శాతం మించి కేటాయింపులు చేయదు. దీంతో అన్ని కాలాల్లోనూ మెరుగైన పనితీరు ప్రదర్శించింది. ఏడాదిలో 9 శాతం రాబడులు ఇచ్చింది. మూడేళ్లలో చూసుకుంటే 8.5 శాతం, ఐదేళ్ల కాలంలో సగటున 11.4 శాతం వార్షిక రాబడులను ఇచ్చింది. గడిచిన ఏడు సంవత్సరాల కాలంలో అన్ని రకాల వడ్డీ రేట్లలోనూ చెప్పుకోతగ్గ రాబడులను అందించింది. వడ్డీ రేట్లు పెరుగుతున్న కాలంలోనూ నష్టాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంది. అధిక రేటింగ్ కలిగిన డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం, పెట్టుబడుల వ్యూహాలే ఇందుకు కారణం. ఇక వడ్డీ రేట్లు పెరిగిన 2013 మే నుంచి 2014 ఏప్రిల్ వరకు, 2017 జూలై నుంచి 2018 ఫిబ్రవరి వరకు చూసుకున్నా రాబడులు 6.8 శాతం, 2.6 శాతం చొప్పున ఉన్నాయి.



ఈక్విటీ టాప్ హోల్డింగ్స్


కంపెనీ	పెట్టుబడుల కేటాయింపు (శాతంలో)
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	1.50
యెస్‌బ్యాంకు	1.40
హెచ్‌డీఎఫ్‌సీ	1.19
ఎల్‌అండ్‌టీ	1.18
మారుతి సుజుకి	0.96
పవర్‌గ్రిడ్	0.95
ఫ్యూచర్ రిటైల్	0.87

పోర్ట్‌ఫోలియో... డెట్‌లోనే అధికం

ప్రస్తుతం ఈక్విటీలో పెట్టుబడులు 29 శాతంగా ఉంటే, డెట్‌లో 71 శాతం ఇన్వెస్ట్ చేసి ఉంది. ఈక్విటీ ర్యాలీల్లోనూ చురుగ్గా పాల్గొంటోంది. ఇక డెట్ సాధనాల్లో యాక్రువల్, డ్యురేషన్ థీమ్‌లను అనుసరిస్తుంది. 2014 బాండ్ ర్యాలీలో సగటు బాండ్ల కాల వ్యవధి 12 ఏళ్లు ఉండేలా చూసుకుంది.

● బ్రీఫ్స్...

ఫ్యూచర్ జెనరాలి... వేగంగా మోటార్ క్లెయిమ్



ఫ్యూచర్ జెనరాలి ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ తాజాగా 'ఐ-విస్' (ఇంటెలిజెంట్ వీడియో స్ట్రీమింగ్ అండ్ సెటిల్‌మెంట్) పేరుతో వీడియో ఆధారిత మోటార్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ సౌకర్యాన్ని కస్టమర్లకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వినియోగదారులు ఇందులో భాగంగా రూ.50,000 వరకు మోటార్ ఇన్సూరెన్స్ క్లెయిమ్స్‌ను వేగంగా పొందొచ్చని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. కంపెనీ లైవ్ వీడియో స్ట్రీమింగ్ ద్వారా వెహికల్ నష్టాన్ని అంచనా వేస్తుంది.

ఐ-విస్ ఎలా పనిచేస్తుందంటే..

కస్టమర్ క్లెయిమ్ కోసం కంపెనీ కాల్ సెంటర్‌కు కాల్ చేయాలి. అప్పుడు అతని స్మార్ట్‌ఫోన్‌కి టెక్స్ట్ మెసేజ్ రూపంలో ఐ-విస్ లింక్ వస్తుంది. దానిపై క్లిక్ చేసి కంపెనీ ప్రతినిధితో మాట్లాడాలి. లైవ్ వీడియోలో వెహికల్ డ్యామేజ్‌ను అతనికి చూపించాలి. తర్వాత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి. అప్పుడు కంపెనీ క్లెయిమ్ అమౌంట్‌ను కస్టమర్ బ్యాంక్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తుంది.

ఆదిత్య బిర్లా హెల్త్ నుంచి కొత్త ఆరోగ్య బీమా



ఆదిత్య బిర్లా క్యాపిటల్‌కు చెందిన హెల్త్ ఇన్సూరెన్స్ విభాగం 'ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్' తాజాగా కొత్త ఆరోగ్య బీమా పాలసీ 'యాక్టివ్ అస్యూర్'ను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. పాలసీలో భాగంగా గరిష్టంగా ఇద్దరు పెద్ద వారితో సహా నలుగురు చిన్నారులకు బీమా తీసుకోవచ్చని, ఒక సింగిల్ పాలసీలో 25 సంవత్సరాల వయసున్న వారిని కూడా చిన్నారులుగా పరిగణిస్తామని సంస్థ సీఈవో మయాంక్ భత్వాల్ తెలిపారు. తాజా పాలసీలో ప్రధానంగా ఇంటర్నేషనల్/డొమెస్టిక్ ఎమర్జెన్సీ అసిస్టెన్స్ సర్వీసెస్, హెల్త్ రిటర్న్స్, రిలోడ్ వంటి ప్రత్యేకతలున్నాయి. హెల్త్ రిటర్న్స్‌లో భాగంగా కస్టమర్లు చెల్లించిన ప్రీమియంలో 30 శాతం వరకు ప్రోత్సాహకాల రూపంలో తిరిగి పొందొచ్చు.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, మార్చి 8 నాటికి (అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1-2 ఏళ్లు	5 ఏళ్లు, ఆపైన
ఆంధ్రా బ్యాంక్	6.25	6.50	6.25
యాక్సిస్ బ్యాంక్	6.25-6.5	6.75-6.90	6.90
బ్యాంక్ ఆఫ్ బరోడా	5.5-6.35	6.6-6.7	6.6-6.7
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.60	6.25
కెనరా బ్యాంక్	6.35	6.45-6.5	6.00
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.50	6.60	6.50
కార్పొరేషన్ బ్యాంక్	6-6.25	6.5-6.7	6.50
డీసీబీ బ్యాంక్	7.00	7-7.15	7.2-7.25
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.75-6.25	6.25-6.75	6.00
ఐసీఐసీఐ బ్యాంక్	6-6.50	6.6-6.75	6.50
ఐడీబీఐ బ్యాంక్	6-6.5	6.5-6.75	6.00
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	5.75-6.25	6.50-6.75	6.00
ఇండస్‌ఇండ్ బ్యాంక్	6.25-6.7	6.8-7	6.50
కోటక్ మహీంద్రా బ్యాంక్	6.6-6.7	6.7-6.9	6.25
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.25-6.5	6.60	6.40
ఎస్‌బీఐ	6.35-6.4	6.4	6.50
సిండికేట్ బ్యాంక్	6.25	6.75	6.50

మరింత సమాచారం కోసం www.bankbazaar.com పై క్లిక్ చేయండి

పసిడికి కీలకం... ఈ వారం ఫెడ్ నిర్ణయం!

వారంలో పది డాలర్లు పతనం • 1,314 డాలర్ల వద్ద ముగింపు • పెరుగుదలపై మిశ్రమ స్పందన...

అంతర్జాతీయ కమోడిటీ ఎక్స్ఛేంజ్- నైమెక్స్‌లో వారంలో పసిడి ఔన్స్ (31.1గ్రా) 10 డాలర్లు తగ్గి 1,314 డాలర్ల వద్ద ముగిసింది. ఇదే వారంలో డాలర్ ఇండెక్స్ స్వల్పంగా ఎగసి 90.11 నుంచి 90.17కు చేరింది. 1,360 డాలర్లను తాకిన పసిడి నాలుగు వారాలుగా తగ్గుతూ వస్తోంది. అమెరికా సెంట్రల్ బ్యాంక్- ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేటుకు సంబంధించి బుధవారం తీసుకునే నిర్ణయం పసిడి నడత దిశలో కీలకమని నిపుణులు పేర్కొంటున్నారు. రేటు పెంపు ఉంటుందని మెజారిటీ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. పావుశాతం రేటు పెంచితే 1.50-1.75 శాతం శ్రేణికి ఫెడ్ ఫండ్ రేటు పెరుగుతుంది. ఇదే జరిగితే ఈ ఏడాది ఇది మొట్టమొదటి పెంపు అవుతుంది. మొత్తం మీద ఆయా దిశలో నిర్ణయాలు పసిడిపై ప్రభావం చూపుతాయని విశ్లేషకుల అంచనా. ప్రస్తుత గృహ విక్రయాలు, డ్యూరబుల్ గూడ్స్ విక్రయాల వంటి కీలక అమెరికా గణాంకాలు కూడా వచ్చే వారం వెలువడనున్నాయి.

మూడు కీలక అంశాలు...: రానున్న కొద్ది రోజుల్లో మూడు ప్రధాన అంశాలు పసిడిపై ప్రధానంగా ప్రభావం చూపే అవకాశం ఉందన్నది నిపుణుల విశ్లేషణ. ఫెడ్ ఫండ్‌రేటు పెంచితే, పసిడి ధర పడిపోతుందని అంత తేలిగ్గా చెప్పలేమన్నది వారి వాదన. అమెరికా ఆర్థిక వ్యవస్థ క్షేత్ర స్థాయిలో రేటు పెంపునకు సానుకూలంగా స్పందించకపోతే, పసిడి ధర ముందుకు దూసుకుపోవడం ఖాయమన్నది వారి అభిప్రాయం. ఇక అమెరికా ప్రారంభించిన అంతర్జాతీయ వాణిజ్య యుద్ధం- అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థలపై దీని ప్రభావం, అలాగే భౌగోళిక ఉద్రిక్తతలు వంటి అంశాలూ పసిడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆయా ప్రభావ అంశాల నేపథ్యంలో సమీప భవిష్యత్తులో పసిడి 1,250 డాలర్లు - 1,400 డాలర్ల స్థాయిలోనే తిరిగే అవకాశం ఉందన్నది నిపుణుల అభిప్రాయం. 1,300, 1,270, 1,240 డాలర్ల వద్ద పసిడికి పటిష్ట మద్దతు ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక ఎగువస్థాయిలో తక్షణ నిరోధం 1,365 డాలర్లు.

దేశంలో స్వల్ప నష్టాలు...: అంతర్జాతీయంగా పసిడి 10 డాలర్లు తగ్గినప్పటికీ, అంత స్థాయిలో దేశీయంగా పడలేదు. డాలర్ మారకంలో రూపాయి బలహీనత (వారం వారీగా 13 పైసలు నష్టంతో 65.07) దీనికి కారణం. ఫ్యూచర్స్ మార్కెట్- ఎంసీఎక్స్‌లో వారంలో పసిడి 10 గ్రాముల ధర స్వల్పంగా రూ.177 తగ్గి, రూ.30,224కి చేరింది. ఇక దేశీయంగా ముంబై ప్రధాన స్పాట్ మార్కెట్‌లో పసిడి వారం వారీగా 99.9 స్వచ్ఛత ధర రూ. 85 నష్టంతో రూ.30,460కు తగ్గింది. వెండి కేజీ ధర రూ. 110 నష్టంతో రూ.38,275కి దిగింది.



మ్యూచువల్ ఫండ్స్

పెట్టుబడుల్లో క్షీణత

ఫిబ్రవరిలో రూ.8,900 కోట్లు తగ్గుదల

న్యూఢిల్లీ: దేశీయ మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని పెట్టుబడుల విలువ ఫిబ్రవరిలో రూ.8,900 కోట్ల మేర క్షీణించింది. మార్కెట్ గరిష్టస్థాయి నుంచి క్షీణించడం ప్రధాన కారణంకాగా, రిటైల్, హెచ్ఎన్ఐ (అధిక విలువ కలిగిన) ఇన్వెస్టర్ల నుంచి పెట్టుబడుల రాక తక్కువగా ఉండడం మరో కారణం. ఇక ఫిబ్రవరి నాటికి దేశీయంగా అన్ని మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.18,68,404 కోట్లుగా ఉంది. జనవరిలో ఇది రూ.18,77,303 కోట్లు కావడం గమనార్హం. చారిత్రకంగా చూస్తే బడ్జెట్ తర్వాతి నెలలో మార్కెట్ బలహీనంగా ఉంటుందోని, ఈ ఏడాది ఫిబ్రవరి కూడా ఇందుకు మినహాయింపేమీ కాదని రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ సీఈవో సందీప్ సిక్కా తెలిపారు. ''దేశీయ ఆర్థిక వృద్ధి దీర్ఘకాలానికి చెక్కు చెదరలేదు. కార్పొరేట్ ఆదాయాలు పుంజుకునే క్రమంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత కరెక్షన్... రిటైల్ ఇన్వెస్టర్లు తిరిగి వచ్చేందుకు లేదా మ్యూచువల్ ఫండ్స్‌కు కేటాయింపులు పెంచుకునేందుకు ఓ అవకాశం. 2018-19లోనూ ఇన్వెస్టర్ల సంఖ్య ఎప్పటిలాగే వృద్ధి చెందుతుంది'' అని సందీప్ సిక్కా వివరించారు. ఇక, టాప్-10 ఫండ్ సంస్థలను గమనిస్తే ఆరు సంస్థల పెట్టుబడుల విలువ క్షీణించినట్టు తెలుస్తోంది. అయితే, కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్, యాక్సిస్ మ్యూచువల్ ఫండ్, రిలయన్స్ మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ నిర్వహణ ఆస్తుల విలువ పెరగడం గమనార్హం.



స్టాక్స్ వ్యూ


టాటా పవర్ — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: యాక్సిస్ డైరెక్ట్
ప్రస్తుత ధర: రూ.80
టార్గెట్ ధర: రూ.136

ఎందుకంటే: టాటా గ్రూప్‌కు చెందిన ఈ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలానికి అంచనాలను మించిన ఆర్థిక ఫలితాలను వెల్లడించింది. ముంద్రా యాఎమ్‌పీపీ(అల్ట్రామెగా పవర్ ప్లాంట్) నష్టాలు అంచనాల కంటే తక్కువగా ఉండటంతో ఈ కంపెనీ రూ.630 కోట్ల నికర లాభం సాధించింది. బొగ్గు ఆధారిత ప్లాంట్ల వ్యాపార విభాగం ఇబిటా 55% వృద్ధి చెందింది. పునరుత్పాదన విభాగం నిలకడైన వృద్ధిని సాధించింది. అంతే కాకుండా ఈ విభాగం పనితీరు పటిష్టంగా ఉంది. ఈ క్యూ3లో 227 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తిని సాధించింది. ఈ పునరుత్పాదన విద్యుత్ విభాగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల కాలానికి రూ.1,460 కోట్ల ఇబిటాను సాధించింది. కీలకం కాని ఆస్తులను పునర్వ్యవస్థీకరిస్తోంది. దీంట్లో భాగంగా కీలకం కాని విభాగాలు-రక్షణ, మౌలిక, టాటా కమ్యూనికేషన్స్, పెనటోన్, టాటా సెరామిక్స్‌ల్లో వాటాలను పూర్తిగా విక్రయించనున్నది. పెనటోన్ విభాగాన్ని టాటా సన్స్‌కు విక్రయించే ప్రక్రియ ఇటీవలే ప్రారంభమైంది. ఈ కీలకం కాని వ్యాపార విభాగాల విక్రయం వల్ల కంపెనీకి రెండేళ్లలో రూ.8,000 కోట్ల నిధులు సమకూరుతాయని అంచనా. గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి నికర రుణ భారం రూ.46,300 కోట్లుగా ఉంది. కీలకం కాని ఆస్తుల విక్రయం ద్వారా ఈ రుణ భారాన్ని వీలైనంతగా తగ్గించుకోవాలని కంపెనీ యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. పునరుత్పాదన విద్యుత్ విభాగం పనితీరు పటిష్టంగా ఉండడం, టాటా ప్రాజెక్ట్స్‌లో ఈ కంపెనీకి 48% వాటా ఉండడం, రుణ భారం తగ్గించుకునే ప్రయత్నాలు తదితర సానుకూలాంశాల నేపథ్యంలో ఈ షేర్ ఏడాది కాలంలో రూ.136ను చేరుతుందని అంచనా వేస్తున్నాం.

లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్ అండ్ టీ) — కొనొచ్చు



బ్రోకరేజ్ సంస్థ: జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్
ప్రస్తుత ధర: రూ.1,268
టార్గెట్ ధర: రూ.1,512

ఎందుకంటే: ఈ ఇంజినీరింగ్, నిర్మాణ రంగ దిగ్గజ కంపెనీ.. ఐటీ, ఆర్థిక సేవల రంగాల్లో కూడా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో మంచి ఆర్థిక ఫలితాలు సాధించింది. మౌలిక, హైడ్రోకార్బన్, హెవీ ఇంజినీరింగ్ విభాగాలు మంచి పనితీరు సాధించడంతో నికర అమ్మకాలు (కన్సాలిడేటెడ్) 10 శాతం వృద్ధి చెందాయి. ఆర్డర్లు 38 శాతం వృద్ధి చెందాయి. ఇబిటా మార్జిన్1.3 శాతం వృద్ధితో 11 శాతానికి పెరిగాయి. ఇన్‌ఫ్రా విభాగం 10 శాతం, హెవీ ఇంజినీరింగ్ విభాగం 14 శాతం, హైడ్రోకార్బన్స్ విభాగం 29 శాతం చొప్పున వృద్ధి చెందాయి. అయితే విద్యుత్ విభాగం 22 శాతం క్షీణతను నమోదు చేసింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి అమ్మకాల వృద్ధి 12 శాతంగా ఉండగలదని కంపెనీ భావిస్తోంది. నిర్వహణ పనితీరు బాగా ఉండడం, తరుగుదల తక్కువగా ఉండడం వంటి కారణాల వల్ల నికర లాభం 55 శాతం పెరిగింది. దేశీయ ఆర్డర్లు 71 శాతం పెరిగాయి. మౌలిక, రక్షణ రంగాల్లో మరిన్ని భారీ ఆర్డర్లను కంపెనీ చేజిక్కించుకునే అవకాశాలున్నాయి. రెండేళ్లలో అమ్మకాలు 12 శాతం, నికరలాభం 18 శాతం, ఆర్డర్లు 9 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని భావిస్తున్నాం. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో ఇబిటా మార్జిన్ 1 శాతం వరకూ పెరగగలదని అంచనా వేస్తున్నాం. దేశీయ వ్యాపారం రికవరీ బాటలో ఉండడం, ఆర్డర్లు పటిష్టంగా ఉండడం, కీలకం కాని ఆస్తుల విక్రయం, రిటర్న్ ఆన్ ఈక్విటీ(ఆర్ఓఈ)ని మెరుగుపరచుకోవడంపై దృష్టి పెట్టడం, పటిష్టమైన వర్కింగ్ క్యాపిటల్ నిర్వహణ, భారీ ఆర్డర్లకు సంబంధించిన ప్రాజెక్ట్‌ల అమలు.. ఇవన్నీ సానుకూలాంశాలు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజి సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

గతవారం బిజినెస్

పరిశ్రమల బాసట.. ధరల ఊరట



ఆర్థిక వ్యవస్థ పురోగతికి సంబంధించి కేంద్రం గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) విడుదల చేసిన గణాంకాలు ఊరట నిచ్చాయి. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) వృద్ధి జనవరిలో 7.5 శాతంగా నమోదయ్యింది (డిసెంబర్‌లో 7.1 శాతం). ఇది 2017 జనవరిలో 3.5 శాతం. ఇక వినియోగ ధరల ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ట స్థాయిలో 4.4 శాతంగా నమోదయ్యింది.

66.61 లక్షల కోట్లకు కేంద్ర రుణ భారం

కేంద్ర రుణ భారం 2017 డిసెంబర్ చివరకి రూ.66.61 లక్షల కోట్లకు పెరిగింది. ప్రభుత్వ రుణ భారం (పబ్లిక్ అకౌంట్ కి ంద ఉన్న రుణాలను మినహాయిస్తే) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.65.80 లక్షల కోట్లుగా ఉంది. దీంతో పోలిస్తే డిసెంబర్ త్రైమాసికంలో రుణ భారం 1.22% పెరిగింది.

హెచ్‌డీఎఫ్‌సీ కార్డులపై ఆ సేవలు బంద్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన క్రెడిట్, డెబిట్, ప్రీపెయిడ్ కార్డులపై క్రిప్టోకరెన్సీల కొనుగోలు, ట్రేడింగ్ సర్వీసులను బ్లాక్ చేస్తున్నట్లు ప్రకటించింది. క్రిప్టోకరెన్సీలపై అంతర్జాతీయంగా భయాలు పెరుగుతోన్న నేపథ్యంలో బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకుంది.

ఎల్‌వోయూల జారీపై నిషేధం



పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.13,000 కోట్ల మేర లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌వోయూ) కుంభకోణం దరిమిలా రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులు ఎల్‌వోయూలు జారీ చేయడాన్ని నిషేధించింది. వాణిజ్య రుణాలకు సంబంధించి బ్యాంకులు.. ఎల్‌వోయూలు, లెటర్స్ ఆఫ్ కంఫర్ట్ (ఎల్‌వోసీ)ల జారీ చేయడాన్ని నిలిపివేయాలని నిర్ణయించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఇది తక్షణం అమల్లోకి వస్తుందని వివరించింది.

ఎస్‌బీఐ కనీస బ్యాలెన్స్ చార్జీల తగ్గింపు



ఖాతాదారులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కనీస బ్యాలెన్స్ పెనాల్టీ చార్జీలను 75 శాతం మేర తగ్గించింది. దీంతో ఇకపై నగరాల్లో నెలకు సగటు బ్యాలెన్స్ పరిమితులను పాటించని పక్షంలో రూ. 15 (పన్నులు అదనం), సెమీ అర్బన్ ప్రాంతాల్లో రూ. 12, గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ. 10 విధించనుంది. ప్రస్తుతం మెట్రోలు, అర్బన్ ప్రాంతాల్లో ఈ చార్జీలు గరిష్టంగా నెలకు రూ. 50 (పన్నులు అదనం), సెమీ అర్బన్.. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 40గా ఉన్నాయి. కొత్త మార్పులు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే, పెనాల్టీ చార్జీలను తగ్గించినప్పటికీ కనీస బ్యాలెన్స్ పరిమితులను మాత్రం ఎస్‌బీఐ యథాతథంగానే ఉంచింది.

భారీ నష్టాల పీఎస్‌యూల్లో ఎయిరిండియా



గత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ రంగ దిగ్గజాల్లో ఇండియన్ ఆయిల్, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా మెరుగైన పనితీరు కనబర్చాయి. అత్యధిక లాభాలు ఆర్జించిన టాప్ 3 సంస్థలుగా నిల్చాయి. మరోవైపు బీఎస్ఎన్ఎల్, ఎయిరిండియా, ఎంటీఎన్ఎల్ మాత్రం భారీ నష్టాలతో అధ్వాన్న పనితీరు చూపాయి. 2016-17 ప్రభుత్వ రంగ సంస్థల (సీపీఎస్ఈ) పనితీరుపై కేంద్రం నిర్వహించిన ఒక సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి.


ఎగుమతులపై అమెరికా పేచీ..

ఇటీవలే ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలు విధించిన అమెరికా మళ్లీ ఇప్పుడు భారత్‌లో ఎగుమతి సంస్థలు పొందుతున్న రాయితీలపై దృష్టి సారించింది. భారత్ అమలు చేస్తున్న ఎగుమతి సబ్సిడీ పథకాలను ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో సవాలు చేసింది. ఇవి తమ కార్మికులు, తయారీ సంస్థల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయని ఆరోపించింది. ఎగుమతి సంస్థలకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చేలా భారత్ కనీసం అరడజను పథకాలు అమలు చేస్తోందని అమెరికా వాణిజ్య ప్రతినిధి రాబర్ట్ లైథిజర్ పేర్కొన్నారు.

ఇన్ఫోసిస్ ఏడీఎస్‌ల డీలిస్ట్!

యూరోనెక్స్ట్ ప్యారిస్, యూరోనెక్స్ట్ లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి ఏడీఎస్‌లను (అమెరికన్ డిపాజిటరీ షేర్స్) స్వచ్ఛందంగా డీలిస్ట్ చేయనున్నామని ఇన్ఫోసిస్ తెలిపింది. ఈ రెండు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో తమ ఏడీఎస్‌లకు రోజువారీ సగటు ట్రేడింగ్ పరిమాణం చాలా తక్కువగా ఉందని, అందుకనే ఈ స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి ఏడీఎస్‌లను స్వచ్ఛందగా డీలిస్ట్ చేయాలనుకుంటున్నామని పేర్కొంది. ఈ డీలిస్టింగ్‌కు యూరోనెక్స్ట్ ప్యారిస్ ఎస్ఏ, యూరోనెక్స్ట్ లండన్‌ల ఆమోదం పొందాల్సి ఉందని వివరించింది. ఈ రెండు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో 2013 ఫిబ్రవరి నుంచి ఏడీఎస్‌ల ట్రేడింగ్ జరుగుతోంది.

డీల్స్..




● ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్ అమెరికాకు చెందిన బోల్డర్ హెల్త్‌కేర్ సొల్యూషన్స్‌ని కొనుగోలు చేయాలని యోచిస్తోంది. హెల్త్‌కేర్ కన్సల్టింగ్ వ్యాపార విభాగంలో మరింతగా విస్తరించేందుకు కాగ్నిజెంట్‌కి ఇది తోడ్పడనుంది. అయితే బోల్డర్ కొనుగోలు కోసం ఎంత వెచ్చించనున్నదీ వెల్లడి కాలేదు.

● విద్యుత్ ఉపకరణాల తయారీ సంస్థ 'భెల్'.. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐఎల్) నుంచి రూ.736 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకుంది. ఇందులో భాగంగా భెల్ సంస్థ హరియాణాలోని ఫతేహాబాద్ జిల్లాలోని గోరఖ్‌పూర్ వద్ద ఎన్‌పీసీఐఎల్ ఏర్పాటు చేస్తోన్న ప్లాంటుకు స్టీమ్ జనరేటర్లను సరఫరా చేయనుంది. బిడ్డింగ్ ద్వారా ఈ ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు భెల్ తెలిపింది.

● దిగ్గజ ఐటీ కంపెనీ విప్రో అమెరికాకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కన్వర్జేషనల్ కంప్యూటింగ్ సంస్థ అవామో ఇన్‌కార్పొలో 20.2 లక్షల డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. గతంలో ఇన్వెస్ట్ చేసిన నిధులను కూడా కలుపుకుంటే ఈ సంస్థలో తమ పెట్టుబడుల మొత్తం 30.2 లక్షల డాలర్లకు పెరిగాయని విప్రో తెలిపింది. ఈ పెట్టుబడులతో ఈ సంస్థలో తమకు 20 శాతం లోపు వాటా దక్కిందని పేర్కొంది. అలాగే తమ హోస్టెడ్ డేటా సెంటర్ సర్వీసెస్ వ్యాపారాన్ని ఎన్‌సోనో సంస్థకు విక్రయిస్తున్నట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించి ఎన్‌సోనోతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. ఈ డీల్ విలువ 405 మిలియన్ డాలర్లు.

ఆటోమొబైల్స్..



➡ నిస్సాన్ మోటార్ ఇండియా తన డాట్సన్ గో, గో ప్లస్‌లలో రీమిక్స్ లిమిటెడ్ ఎడిషన్స్‌ను మార్కెట్‌లో ఆవిష్కరించింది. వీటి ధరలు వరుసగా రూ.4.21 లక్షలు, రూ.4.99 లక్షలుగా ఉన్నాయి. ధరలన్నీ ఎక్స్‌షోరూమ్ ఇండియావి. రీమిక్స్ లిమిటెడ్ మోడల్స్.. రిమోట్ కీలెస్ ఎంట్రీ, హ్యాండ్స్‌ఫ్రీ బ్లూటూత్ ఆడియో, ఆల్ బ్లాక్ ఫ్రంట్ గ్రిల్, పియానో బ్లాక్ ఇంటీరియర్స్ వంటి తొమ్మిది కొత్త ఫీచర్లతో కస్టమర్లకు అందుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది.

➡ టూవీలర్ల తయారీ కంపెనీ 'హీరో మోటొకార్ప్'.. 2018 ప్యాషన్ ప్రో, ప్యాషన్ ఎక్స్‌ప్రో మోటార్‌సైకిళ్లను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.53,189, రూ.54,189గా ఉన్నాయి. అన్ని ధరలు ఎక్స్‌షోరూమ్ ఢిల్లీవి.

➡ హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తన లివో, డ్రీమ్ యుగ, సీబీ షైన్ ఎస్‌పీ మోడళ్లలో 2018 ఎడిషన్లను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. హోండా సీబీ షైన్ ఎస్‌పీ ధర రూ.62,032గా, హోండా లివో ధర రూ.56,230గా, హోండా డ్రీమ్ యుగ ధర రూ.52,741గా ఉంది. అన్ని ధరలు ఎక్స్‌షోరూమ్ ఢిల్లీవి.

➡ దేశీ దిగ్గజ వాహన తయారీ కంపెనీ టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాండ్‌రోవర్ (జేఎల్ఆర్) సరికొత్త అల్యూమినియం ఇంజినియం 2 లీటర్ పెట్రోల్ ఇంజిన్లతో కూడిన ఎక్స్ఈ, ఎక్స్ఎఫ్ సెడాన్ కార్లను భారత మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. జాగ్వార్ ఎక్స్ఈ ప్రారంభ ధర రూ.35.99 లక్షలుగా ఉంది. ఇక జాగ్వార్ ఎక్స్ఎఫ్ ధర రూ.49.80 లక్షల నుంచి ప్రారంభమౌతోంది.

➡ వాహన తయారీ కంపెనీ 'టీవీఎస్ మోటార్' తన 'అపాచీ 160 4వీ'లో 2018 ఎడిషన్‌ను మార్కెట్‌లో ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ.81,490 (ఎక్స్‌షోరూమ్ ఢిల్లీ).

➡ 'సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా' తన ఇన్‌ట్రూడర్ బైక్‌లో ఫ్యూయెల్ ఇన్‌జెక్షన్ ఆప్షన్‌తో అడ్వాన్స్‌డ్ వెర్షన్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ధర రూ.1,06,896.

➡ జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల కంపెనీ ఆడి.. ఏప్రిల్ 1 నుంచి వాహన ధరలు రూ.1 లక్ష నుంచి రూ.9 లక్షల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది.

సాక్షి



బొమ్మ-బొరుసు

"నువ్వంటే నీ రెజ్యూమ్ కాదు. నువ్వంటే నీ పని.
నీ పనితనమే నీ గురించి ప్రపంచానికి చాటిచెప్తుంది."
– సెత్ గోడిన్, అమెరికన్ ఎంట్రప్రెన్యూర్.



ప్రపంచ పరిణామాలే కీలకం

ఫెడ్ సమావేశంపై అందరి దృష్టి

- వాణిజ్య యుద్ధాలపై ఆందోళన
- దేశీ రాజకీయ అంశాలకూ ప్రాధాన్యం
- ఈ వారం స్టాక్ మార్కెట్ గమనంపై నిపుణుల అంచనాలు ఇవి...


వాణిజ్య యుద్ధ భయాల నేపథ్యంలో ప్రపంచ పరిణామాలే ఈ వారం మార్కెట్‌కు కీలకమని నిపుణులంటున్నారు. దేశీయ రాజకీయ అంశాలు, వాణిజ్య యుద్ధ భయాల ప్రభావం మన మార్కెట్‌పై తీవ్రంగానే ఉందని వారంటున్నారు. ఇక డాలర్‌తో రూపాయి మారకం కదలికలు, అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరల గమనం, విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి తదితర అంశాలు కూడా ఈ వారం స్టాక్ మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని మార్కెట్ విశ్లేషకులంటున్నారు.

ఫెడ్ ఏం చేస్తుందో ?

రెండు రోజుల అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశం ఈ నెల 20(మంగళవారం) మొదలవుతుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుండటంతో ఈ సమావేశంలో రేట్లను పెంచే అవకాశాలున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది మూడు సార్లు రేట్ల పెంపు ఉండొచ్చన్న ఇప్పటికే ఫెడ్ సంకేతాలిచ్చింది. కంపెనీల క్యూ4 ఫలితాలు ఆర్థిక స్థితిగతులు మెరుగుపడుతున్నాయని సూచించాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. స్టాక్ మార్కెట్‌కు సంబంధించి దీర్ఘకాలిక అంచనాలు పటిష్టంగా ఉన్నాయని వివరించారు. అయితే వాణిజ్య యుద్ధభయాలు, దేశీయంగా మొండి బకాయిల సమస్యలు, రానున్న కాలంలో జరిగే రాష్ట్రాల ఎన్నికలు మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.

10,600 కోట్ల విదేశీ డెట్ పెట్టుబడులు వెనక్కి..

విదేశీ ఇన్వెస్టర్లు ఈ నెలలో ఇప్పటివరకూ మన ఈక్విటీ మార్కెట్లో రూ.6,400 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. గత నెలలో భారీగా(రూ.11,000 కోట్ల మేర) ఈక్విటీ మార్కెట్ నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పటికీ, టీసీఎస్ బ్లాక్‌డీల్ కారణంగా ఈ నెల 1–16తేదీల మధ్యకాలంలో ఎఫ్‌పీఐల పెట్టుబడులు ప్లస్‌లోకి వచ్చాయి. టాటా సన్స్ విక్రయించిన టీసీఎస్ షేర్లను బ్లాక్‌డీల్‌లో ఎఫ్‌పీఐలు కొనుగోలు చేసినందున ఈ స్థాయిలో విదేశీ పెట్టుబడులు వచ్చినట్లు నియంత్రణ సంస్థ సెబీ డేటా తెలియపరుస్తున్నది.



టీసీఎస్ షేర్ల కొనుగోళ్లు లేకపోతే, మన ఈక్విటీ మార్కెట్లో ఎఫ్‌పీఐలు నికర అమ్మకాలు రూ. 1000 కోట్లవరకూ ఈ నెలలో ఇప్పటివరకూ వున్నాయి. మరోవైపు విదేశీ ఇన్వెస్టర్లు ఈ నెలలో ఇప్పటిదాకా డెట్ మార్కెట్ నుంచి రూ.10,600 కోట్ల మేర పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.

ఆరు ఐపీఓలు...

గత వారంలో ఆరంభమైన 2 కంపెనీల ఐపీఓలు ఈ వారంలో ముగుస్తున్నాయి. మరో 4 కంపెనీలు ఈ వారంలో ఐపీఓకు వస్తున్నాయి. గత గురువారం మొదలైన బంధన్ బ్యాంక్ ఐపీఓ నేడు ముగుస్తోంది. రూ.370–375 ప్రైస్‌బాండ్‌తో రూ.4,473 కోట్లు సమీకరించాలని ఈ బ్యాంక్ భావిస్తోంది. కనీసం 40 షేర్లకు దరఖాస్తు చేయాలి. గత శుక్రవారం ఆరంభమైన హిందుస్తాన్ ఏరోనాటిక్స్ ఐపీఓ రేపు (మంగళవారం) ముగుస్తోంది. రూ. 1,215–1,240 ప్రైస్‌బాండ్‌తో ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ. 4,300 కోట్లు సమీకరించనున్నది. కనీసం 12 షేర్లకు దరఖాస్తు చేయాలి. గత శుక్రవారమే మొదలైన కర్దా కన్‌స్ట్రక్షన్స్ ఐపీఓ ఈ నెల 21న(బుధవారం) ముగియనున్నది. రూ.175–180 ప్రైస్‌బాండ్‌తో ఈ కంపెనీ రూ.77 కోట్లు సమీకరించాలని యోచిస్తోంది. సంధార్ టెక్నాలజీస్ ఐపీఓ నేటి(సోమవారం) నుంచి ప్రారంభం కానున్నది. రూ.327–332 ప్రైస్‌బాండ్ ఉన్న ఐపీఓ ఈ నెల 21న(బుధవారం)ముగుస్తుంది. హైదరాబాద్‌కు చెందిన మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్(మిధాని) ఐపీఓ ఈ నెల 21న(బుధవారం) మొదలై ఈ నెల 23న ముగుస్తుంది. రూ.87–90 ప్రైస్‌బాండ్‌తో ఈ కంపెనీ రూ.438 కోట్లు సమీకరించనుంది. ఇక ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఐపీఓ ఈ నెల 22న(గురువారం) మొదలై 26న ముగుస్తుంది. రూ.519–520 ప్రైస్‌బాండ్‌తో రూ.4,000 కోట్ల మేర సమీకరించాలని యోచిస్తోంది. కనీసం 28 షేర్లకు దరఖాస్తు చేయాలి.

గెయిల్.. ఐఓసీ, బీపీసీఎల్ చేతికి!

- చెరో 26 శాతం చొప్పున వాటా కొనుగోలు చేసే అవకాశం...
- ప్రభుత్వ ఖజానాకు రూ.40 వేల కోట్లకుపైగా రావచ్చని అంచనా...



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ గ్యాస్ మార్కెటింగ్, సరఫరా సంస్థ గెయిల్ ఇండియా లిమిటెడ్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్)లు చెరో 26 శాతం చొప్పున వాటాలు చేజిక్కించుకోవడానికి ప్రయత్నాలు జోరందుకున్నాయి. ఈ ఒప్పందం గనుక పూర్తయితే ప్రభుత్వ ఖజానాకు రూ.40 వేల కోట్లకుపైగానే నిధులు సమకూరుతాయి. భారీ స్థాయి చమురు పీఎస్‌యూలను నెలకొల్పుతామంటూ 2017 బడ్జెట్‌లో అరుణ్ జైట్లీ ప్రకటించిన తర్వాత హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్)ను ఓఎన్‌జీసీ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జూన్‌లో ఓఎన్‌జీసీ.. హెచ్‌పీసీఎల్‌లో ప్రభుత్వానికి ఉన్న 51.11 శాతం వాటాను రూ.36,915 కోట్లుచెల్లించి కొనుగోలు చేసింది. అయితే, ఈ డీల్ తర్వాత హెచ్‌పీఎస్‌ఎల్‌ను ఓఎన్‌జీసీ విలీనం చేసుకోకుండా అనుబంధ సంస్థగా మార్చింది. ప్రత్యేక లిస్టెడ్ కంపెనీగానే కొనసాగిస్తోంది. ఓఎన్‌జీసీలో మెజారిటీ వాటాదారుగా కేంద్రం ఉన్నందున హెచ్‌పీఎల్‌పై నియంత్రణను ఎప్పటిలాగే తన చేతుల్లో ఉంచుకున్నట్లయింది.

నియంత్రణ కేంద్రం చేతుల్లోనే...

ప్రభుత్వం చమురు పీఎస్‌యూలను పూర్తిగా విలీనం చేయాలని భావించడం లేదని... కేవలం నగదు నిల్వలు పుష్కలంగా ఉన్న కంపెనీలకు తన వాటాను విక్రయించి నిధులను సమీకరించడమే ఈ చర్యల ప్రధానోద్దేశమని అత్యున్నత స్థాయి ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం గెయిల్‌లో కేంద్ర ప్రభుత్వానికి 54.89 శాతం వాటా ఉంది. దీన్ని కొనుగోలు చేసేందుకు ఐఓసీ, బీపీసీఎల్‌లు విడివిడిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాయి. అయితే, ప్రభుత్వం మాత్రం తన వాటాను చెరిసగం చొప్పున ఐఓసీ, బీపీసీఎల్‌లకు విక్రయించనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. గత శుక్రవారం(16న) మార్కెట్ ముగింపు ధర రూ.441 ప్రకారం ఈ డీల్ ద్వారా కేంద్రానికి దాదాపు రూ.41 వేల కోట్లు లభించొచ్చని అంచనా. ఓఎన్‌జీసీ డీల్ మాదిరిగానే.. గెయిల్‌లో తన పూర్తి వాటాను విక్రయించినప్పటికీ.. ఐఓసీ, బీపీసీఎల్‌ల ద్వారా ఆ కంపెనీపై తన నియంత్రణను కొనసాగించేందుకు వీలవుతుంది. కాగా, ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని... వాటా విక్రయం ఎప్పుడు ఎలా చేపట్టాలనేది అంతర్‌మంత్రిత్వ శాఖల సంప్రతింపుల తర్వాత నిర్ణయిస్తారని సంబంధిత ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. కాగా, మరో లిస్టెడ్ చమురు కంపెనీ ఆయిల్ ఇండియా(ఓఐఎల్)లో కేంద్రం వాటా కొనుగోలుపై కూడా బీపీసీఎల్ ఆసక్తిని కనబరుస్తోంది. ప్రస్తుతం ఓఐఎల్‌లో ప్రభుత్వానికి 66.13 శాతం వాటా ఉంది. దీని మార్కెట్ విలువ రూ.18,000 కోట్లు.

గత వారం హీరోలు

స్టాక్స్	16 ముగింపు	09 ముగింపు	మార్పు(%)
వక్రంగీ	248	196	27
బ్యాంక్ ఆఫ్ బరోడా	144	131	9
దివీస్ ల్యాబ్స్	1,087	996	9
శ్రీరామ్ ట్రాన్స్‌ఫోర్ట్.ఫై	1,447	1,339	8
టైటాన్	876	818	7
డీఎల్‌ఎఫ్	226	211	7
ఎల్ఐసీ హౌసింగ్ ఫై.	514	483	6
పిరమల్ ఎంటర్‌ప్రైజెస్	2,494	2,362	6
పెడిలైట్ ఇండస్ట్రీస్	916	878	4
భారతీ ఎయిర్‌టెల్	418	402	4

ఎందుకు పెరిగాయంటే..

ప్రస్తుత ధర కంటే అధిక ధరకు షేర్ బైబ్యాక్ ధరను ప్రకటిస్తుందన్న అంచనాలతో వక్రంగీ షేర్ 27% ఎగసింది. పీఎన్‌బీ స్కామ్ నిందితుడు నీరవ్ మోదీకి ఎలాంటి రుణాలివ్వలేదని వెల్లడించడంతో బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్ 9 శాతం ఎగసింది. రానున్న క్వార్టర్లలో నిర్వహణ ఆస్తులు 18–20% రేంజ్‌లో వృద్ధి చెందగలవని పేర్కొనడంతో శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ 8% లాభపడింది. జర్మనీ ఇండస్ట్రియల్ అడ్‌హెసివ్ కంపెనీ జోవట్ ఎస్‌ఈతో ఒప్పందం కుదుర్చుకోవడంతో పిడిలైట్ ఇండస్ట్రీస్ షేర్ 4% పెరిగింది.

గత వారం జీరోలు

నష్టస్టాక్స్	16 ముగింపు	09ముగింపు	మార్పు(%)
కోల్ ఇండియా	279	305	-9
అపోలో హాస్పిటల్స్	1,070	1,150	-7
టీసీఎస్	2,825	3,034	-7
ఏబీబీ ఇండియా	1,340	1,435	-7
క్రాంప్టన్ గ్రీవ్	227	240	-5
పవర్ ఫైనాన్స్ కార్ప్	88	93	-5
ఐఓసీ	185	193	-4
అరబిందో ఫార్మా	573	592	-3
బజాజ్ హోల్డింగ్స్. ఇ.	2,628	2,710	-3
కంటైనర్ కార్ప్	1,210	1,247	-3

ఎందుకు తగ్గాయంటే...

1.5 శాతం వాటాకు సమానమైన 2.83 కోట్ల టీసీఎస్ షేర్లను రూ.8,200 కోట్లకు టాటా సన్స్ విక్రయించడంతో టీసీఎస్ షేర్ 7 శాతం పడిపోయింది. లోన్ బుక్‌లో 11 శాతానికి సమానమైన రూ.30,000 కోట్ల విలువైన ప్రాజెక్టులు దివాళా పిటీషన్ విచారణలో ఉన్నాయన్న వార్తల కారణంగా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ షేర్ 5 శాతం క్షీణించింది. హైదరాబాద్ ప్లాంట్‌పై అమెరికా ఎఫ్‌డీఏ అభ్యంతరాల నేపథ్యంలో అరబిందో ఫార్మా షేర్ 3% తగ్గింది.

వాణిజ్య యుద్ధం మనకొద్దు

ఎగుమతుల వృద్ధికి ద్వైపాక్షిక సహకారమే మేలు: అసోచామ్

న్యూఢిల్లీ: అమెరికా సర్కారు ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై పన్ను విధిస్తూ అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధానికి ఆజ్యం పోసిన నేపథ్యంలో, కీలకమైన భాగస్వామ్య దేశాలతో ద్వైపాక్షిక సహకారం ద్వారా ఎగుమతుల పెంపుపై దృష్టి సారించాలని పారిశ్రామిక సంఘం అసోచామ్ సూచించింది. అమెరికా ఒక్క దేశంతోనే మనకు 150 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉందని, ఈ నేపథ్యంలో ప్రతీకార చర్యలు సరికాదని పేర్కొంది. ఎందుకంటే మన దిగుమతులు అన్నీ కూడా సహజ అవసరాలేనని గుర్తు చేసింది. మన ఎగుమతుల కంటే దిగుమతులే ఎక్కువని, ఈ దృష్ట్యా ప్రతిఘటనకు అవకాశం లేదని పేర్కొంది. మన దిగుమతుల్లో



చాలా వరకు అనివార్యమైనవని తెలియజేసింది. ఈ నేపథ్యంలో మన ఎగుమతులపై ప్రభావం పడితే ద్వైపాక్షిక సహకారం ద్వారా, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) చానల్‌ను నిబంధనలకు అనుగుణంగా వినియోగించుకోవాలని ఓ ప్రకటనలో ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మన ఎగుమతుల బిల్లు 300 బిలియన్ డాలర్లుగా, దిగుమతుల బిల్లు 450 బిలియన్ డాలర్ల మేర ఉంటుందని పేర్కొంది. దిగుమతుల్లోనూ ఒక వంతు చమురు ఉత్పత్తులేనని గుర్తు చేసింది. ప్లాస్టిక్, ఫెర్టిలైజర్ తదితర దేశీయంగా తగినంత ఉత్పత్తి లేని కమోడిటీలేనని తెలియజేసింది. అమెరికా అధిక పన్నులు వేసినందున స్టీల్ దిగుమతుల్లో ఉన్నట్టుండి పెరుగుదల ఉంటుందేమో దృష్టి పెట్టాలని సూచించింది. స్టీల్ దిగుమతులపై 25 శాతం, అల్యూమినియం దిగుమతులపై 10 శాతం సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. అవసరమైతే మరిన్ని ఉత్పత్తులను అధిక టారిఫ్ పరిధిలోకి తీసుకొస్తామ ని, అమెరికా ప్రయోజనాల పరిరక్షణకు వాణిజ్య యుద్ధానికి సైతం సిద్ధమేనని ఆయన పేర్కొనడం తెలిసిందే.

సొంత వ్యాపారాలు నెలకొల్పుతోంది 5% మందే!



అహ్మదాబాద్: దేశ జనాభాలో కేవలం ఐదు శాతం మందే సొంతంగా వ్యాపారం ఏర్పాటు చేయగలుగుతున్నారని, 11 శాతం మంది తొలిదశ వ్యాపార కార్యకలాపాల్లో ఉన్నారని ఓ సర్వేలో వెల్లడైంది. ఐదు శాతం అన్నది ప్రపంచంలోనే అతి తక్కువ రేటు. ఇక వ్యాపారం మొదలు పెట్టిన వారిలో 26.4 శాతం మంది దాన్ని అర్థంతరంగా ఆపేస్తున్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌కు చెందిన ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్(ఈడీఐ) సంస్థ 'ఎంట్రపెన్యూర్‌షిప్ మానిటర్ ఇండియా రిపోర్ట్ 2016–17' పేరుతో సర్వే వివరాలను విడుదల చేసింది. వ్యాపారాలతో సంబంధం ఉన్న 3,400 మంది అభిప్రాయాలను సర్వేలో భాగంగా సేకరించింది.

ఇళ్ల విక్రయాలు 40 శాతం డౌన్

- 2017లో ప్రధాన పట్టణాల్లో పరిస్థితి
- 2,02,800 యూనిట్ల అమ్మకాలు
- హైదరాబాద్‌లో భిన్నం... 32 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో 2017వ సంవత్సరం ఇళ్ల విక్రయాల పరంగా కలసిరాలేదు. అమ్మకాలు ఏకంగా 40 శాతం తగ్గి 2,02,800 యూనిట్లకు పరిమితమైనట్టు ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. ఈ సంస్థ గడిచిన ఐదు సంవత్సరాల్లో ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై మెట్రో, పుణె, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరులో విక్రయాల గణాంకాలను విశ్లేషించింది. ''నివాస గృహాల మార్కెట్ ధోరణలను పరిశీలిస్తే 2013, 2014 సంవత్సరాలు బావున్నాయి. ఆ తర్వాత ఇళ్ల విక్రయాలు క్షీణ బాట పట్టగా, ఇప్పటి వరకు ఇవి తిరిగి గాడిన పడినట్టు స్పష్టమైన సంకేతాలు ఏవీ కనిపించడం లేదు'' అని అనరాక్



ప్రాపర్టీ కన్సల్టెంట్స్ చైర్మన్ అనుజ్‌పురి తెలిపారు. 2013, 2014 సంవత్సరాల్లో వార్షికంగా సగటున 3.3 లక్షల నివాస గృహ యూనిట్లు అమ్ముడుపోయాయి. 2015–16 సంవత్సారాల్లో విక్రయాలు సగటున 2.7 లక్షల యూనిట్లకు తగ్గాయి. 2013, 2014 సంవత్సరాలతో పోలిస్తే 17 శాతం తగ్గుదల ఉందని అనరాక్ తెలిపింది. ఇక 2017లో ఇవి మరింత క్షీణించి 2,02,800 విక్రయాలకే పరిమితమైనట్టు పేర్కొంది. 2013–14 సంవత్సరాల్లో నమోదైన నివాస గృహ విక్రయాలతో పోలిస్తే 2017 సంవత్సరంలో 40 శాతం తగ్గాయని వివరించింది.

పట్టణాల వారీగా...

- అధిక విక్రయాలు జరిగే ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై మెట్రో ప్రాంతంలో 2013–14తో పోలిస్తే 2017లో అమ్మకాలు వరుసగా 68 శాతం, 27 శాతం చొప్పున తగ్గాయి. 2017లో ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 37,600 యూనిట్లు అమ్మడయ్యాయి. 2013–2014లో అమ్మకాలు 1,16,250 యూనిట్లుగా ఉండటం గమనార్హం.
- బెంగళూరులో 17%, చెన్నైలో 45% తగ్గాయి.
- పుణెలోనూ ఇళ్ల అమ్మకాలు 29% క్షీణించాయి. కోల్‌కతాలో అమ్మకాలు 12% తగ్గాయి.
- ఇక హైదరాబాద్ మార్కెట్లో పరిస్థితి వీటికి భిన్నంగా ఉంది. ఇక్కడ 2013–14 నాటితో పోలిస్తే 2017లో నివాస గృహాల అమ్మకాల్లో 32% వృద్ధి ఉందని అనరాక్ వెల్లడించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 19-3-2018


విశాఖ	325–00
చిత్తూరు	363–00
వరంగల్	332–00
ముంబై	370–00
చెన్నై	370–00
విజయవాడ	317–00
గోదావరి	317–00
నమక్కల్	360–00
18–3–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	330–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	3.90
బెంగళూరు	365–00
ఢిల్లీ	310–00
కోల్‌కతా	360–00

32,820 స్థాయి కీలకం...

మార్కెట్ పంచాంగం


కొద్దివారాల క్రితం తీవ్ర ఒడుదుడుకులకు లోనైన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు.. ఇటీవల కుదుటపడ్డప్పటికీ, భారత్ మార్కెట్ మాత్రం చిన్న పెరుగుదలలో సైతం అమ్మకాల ఒత్తిడిని చవిచూస్తున్నది. ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు, ట్రంప్ టారీఫ్‌లు వంటివి ప్రపంచంతో పాటు మనదేశ మార్కెట్‌ను కూడా వేధిస్తున్న సమస్యలుకాగా, దీర్ఘకాలిక ఈక్విటీ రాబడులపై బడ్జెట్లో ప్రతిపాదించిన పన్ను, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం, ఎల్‌ఓయూలను ఆర్‌బీఐ నిషేధించడం, విదేశీ ఇన్వెస్టర్ల ఆఫ్‌షోర్ ట్రేడింగ్ (ఎస్‌జీఎక్స్ నిఫ్టీని తొలగించే యత్నం)పై ఎక్స్ఛేంజీల కన్నెర్ర వంటి అంశాలతో భారత్ ఈక్విటీలు మరింత అమ్మకాల ఒత్తిడకి లోనవుతున్నాయి. ముఖ్యంగా గతవారం చివరిరోజున ఇండెక్స్ హెవీవెయిట్ షేర్లలో అమ్మకాలు జరగడం ఆందోళనకలిగించే అంశం. ఇక మన ప్రధాన సూచీల సాంకేతిక అంశాలు ఇలా వున్నాయి...

సెన్సెక్స్ సాంకేతికాలు..



మార్చి 16తో ముగిసిన వారంలో గత మార్కెట్ పంచాంగంలో అంచనాలకు అనుగుణంగానే బీఎస్‌ఈ సెన్సెక్స్ 33,650 పాయింట్లస్థాయిని దాటినంతనే 34,077 పాయింట్ల వరకూ పెరగగలిగింది. తొలిరోజున 600 పాయింట్ల ర్యాలీ జరిపిన సెన్సెక్స్...వారం ముగిసేటప్పటికి ఆ లాభాలన్నింటినీ కోల్పోయి, చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 131 పాయింట్ల నష్టంతో 33,176 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం సెన్సెక్స్‌కు 200 రోజుల చలన సగటు (200 డీఎంఏ) రేఖ కదులుతున్న 32,820 పాయింట్లస్థాయి కీలకమైనది. ఈ స్థాయిని కోల్పోతే వేగంగా 32,600 పాయింట్ల వద్దకు పడిపోవొచ్చు. కొద్ది నెలలుగా ఈ స్థాయి పలు దఫాలు మద్దతును అందించినందున ఇది కూడా ముఖ్యమైనదే. ఈ స్థాయిని కూడా వదులుకుంటే రానున్న వారాల్లో 31,081 పాయింట్ల వరకూ పతనం కొనసాగే ప్రమాదం వుంటుంది. తక్షణం 32,600 దిగువన 32,310 పాయింట్ల స్థాయివరకూ తగ్గవచ్చు. ఈ వారం తొలి రెండు మద్దతుల్లో ఏదో ఒక స్థాయిని పరిరక్షించుకోగలిగితే చిన్న రిలీఫ్ ర్యాలీ జరగవచ్చు, ఈ సందర్భంలో 33,685 వద్ద తక్షణ అవరోధం కలగవచ్చు. ఈ స్థాయిపైన ముగిస్తేనే తదుపరి అప్‌ట్రెండ్ కొనసాగే అవకాశం వుంటుంది. అలా జరిగితే మరోదఫా 34,070 పాయింట్ల వరకూ ర్యాలీ కొనసాగవచ్చు.


10,160 దిగువన ముగిస్తే...



గతవారం తొలిరోజున ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ భారీగ్యాప్‌తో మొదలై..పెద్ద ర్యాలీ జరిపినా, గత మార్కెట్ పంచాగంలో సూచించిన 10,450 పాయింట్ల తొలి నిరోధస్థాయి సమీపంలోనే నిలిచిపోవడం ఇండెక్స్ బలహీనతను సూచించింది. అటుతర్వాత క్రమేపీ తగ్గుతూ, చివరిరోజైన శుక్రవారం భారీ పతనం కారణంగా...తొలిరోజునాటి లాభాలన్నింటినీ కోల్పోయి, చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 32 పాయింట్ల నష్టంతో 10,195 పాయింట్ల వద్ద ముగిసింది. వారం రోజుల క్రితం మద్దతునిచ్చిన 200 డీఎంఏ రేఖే ఈ వారం కూడా నిఫ్టీకి కీలకమైనది. ఈ రేఖ ప్రస్తుతం 10,160 పాయింట్ల వద్ద కదులుతోంది. ఈ స్థాయిని భారీ ట్రేడింగ్ పరిమాణంతో కోల్పోయి, ముగిస్తే తదుపరి కొద్దివారాల్లో 9,687 పాయింట్ల వరకూ పతనం కొనసాగవచ్చు. తక్షణం 10,160 పాయింట్ల దిగువన 10,075–10,030 పాయింట్ల శ్రేణి మద్దతును అందించవచ్చు. ఈ శ్రేణిని కోల్పోతే 9,915 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఈ వారం తొలి రెండు మద్దతు స్థాయిల్లో ఏదో ఒక స్థాయిని పరిరక్షించుకోగలిగితే 10,345 పాయింట్ల వరకూ పెరగవచ్చు. ఆపైన ముగిస్తే 10,480–10,535 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు.

– పి. సత్యప్రసాద్

థీమాటిక్ ఫండ్స్‌ను ఎంచుకోవచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఇటీవల సుందరమ్ రూరల్ ఫండ్ మంచి రాబడులను ఇచ్చింది. దీంతో పాటు నేను టాటా కన్సూమర్ ఫండ్‌లో కూడా ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. ఇలాంటి థీమాటిక్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం సరైనదేనా ? మరే ఇతర మ్యూచువల్ ఫండ్స్‌లో నేను ఇన్వెస్ట్ చేయడం లేదు.

– కళ్యాణ్, విజయవాడ

కేవలం థీమాటిక్ ఫండ్స్‌లో మాత్రమే ఇన్వెస్ట్ చేయడం సరైనది కాదు. రూరల్ ఇండియా ఫండ్ గత రెండు–మూడేళ్లలో మంచి రాబడులు ఇచ్చింది. గత రెండు–మూడేళ్లలో మంచి రాబడులు వచ్చాయి కదా అని ఇప్పుడు ఇన్వెస్ట్ చేస్తే, ఆ తర్వాత మీరు ఆశించిన రాబడులు రాకపోవచ్చు.. థీమాటిక్ ఫండ్స్ తీవ్రమైన 'సైక్లికల్' మార్పు, చేర్పులకు గురవుతాయి. అందుకని అవి ఇస్తే భారీ రాబడులనిస్తాయి. లేకుంటే తీవ్ర స్థాయి నష్టాలను ఇస్తాయి. ఈ తరహా ఫండ్స్ పనితీరును స్వల్ప కాలమే మదింపు చేసి ఇన్వెస్టర్లు తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటారు. అందుకనే థీమాటిక్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. మీరు థీమాటిక్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారంటే దానర్థం ఒక తరహా కంపెనీ షేర్లలోనే ఇన్వెస్ట్ చేయమని మీరు మీ ఫండ్ మేనేజర్‌కు ఆదేశాలు ఇస్తున్నట్లు అర్థం. ఉదాహరణకు మీ థీమాటిక్ ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను తీసుకుంటే, మీరు కన్సూమర్, రూరల్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నారు. అంటే కన్సూమర్ సంబంధిత, రూరల్ సంబంధిత కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేయాలని మీరు మీ ఫండ్ మేనేజర్‌కు చెప్పినట్లు లెక్క. ఇలా చేస్తే డైవర్సిఫికేషన్ ప్రయోజనాలను మీరు పొందలేరు. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడమంటే డైవర్సిఫికేషన్ కోసమే కదా ! మరో ముఖ్యమైన విషయం థీమాటిక్ ఫండ్స్‌లో ఎప్పుడు ఇన్వెస్ట్ చేయాలనేది కీలకమైన అంశం. సరైన సమయంలో ఈ థీమాటిక్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే మీకు మంచి రాబడులు వస్తాయి. అలా కాకుంటే నష్టాలు తప్పవు. కానీ సరైన టైమింగ్ ఎప్పుడనేది మనం అంచనా వేయలేం. సంబంధిత రంగంపై మీకు పూర్తిగా అవగాహన ఉన్నప్పుడు మాత్రమే, ఈ రంగానికి సంబంధించిన ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి. థీమాటిక్ ఫండ్స్‌పై మక్కువ ఎక్కువగా ఉండి, దాంట్లో ఇన్వెస్ట్ చేయాల్సిందేనన్న కోరిక బలీయంగా ఉన్నప్పుడు మీ మొత్తం ఇన్వెస్ట్‌మెంట్స్‌లో 10 నుంచి 15 శాతం మాత్రమే ఈ ఫండ్స్‌కి కేటాయించాలి. దీని వల్ల మీ కోరికా తీరుతుంది. థీమాటిక్ ఫండ్స్ పనితీరూ అర్థమవుతుంది. అంతే కాకుండా అది ఒక పాఠంలా కూడా ఉంటుంది. మీ పోర్ట్‌ఫోలియోలో తప్పనిసరిగా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఉండాలి. ఈ ఫండ్స్‌లో దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేస్తే, మంచి రాబడులు పొందే అవకాశాలు అధికంగా ఉంటాయి.

నేను ఐసీఐసీఐ ఫోకస్‌డ్ బ్లూచిప్ ఈక్విటీ, హెచ్‌డీఎఫ్‌సీ యులిప్‌ల్లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. ఈ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా 15 సంవత్సరాల్లో రూ.20 లక్షల రాబడి పొందగలనా ?

– సతీశ్, నెల్లూరు

ఐసీఐసీఐ ఫోకస్‌డ్ బ్లూచిప్ ఈక్విటీ అనేది మంచి లార్జ్‌క్యాప్ ఫండ్. ఇక యులిప్‌ల విషయానికొస్తే, దీంట్లో కొంత భాగం బీమాకు కేటాయించి, మిగిలిన దానిని ఇన్వెస్ట్ చేస్తారు. ఫలితంగా మీకు తగిన బీమా కవరేజ్ ఉండదు. మంచి రాబడులూ రావు. ఇక మీరు 15 సంవత్సరాల్లో రూ.20 లక్షలు పొందాలనుకుంటున్నారు. కాబట్టి లార్జ్‌క్యాప్ ఫండ్‌కు బదులు ఏదైనా మల్టీక్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయండి. మల్టీ క్యాప్ ఫండ్ మేనేజర్లకు వివిధ పరిమాణాల కంపెనీల్లో(స్మాల్, మిడ్, లార్జ్ క్యాప్ కంపెనీల్లో) ఇన్వెస్ట్ చేసే వెసులుబాటు ఉంటుంది. ఇక హెచ్‌డీఎఫ్‌సీ యులిప్‌కు బదులుగా మీ బీమా అవసరాలకు తగ్గట్లుగా ఉండే టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకోండి. మీరు లేకపోయినా మీ కుటుంబ ఆర్థిక అవసరాలు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా గడిచిపోయేందుకు అవసరమైన మొత్తానికి బీమా పాలసీని తీసుకోండి. టర్మ్ పాలసీల్లో బీమా కవరేజ్ ఎక్కువగానూ, చెల్లించాల్సిన బీమా ప్రీమియమ్ తక్కువగానూ ఉంటుంది. హెచ్‌డీఎఫ్‌సీ యూలిప్‌కు బదులుగా మరో మల్టీక్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయండి.

నేను 2012 నుంచి ఎల్ఐసీ పెన్షన్ ప్లాన్‌లో ఏడాదికి రూ.70,000 చొప్పున ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఈ ప్లాన్‌లో ఎక్స్‌పెన్స్ చార్జీలు అధికంగా ఉన్నాయి. రాబడి కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఈ ప్లాన్ నుంచి వైదొలగాలనుకుంటున్నాను. తగిన సూచనలివ్వండి ?

– అఫ్జల్, హైదరాబాద్

ఎల్ఐసీ పెన్షన్ ప్లాన్ మీకు కొంత బీమా కవరేజ్‌ను ఇస్తుంది. మీరు ఇన్వెస్ట్ చేసే కొంత మొత్తంలో రిటైర్మెంట్ ఫండ్‌కోసం ఇన్వెస్ట్ చేస్తుంది. కానీ ఇలాంటి హైబ్రిడ్ ప్లాన్‌లు సమర్థవంతమైన రాబడులను ఇవ్వలేవు. ఇవి తగిన బీమా రక్షణ కూడా ఇవ్వలేవు. అందుకని ఈ తరహా ప్లాన్‌ల నుంచి వైదొలగడమే శ్రేయస్కరం. కంపెనీ సంబంధిత వ్యక్తులను సంప్రదించి సరెండర్ ఆప్షన్స్ వివరాలను తెలుసుకోండి. బీమా, ఇన్వెస్ట్‌మెంట్ కలగలసిన ప్లాన్‌ల్లో ఎప్పుడూ ఇన్వెస్ట్ చేయకూడదు. జీవిత బీమా కోసం టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవడమే సరైన నిర్ణయం. ఇక దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల కోసం పూర్తిగా మదుపు సంబంధిత సాధనాలు.. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడమే సరైన విధానం. పన్ను ప్రయోజనాలు కావాలనుకుంటే, ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్(ఈఎల్ఎస్ఎస్)ల్లో ఇన్వెస్ట్ చేయాలి. ప్రభుత్వం నిర్వహించే రిటైర్‌మెంట్ ప్లాన్ కావాలనుకుంటే, నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్)ను పరిశీలించవచ్చు. ఎన్‌పీఎస్‌లో ఇన్వెస్ట్ చేస్తే, అదనంగా కొంత పన్ను ప్రయోజనాలు పొందవచ్చు కూడా.

సాక్షి స్పోర్ట్స్
సోమవారం 19-3-2018



“ సెమీఫైనల్లో విజయం కోసం వంద శాతం కష్టపడ్డాను. కానీ తుది ఫలితం నిరాశపరిచింది. క్రీడాకారుల కెరీర్‌లో గెలుపోటములు సహజమే. మ్యాచ్ అన్నాక ఒకరు గెలుస్తారు, మరొకరు ఓడిపోతారు. మూడు గేమ్‌లు ఆడటం సులువేమీ కాదు. ఇలాంటి మ్యాచ్‌ల్లో రెండు, మూడు పాయింట్లే ఫలితాన్ని శాసిస్తాయి. ఆల్ ఇంగ్లండ్ టోర్నీతో నేనెంతో నేర్చుకున్నాను. ఈ సీజన్‌లోని తదుపరి టోర్నమెంట్‌లలో మరింత మెరుగ్గా రాణించేందుకు శ్రమిస్తాను.

- ఆల్ ఇంగ్లండ్ టోర్నీ సెమీస్‌లో ఓటమిపై సింధు ”

దినేశ్ కార్తీక్ సూపర్ హిట్

8 బంతుల్లో 29 నాటౌట్

6, 4, 6, 0, 2, 4, 1, 6

చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన భారత వికెట్ కీపర్ • టీమిండియాదే నిదహాస్ ట్రోఫీ

ఉత్కంఠ ఫైనల్లో బంగ్లాదేశ్‌పై జయభేరి • రాణించిన రోహిత్, చహల్

ఇది అలాంటి ఇలాంటి ఉత్కంఠ కాదు.
తనువును ఉన్నచోటే బంధించింది.
కళ్లను రెప్పలు కొట్టకుండా కట్టేసింది.
గుండె దడను అమాంతం పెంచేసింది.
నిజం... ఆ ఉత్కంఠకు నరాలు కాదు
ఉక్కు తీగలే తెగుతాయేమో?
భారత్ గెలవాలంటే 12 బంతుల్లో 34
పరుగులు... క్రీజులో పాతుకుపోయిన
బ్యాట్స్‌మన్ లేడు. కేవలం జిడ్డుగా,
పరుగులకు అడ్డుగా ఉన్న
విజయ్ శంకరే ఉన్నాడు.
దినేశ్ కార్తీక్ అప్పుడే వచ్చాడు.
అది 19వ ఓవర్! ఇక గెలుపు ఆశలే లేవు.
టి20ల్లో ఏనాడూ బంగ్లాదేశ్ చేతిలో
ఓడిపోని భారత్... ఇపుడు ఏకంగా కప్‌నే
కోల్పోవాల్సిన పరిస్థితి.
కానీ దినేశ్ దడదడలాడించాడు.
రూబెల్ హొస్సేన్ వేసిన ఆ ఓవర్లో
జూలు విదిల్చాడు.
6, 4, 6, 0, 2, 4 అంతే!
భారత విజయ సమీకరణం
6 బంతుల్లో 12 పరుగులైంది.
సౌమ్య సర్కార్ చేతిలో బంతి.
ఇక ఈజీలే అనుకుంటే విజయ్ శంకర్
బంతులు మింగే పనిలో ఉన్నాడు.
తొలి బంతికి వైడ్‌తో పరుగొచ్చింది.
0, 1, 1, ఎట్టకేలకు 4వ బంతికి
ఫోర్ కొట్టి ఐదో బంతికి ఔటయ్యాడు.
ఇక మిగిలింది ఒక్కటే బంతి!
గెలిచేందుకు 5 పరుగులు.
క్రీజులో దినేశ్ కార్తీక్...
ఉత్కంఠ ఎవరెస్టంతా.
అందరిలోనూ టెన్షన్... టెన్షన్...
కార్తీక్ ఒక్కడే అటెన్షన్. సౌమ్య సర్కార్
బంతి వేశాడు. అందరూ కళ్లప్పగించి
చూస్తుండగా కార్తీక్ బ్యాట్ నుంచి
ఎక్స్‌ట్రా కవర్స్ మీదుగా ఫ్లాట్ షాట్.
ఫోరేమోననే బెంగ... కానీ అది సిక్సర్.
భారతే విన్నర్.





8 టి20 ఫార్మాట్‌లో బంగ్లాదేశ్‌పై భారత్‌కిది వరుసగా ఎనిమిదో విజయం.

1 టి20 మ్యాచ్‌ల్లో చివరి బంతికి విజయానికి 5 పరుగులు అవసరం కాగా... సిక్స్ కొట్టి గెలిపించిన తొలి బ్యాట్స్‌మన్ కార్తీక్.

2 అంతర్జాతీయ టోర్నమెంట్ ఫైనల్లో చివరి బంతికి సిక్స్ కొట్టి గెలిపించిన రెండో క్రికెటర్ దినేశ్ కార్తీక్. ఇంతకు ముందు 1986లో షార్జాలో జరిగిన ఆస్ట్రేలేసియా కప్ ఫైనల్లో భారత్‌పై చివరి ఓవర్ చివరి బంతికి మియాందాద్ సిక్స్ కొట్టి పాక్‌ను గెలిపించాడు.

5 ఆఖరి బంతికి సిక్స్ కొట్టి అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో జట్టును గెలిపించిన ఐదో క్రికెటర్ దినేశ్ కార్తీక్. గతంలో కపుగెదెర (శ్రీలంక; భారత్‌పై 2010లో), మోర్గాన్ (ఇంగ్లండ్; భారత్‌పై 2012లో), బాబర్ (పాకిస్తాన్; విండీస్‌పై 2013లో), సిబండ (జింబాబ్వే; నెదర్లాండ్స్‌పై 2014లో) ఇలా చేశారు.

కొలంబో: దినేశ్ కార్తీక్ 29 నాటౌట్. లెక్కకు స్కోరు తక్కువే! కానీ 8 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో మ్యాచ్‌నే మలుపు తిప్పే ఇన్నింగ్స్ ఆడాడు. భారత్‌కు ఒంటిచేత్తో నిదహాస్ ట్రోఫీని అందించాడు. బంగ్లాదేశ్‌తో ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. షబ్బీర్ రహమాన్ (50 బంతుల్లో 77; 7 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించాడు. యజువేంద్ర చహల్ 3, ఉనాద్కట్ 2 వికెట్లు తీశారు. తర్వాత భారత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసి గెలిచింది. రోహిత్ శర్మ (42 బంతుల్లో 56; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) రాణించాడు. రూబెల్ హొస్సేన్‌కు 2 వికెట్లు దక్కాయి. దినేశ్ కార్తీక్‌కు ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’... వాషింగ్టన్ సుందర్‌కు ‘మ్యాన్ ఆఫ్ ద సిరీస్’ అవార్డులు లభించాయి. ఈ మ్యాచ్‌లో భారత్ ఒక మార్పు చేసింది. హైదరాబాదీ పేసర్ సిరాజ్ స్థానంలో ఉనాద్కట్‌ను బరిలోకి దించింది.

స్పిన్‌తో విలవిల...

టాస్ నెగ్గిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా బ్యాట్స్‌మెన్‌ను భారత స్పిన్నర్లు కట్టడి చేశారు. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో జట్టు స్కోరు 27 పరుగుల వద్ద ఓపెనర్ లిటన్ దాస్ (11; 1 సిక్స్)ను సుందర్ ఔట్ చేయగా, ఆ మరుసటి ఓవర్లోనే చహల్ దెబ్బమీద దెబ్బ తీశాడు. మరో ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ (15; 1 ఫోర్)తో పాటు సౌమ్య సర్కార్ (1)నూ పెవిలియన్ చేర్చాడు. తమీమ్ భారీ సిక్సర్‌కు ప్రయత్నించగా, లాంగాన్‌లో ఫీల్డర్ శార్దుల్ ఠాకూర్ బౌండరీ లైన్ వద్ద తనను తాను నియంత్రించుకుంటూ అద్భుతమైన క్యాచ్ పట్టాడు. దీంతో 27 పరుగుల వద్దే బంగ్లా రెండో వికెట్ కోల్పోయింది. తర్వాత వచ్చిన సౌమ్య సర్కార్ స్వీప్‌షాట్ ఆడగా... స్క్వేర్ లెగ్‌లో శిఖర్ ధావన్ క్యాచ్ అందుకున్నాడు. 33 పరుగులకే మూడు కీలక వికెట్లను కోల్పోయిన బంగ్లాను షబ్బీర్ రహమాన్, ముష్ఫికర్ రహీమ్ ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ చహల్ వారికి ఆ అవకాశం ఇవ్వలేదు. గూగ్లీతో ముష్ఫికర్ (9) ఆట కట్టించాడు. అతని క్యాచ్‌ను విజయ్ శంకర్ డైవ్ చేసి పట్టడంతో బంగ్లా 68 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోయింది.

ఆదుకున్న షబ్బీర్...

అనంతరం షబ్బీర్‌కు మహ్మదుల్లా జతయ్యాడు. ఇద్దరు అడపాదడపా బౌండరీలతో రన్‌రేట్ తగ్గకుండా జాగ్రత్త పడ్డారు. దీంతో బంగ్లాదేశ్ 14వ ఓవర్ చివరి బంతికి 100 పరుగులు పూర్తి చేసుకుంది. ఇన్నింగ్స్ కుదుటపడిందనుకున్న ఈ దశలో సమన్వయలేమితో మహ్మదుల్లా (16 బంతుల్లో 21; 2 ఫోర్లు) రనౌటయ్యాడు. లేని పరుగుకు ప్రయత్నించిన షబ్బీర్... మహ్మదుల్లాను బలిచేశాడు. తర్వాత వచ్చిన షకీబుల్ హసన్ అండతో షబ్బీర్ 37 బంతుల్లో (5 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. విజయ్ శంకర్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్లో షబ్బీర్ 2 భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అదే ఓవర్ ఐదో బంతికి షకీబుల్ (7) కూడా రనౌటయ్యాడు. డెత్ ఓవర్లలో స్కోరు పెంచేందుకు సిద్ధమవుతున్న షబ్బీర్‌ను 19వ ఓవర్లో ఉనాద్కట్ క్లీన్ బౌల్డ్ చేశాడు. మరుసటి బంతికి రూబెల్ హొస్సేన్ (0) కూడా బౌల్డయ్యాడు. శార్దుల్ వేసిన చివరి ఓవర్లో మెహదీ హసన్ మిరాజ్ 2 ఫోర్లు, 1 సిక్స్‌తో మొత్తం 18 పరుగులు సాధించాడు.

స్పిన్‌కు పేస్ జతకాలేదు...

స్పిన్నర్లు చహల్ (3/18), సుందర్ (1/20) పవర్ ప్లేలో బంగ్లా (40/3)ను కట్టడి చేశారు. వీరి శ్రమకు పేసర్లు జతయితే బంగ్లా స్వల్ప స్కోరుకే పరిమితమయ్యేది. కానీ విజయ్ శంకర్ (0/48), శార్దుల్ ఠాకూర్ (0/45) ధారాళంగా పరుగులు సమర్పించుకోవడంతో బంగ్లాదేశ్ పోరాడే లక్ష్యాన్నే భారత్ ముందుంచింది.

తడబడింది...

లక్ష్యఛేదనకు దిగిన భారత ఇన్నింగ్స్ ధాటిగా ప్రారంభమైంది. రెండో ఓవర్లో కెప్టెన్ రోహిత్ రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాదడంతో 17 పరుగులు వచ్చాయి. రెండు ఓవర్లలోనే 24 పరుగులు చేయగా... ఆ తర్వాతి వరుస ఓవర్లలో ధావన్ (10), రైనా (0)లు నిష్క్రమించడంతో భారత్ ఇన్నింగ్స్ తడబడింది. ఈ దశలో రోహిత్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. ముందుగా రాహుల్‌తో కలిసి రన్‌రేట్ తగ్గకుండా లక్ష్యం దిశగా నడిపించాడు. బ్యాట్‌కు అందిన బంతిని భారీ సిక్సర్లుగా, అదుపు తప్పిన బంతిని బౌండరీగా మలుస్తూ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. మూడో వికెట్‌కు వీరిద్దరు 51 పరుగులు జోడించాక జట్టు స్కోరు 83 పరుగుల వద్ద రాహుల్... రూబెల్ హొస్సేన్ బౌలింగ్‌లో షబ్బీర్‌కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. దీంతో మనీశ్ పాండే క్రీజ్‌లోకి రాగా... రోహిత్ 35 బంతుల్లో (4 ఫోర్లు, 3 సిక్సర్లు) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అంతర్జాతీయ టి20ల్లో అతనికిది 14వ అర్ధ సెంచరీకాగా కొద్దిసేపటికే నాలుగో వికెట్‌గా నిష్క్రమించాడు. నజ్ముల్ ఇస్లామ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన రోహిత్ మహ్మదుల్లా క్యాచ్ పట్టడంతో పెవిలియన్ చేరాడు.

బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్‌గా వచ్చిన విజయ్ శంకర్ భారత ఇన్నింగ్స్‌కు గుదిబండగా మారాడు. పాండే (27 బంతుల్లో 28; 3 ఫోర్లు) వేగంగా పరుగులు చేస్తుంటే... మరోవైపు విజయ్ (19 బంతుల్లో 17; 3 ఫోర్లు) అదేపనిగా బంతుల్ని వృథా చేశాడు. దీంతో సమీకరణం మారింది. 15 ఓవర్లు ముగిసే సరికి 30 బంతుల్లో 52 పరుగులు చేయాల్సి ఉండగా, 18 బంతుల్లో 35కు పెరిగింది. 18వ ఓవర్ వేసిన ముస్తఫిజుర్ కేవలం పరుగు మాత్రమే ఇచ్చి పాండే వికెట్ తీశాడు. ఇక భారత్ గెలవాలంటే 12 బంతుల్లో 34 పరుగులు చేయాలి. ఈ దశలో వచ్చిన దినేశ్ కార్తీక్ అసాధారణ ఆటతీరుతో భారత్‌ను గెలిపించాడు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తమీమ్ ఇక్బాల్ (సి) శార్దుల్ ఠాకూర్ (బి) చహల్ 15; లిటన్ దాస్ (సి) రైనా (బి) సుందర్ 11; షబ్బీర్ (బి) ఉనాద్కట్ 77; సౌమ్య సర్కార్ (సి) ధావన్ (బి) చహల్ 1; ముష్ఫికర్ రహీమ్ (సి) శంకర్ (బి) చహల్ 9; మహ్మదుల్లా (రనౌట్) 21; షకీబుల్ హసన్ (రనౌట్) 7; మెహదీ హసన్ (నాటౌట్) 19; రూబెల్ (బి) ఉనాద్కట్ 0; ముస్తఫిజుర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 166**

వికెట్ల పతనం: 1–27, 2–27, 3–33, 4–68, 5–104, 6–133, 7–147, 8–148.

బౌలింగ్: ఉనాద్కట్ 4–0–33–2, సుందర్ 4–0–20–1, చహల్ 4–0–18–3, శార్దుల్ ఠాకూర్ 4–0–45–0, విజయ్ శంకర్ 4–0–48–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) మహ్మదుల్లా (బి) ఇస్లాం 56; ధావన్ (సి) సబ్ (అరిఫుల్ హక్) (బి) షకీబుల్ హసన్ 10; రైనా (సి) ముష్ఫికర్ (బి) రూబెల్ 0; రాహుల్ (సి) షబ్బీర్ (బి) రూబెల్ 24; మనీశ్ పాండే (సి) షబ్బీర్ (బి) ముస్తఫిజుర్ 28; శంకర్ (సి) మెహదీ హసన్ (బి) సౌమ్య సర్కార్ 17; దినేశ్ కార్తీక్ (నాటౌట్) 29; సుందర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 168**

వికెట్ల పతనం: 1–32, 2–32, 3–83, 4–98, 5–133, 6–162.

బౌలింగ్: షకీబుల్ హసన్ 4–0–28–1, మెహదీ హసన్ 1–0–17–0, రూబెల్ 4–0–35–2, ఇస్లాం 4–0–32–1, ముస్తఫిజుర్ 4–1–21–1, సౌమ్య సర్కార్ 3–0–33–1.

విదర్భదే ఇరానీ కప్



తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో టైటిల్

- రెస్టాఫ్ ఇండియాతో మ్యాచ్ ‘డ్రా’
- హనుమ విహారి (183) పోరాటం వృథా

నాగ్‌పూర్: తొలిసారి రంజీ ట్రోఫీ సాధించిన విదర్భ జట్టు ఇరానీ ట్రోఫీని కూడా సొంతం చేసుకుంది. రెస్టాఫ్ ఇండియాతో ఇక్కడ జరిగిన ఇరానీ కప్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసిన విదర్భ ఆ తర్వాత ప్రత్యర్థిని 390 పరుగులకే ఆలౌట్ చేసి 410 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ట్రోఫీ చేజిక్కించుకుంది. మ్యాచ్ చివరి రోజు మరోసారి బ్యాటింగ్‌కు దిగిన విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్లేమీ కోల్పోకుండా 79 పరుగులు చేసింది. ఐదు రోజుల ఫైనల్లో ఫలితం తేలకపోవడంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకున్న విదర్భకు టైటిల్ ఖాయమైంది. తొలి ఇన్నింగ్స్‌లో 286 పరుగులు చేసిన వెటరన్ బ్యాట్స్‌మన్ వసీం జాఫర్‌కు ‘మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కింది. అంతకుముందు 236/6 పరుగులతో ఆదివారం ఆట కొనసాగించిన రెస్టాఫ్ ఇండియా ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ హనుమ విహారి (327 బంతుల్లో 183; 23 ఫోర్లు, 3 సిక్స్‌లు), జయంత్ యాదవ్ (96; 14 ఫోర్లు) పోరాడటంతో ఒక దశలో 314/6తో నిలిచింది. కానీ జయంత్ అవుటయ్యాక విహారికి సహకారం అందించే వారు కరువయ్యారు. దీంతో భారీ షాట్లు ఆడిన అతను చివరి వికెట్ రూపంలో వెనుదిరిగాడు. ప్రత్యర్థి బౌలర్లలో గుర్బానీ 4, ఆదిత్య సర్వతే 3, ఉమేశ్ యాదవ్ 2 వికెట్లు పడగొట్టారు.



విహారి

హనుమ విహారి భారీ శతకం

రెస్టాఫ్ ఇండియా ఇన్నింగ్స్‌లో ఆంధ్ర ఆటగాడు హనుమ విహారి ఆటే హైలైట్. 77 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన దశలో క్రీజులో కొచ్చిన అతను తుదికంటా పోరాడాడు. సహచరులంతా ఒక్కొక్కరుగా వెనుదిరుగుతున్నా స్పిన్నర్ జయంత్ యాదవ్‌తో కలిసి ఏడో వికెట్‌కు 216 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశాడు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 81 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్న విహారి చివరి రోజు మరో 102 పరుగులు చేసి భారీ శతకం బాదాడు. జయంత్ అవుటయ్యాక లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ నదీమ్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 59 పరుగులు జతచేశాడు. ఆ తర్వాత భారీ షాట్లకు దిగిన అతను సర్వతే బౌలింగ్‌లో అపూర్వ్ వాంఖడేకు చిక్కడంతో రెస్టాఫ్ ఇండియా ఇన్నింగ్స్‌కు తెరపడింది.

సంక్షిప్త స్కోర్లు: విదర్భ తొలి ఇన్నింగ్స్: 800/7; రెస్టాఫ్ ఇండియా తొలి ఇన్నింగ్స్: 390 ఆలౌట్ (విహారి 183, జయంత్ యాదవ్ 96, రజనీశ్ గుర్బానీ 4/70); విదర్భ రెండో ఇన్నింగ్స్ 79/0 (అక్షయ్ వాడ్కర్ 50).

27 ప్రతి ఏడాది రంజీ ట్రోఫీ విజేత, రెస్టాఫ్ ఇండియా జట్ల మధ్య జరిగే ఇరానీ కప్‌ను రంజీ చాంపియన్ గెల్చుకోవడం ఇది 27వ సారి.


చివరి వన్డేలోనూ భారత మహిళల ఓటమి



వడోదర: ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్‌లో భాగంగా ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరిగిన వన్డే సిరీస్ చివరి మ్యాచ్‌లోనూ భారత్ ఓడింది. ఆదివారం జరిగిన మూడో వన్డేలో ఆసీస్ 97 పరుగులతో నెగ్గింది. దీంతో మిథాలీ బృందం 0–3తో సిరీస్ కోల్పోయింది. మొదట అలీసా హీలీ (133; 17 ఫోర్లు, 2 సిక్స్‌లు) విజృంభణతో ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 7వికెట్లకు 332 పరుగులు చేసింది. అనంతరం మిథాలీ బృందం 44.4 ఓవర్లలో 235 పరుగులకే ఆలౌటైంది. స్మృతి మంధాన (52; 10 ఫోర్లు) జెమీమా (42; 7 ఫోర్లు) రాణించారు.

చాంప్ తై జు యింగ్

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను తై జు యింగ్ (చైనీస్ తైపీ), పురుషుల సింగిల్స్ టైటిల్‌ను షి యుకి (చైనా) సొంతం చేసుకున్నారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ చాంపియన్ తై జు యింగ్ 22–20, 21–13తో రెండో సీడ్ అకానె యామగుచి (జపాన్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో షి యుకి 21–19, 16–21, 21–9తో తన దేశానికే చెందిన దిగ్గజం లిన్ డాన్‌పై సంచలన విజయం సాధించాడు.



ఎదురులేని ఫెడరర్

- ఇండియన్ వెల్స్ మాస్టర్స్ ఫైనల్లోకి ప్రవేశం
- వరుసగా 17వ విజయం

కాలిఫోర్నియా: తన ప్రత్యర్థి నుంచి ఊహించని ప్రతిఘటన ఎదురైనా... అనుభవాన్నంతా రంగరించి పోరాడిన స్విస్ టెన్నిస్ స్టార్ రోజర్ ఫెడరర్ ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రపంచ 49వ ర్యాంకర్ బోర్నా కొరిక్ (క్రొయేషియా)తో జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ఫెడరర్ 5–7, 6–4, 6–4తో గెలుపొందాడు. 2 గంటల 20 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఫెడరర్‌కు గట్టిపోటీనే లభించింది. తొలి సెట్ కోల్పోయిన ఈ డిఫెండింగ్ చాంపియన్ రెండో సెట్‌లో 2–4తో వెనుకబడ్డాడు. అయితే 20 ఏళ్లుగా అంతర్జాతీయ టెన్నిస్ ఆడుతోన్న ఫెడరర్ ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడుతూ వరుసగా నాలుగు గేమ్‌లు గెలిచి రెండో సెట్ 6–4తో నెగ్గి మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణాయక మూడో సెట్‌లోనూ ఓ దశలో ఫెడరర్ 3–4తో వెనుకబడ్డాడు. ఈసారీ ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా వరుసగా మూడు గేమ్‌లు సాధించి సెట్‌తోపాటు మ్యాచ్ దక్కించుకున్నాడు. ఫైనల్లో యూఎస్ ఓపెన్ మాజీ చాంపియన్ డెల్ పొట్రో (అర్జెంటీనా)తో ఫెడరర్ ఆడతాడు. ‘సెమీస్‌లో విజయం అంత సులువుగా లభించలేదు. కీలక సందర్భాల్లో అదృష్టం కూడా కలిసొచ్చింది. ఈ తరహా మ్యాచ్‌లు నా కెరీర్‌లో చాలాసార్లు ఆడాను. ఓ సీజన్‌లో వరుసగా 17 విజయాలు దక్కడం నా కెరీర్‌లో ఇదే తొలిసారి. ఇదే జోరును ఫైనల్లోనూ కొనసాగిస్తాను’ అని 36 ఏళ్ల ఫెడరర్ వ్యాఖ్యానించాడు.

తన 20 ఏళ్ల ప్రొఫెషనల్ కెరీర్‌లో ఫెడరర్ తొలిసారి ఓ సీజన్‌ను వరుసగా 17 విజయాలతో ప్రారంభించాడు. 2006 సీజన్ ఆరంభంలో వరుసగా 16 విజయాలు నమోదు చేయడమే ఇప్పటిదాకా అతని అత్యుత్తమ ప్రదర్శన. కానీ ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నమెంట్‌లో ఈ స్విట్జర్లాండ్ స్టార్ తన జైత్రయాత్ర కొనసాగిస్తూ టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. రికార్డుస్థాయిలో ఆరో టైటిల్‌కు మరో విజయం దూరంలో నిలిచాడు.







Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.